ఆంధ్రసచిత్రవారపత్రిక




19-7-74
55 పైసల

ఎల్లప్పటికి ప్రపంచములో అతి శీఘ్రమైన, ఎంతో విజయవంతమైన బోడీ షేపర్

స్త్రీ పురుషులు!

అసహ్యంగా ఉన్న లావును త్వరగా తగ్గించుకోండి



new from America

Roi Macour*

5 Minute Body Shaper

The figure shaper that work wonders for you

రూయీ మాసర్ మీ నడుము, పిరుదులు, తొడలు 9-10 సెం.మీ. తగ్గటానికి మీకు సహాయం చేస్తుంది. దానికి హామీ ఉంది. ఎందుకంటే రోజు రోజుకు కలుగుతున్న మార్పును మీరు కొలవవచ్చును.

అసహ్యంగా లావుగా ఉండే భాగాలు మిమ్మల్ని మీ వయస్సుకంటే పెద్దవారిగా కనబడేటట్లు చేస్తాయి.

స్థూలకాయం, మిమ్మల్ని వయస్సుకు మించిన వారిగా కనబడేలాగా, వృద్ధులమా అనే భావం ఉండేటట్టుగాను, అన్ని పనులు వృద్ధాప్యం మీద పడినవారు చేసేటట్లు గాను తయారుచేస్తుంది. మేడమ్ రోచన్ యొక్క రూయీ మాసర్ బోడీ షేపర్ తిరిగి మిమ్మల్ని యౌవనవంతులు గాను, సొగసైన, ఇంకా ఎక్కువ సెక్సీ రూపానికి ఒక్క 21 రోజులలోనే తీసుకు వస్తుంది ప్రపంచములో చాలా ప్రసిద్ధిచెందిన మోడల్స్ రోజుకు 5 నిమిషాలు మాత్రమే చేసే ఈ సులువైన వ్యాయామాన్ని సిఫార్సు చేస్తున్నారు.

అవును, నాకు తగ్గాలని ఉంది
నాకు నా శరీరానికి సెక్సీ అపీల్
ఉండాలని ఉంది.

RM 166 TEL

CONFIDENTIAL

డబ్బు తిరిగి ఇవ్వబడును అన్న హామీతో సమర్పణ
"ఆ లావును అతి త్వరగా తగ్గించుకోండి"

SVP/28/6

మేడమ్ రోచస్ 612, పన్నగేట్-చాంబర్స్, న్యూ మెరైన్ లైన్స్, బొంబాయి-400 020.

తరువాత కొలపదగిన, ఖచ్చితమైన ఫలితాలను 14 రోజులలో వి. పి. పి. ఛార్జీలు అదనం చూడండి. అల్లాకాకపోతే మీ డబ్బు వాపసు కోసం (పోస్టేజి, పేకింగ్ మినహాయించుకొని) ఆ వ్యాయామ వస్తువును, కోర్సును మాకు తిరిగి పంపెయ్యండి పంపండి

దయచేసి నాకు రూయీ మాసర్ బోడీ షేపర్‌ను, 55 రూపాయలకు, అన్నీ కలుపుకొని) 2 వారాల హామీ కాలంకింద వెంటనే పంపవలసింది.

☐ మని ఆర్డర్ ☐ చెక్ ☐ వి. పి. పి. కావలసినది టిక్ చేయండి.

నాకు సంతృప్తి కలగకపోతే 2 వారాలలో పూర్తి డబ్బు వాపసు కోసం (పోస్టేజి పేకింగ్ మినహాయించుకొని) నేను తిరిగి పంపగలను.

నేను వి.పి.పి. ద్వారా ఆర్డరు చేస్తున్నాను. పోస్టుమేన్‌కి డబ్బు ఇస్తానని నేను హామీ ఇస్తున్నాను. దయచేసి స్పష్టంగా ఇంగ్లీషులో వ్రాయండి.

NAME ________ AGE ________

ADDRESS ________

CITY ________ STATE ________

Cheques/Money Orders should be made in favour of ROSS MURARKA INC.

కత్తిరించి వెంటనే పంపండి.

ఆంధ్రసచిత్ర వారపత్రిక

వ్యవస్థాపకులు :
దేశోద్ధారక కాశీనాధుని
నాగేశ్వరరావు పంతులుగారు

శివలెంక శంభుప్రసాద్
సంపాదకుడు
(1938 - 1972)

శుక్రవారం : 19–7–'74
శ్రీ ఆనందనామ సం. ఆషాఢమాస బ. అమావాస్య
సంపుటము : 67 సంచిక 47

స్థాపితం : 1908
సంపాదకుడు
శివలెంక రాధాకృష్ణ

ఆంధ్రపత్రిక కార్యాలయము
గాంధీనగరం, విజయవాడ-3.

సంవత్సర చందా – రు. 31-20 పై.
ఆరుమాసాల చందా – రు. 15-60 పై.
విడి ప్రతి వెల 55 పైసలు

విషయసూచిక

ముఖచిత్రం: కుమారి .... విదుబాల
(ఫోటో: ... ఆర్ట్ స్టూడియో)

కథలు :

సీరియల్ కథలు :

వ్యాసాలు, శీర్షికలు :

మనలోమాట

★ మళ్లీ 'మరో తెలుగోడి గోడు' వచ్చింది. ఈ సంచికలో 16, 17 పేజీలు రెండూ అందుకే అంకితమైనాయి.

★ తిరుమల రామచంద్ర గారు అస్వస్థులైన కారణంగా యీవారం 'హైదరాబాద్ నోట్‌బుక్' మా పాఠకులకు అందించ లేక పోతున్నాము.

★ ఈ నెలాఖరుకు యిప్పుడు వస్తున్న సీరియల్ కథలలో ఒకటి అయిపోగానే, కొత్త సీరియల్ 'అతకని అనుబంధాలు' ప్రారంభించాలని సంకల్పం.

ఉత్తరాలు

లార్డ్స (లాస్ట్) క్రికెట్

ఇక్కడ కూడా హిందీ !
ఆ జాడ్యానికి క్రికెట్ కూడా బందీ
ఇక్తాలీస్, బయాలీస్ తెలిస్తే హీరో
సగటు క్రికెట్ అభిమానికి ఆ నాలెడ్జి జీరో
'సుందర్ స్ట్రోకు' అనడం విని ఉన్నాడనుకోవద్దు
'సుందర్'
'అగ్లీ' బాల్ అంటే కాదు బంతి అగ్లీ !
ఇంగ్లండులో అందరికన్నా చిన్న క్రికెటరు
పేరు 'వోల్డ్ !'
కారణం అతనే తెలియ చెప్పాడు వోల్డ్ ఈజ్ గోల్డ్
నాట్‌అవుట్ అని వినవద్దు భ్రమ వద్దు, కాలేదు
'నాట్' అవుట్
కాకపోతే ఒక్క టెస్టుతో 'వెలివేయ'బడ్డాడు
బాయ్‌కాట్.
పోగొట్టుకుంది మన క్రికెట్ నీరాజనాలు తవుజండ్స
ఆల్‌రవుండర్లకి లభించాయి ఆల్ 'రవుండ్స'
చంద్రశేఖర్ కెరీర్‌లో పరుగులకన్నా వికెట్లు
ఎక్కువ
అతడు చివరికి తీర్చలేదు ప్రజల ముక్కువ.
మనకి వికెట్లు పోవడం ఒక చెయిన్.
నిజానికి సరిగ్గా ఆడనిది పన్నెండో ప్లేయరు
'మిస్టర్ రెయిన్'!

కాశీనాథ అండ్ కాశీనాథ (ఒంగోలు)

సీరియల్

ఈ వారం (5—7—74) పత్రికపై అభినేత్రి చంద్రకళ ముఖచిత్రం సర్వాంగ సుందరమై కుందనపు బొమ్మలా ఎంతో అందంగా ఉన్నది. ఇంతవరకు యద్దనపూడిగారి కలం నుండి వెలువడిన "బంగారు కలలు" సీరియల్ చాలా యింటరెస్టింగుగా సాగి, కథా చివరిభాగంలో సరోజ పరారియై పోవడం ఏంబాగులేదు. దానికి బదులుగా సరోజ, ప్రసాదును పెళ్లి చేసుకొని యుంటే, ప్రసాదుకు కొంత ప్రాముఖ్యం యిచ్చినట్లుగా ఉండును.

జూనియర్ రంగారావు గాడి (బెరహాంపూర్)

* * *

ఈ వారం (ది 5—7—74) పత్రిక చంద్రకళ ముఖచిత్రంతో ఎంతో ఆకర్షనీయంగా ఉంది. యద్దనపూడి సులోచనారాణి గారి "బంగారు కలలు" సీరియల్ ఈ వారంతో అనుకోనివిధంగా ముగిసినది. కాని ప్రసాద్‌ని, సరోజని కలిపి ఉన్నట్లయితే కథకు నిండుతనం వచ్చియుండేది. కథ మొదటి నుండి ఎంతో ఇంటరెస్టుగా నడిచినది.

కొత్రటగడ్డ ప్రఫుల్లచంద్, కె. పూర్ణచంద్రరావు, (రేపల్లె)

* * *

యద్దనపూడి సులోచనారాణిగారి "బంగారు కలలు" సీరియల్ ప్రారంభం నుండి ముగింపు వరకు రమ్యమయిన మార్గంలో రసవత్తరంగా నడిచింది. పాత్రలకు ప్రాణంపోసి కథలు వ్రాయడం ఒక్క సులోచనారాణి గారికే తెలుసు. పాఠకుల హృదయాలలో 'సరోజ' చిరంజీవయి ఉంటుంది. మన సంఘంలో ప్రతీ పురుషుడు 'డాక్టర్ ప్రసాద్' వంటి మనస్సు ఉన్న వారుంటే—జీవితంలో కాలుజారిన ప్రతి 'స్త్రీ'కి—వో పవిత్రస్థానం లభిస్తుంది.

సుంకర భారతి రాం (యలమంచిలి)

* * *

పదిహేడువారాలుగా ధారాళంగా వెలువడిన "యద్దనపూడి సులోచనరాణి" గారి సీరియల్ కథ "బంగారు కలలు" పత్రికకు ఒక మణిపూస వంటిది.

"బంగారు కలలు" ముగింపులో సరోజ పాత్ర చదివిన తరువాత మా కళ్ల నుండి కన్నీళ్లు ఆగలేక పోయాయి.

వ్యాయవతి రమేశ్‌బాబు, బరంపురం (ఒరిస్సా) ●



భగ్నప్రేమ – ఆత్మహత్య

అలూరుకు చెందిన 24 ఏళ్ల ఉదయశంకర్ అనే కుర్రవాడు అదేవూరుకు చెందిన 16 ఏళ్లగిరిజ అనే అమ్మాయిని ప్రేమించి, ఆనక పెళ్లి చేసుకుందామనుకున్నాడట దీనికి ఆ అమ్మాయి అంగీకరించినా, తన తలిదండ్రులు, ఆమె తలిదండ్రులూ ఒప్పుకోనందువల్ల ప్రేయసీ ప్రియులిద్దరూ బెంగుళూరువెళ్లి, వో హోటల్లో రూము తీసుకుని విషం మింగి ఆత్మహత్య చేసుకుని, తమ కథ సారాంశం వో చిన్న ఉత్తరం రాసిపెట్టారట ప్రియుడు పి యు సి, ప్రేయసి యస్సెల్సి చదివారట— వ టిప్ ప్రేమక చదువో కొలబద్దా !

ప్రజా ప్రతినిధికి ఇనుపగొలుసుల సన్మానం

బీహర్ లెజిస్లేటర్ రామ్‌లఖన్‌చౌధురి అనే ఆయన్ను ఉపనిర్మాణ సమితి అనే వో సమితికి చెందిన కొందరు బంధించి, ఆయన్నుమెడకో ఇనుప గొలుసుకట్టి రాంచి పుర వీధుల్లో 40 నిమిషాలు సేపు వూరేగించి మరీ వదిలారట స్టేట్ ఎసెంబ్లీ నుంచి ఆయన రాజీనామా చేయక పోవడమే దీనికి కారణమట అయితే యీ వూరేగింపు జరిగిన నలభై నిముషాలూ ఆ ప్రాంతంలో కనీసం ఒక్క పోలీసు కూడా లేదట వారు మాత్రం మనుష్యులుకారా ఏం!!

కుటుంబ నియంత్రణ పాడుచేస్తున్నది మగవారే !

హిందూ దేశంలోని ఫామిలీ ప్లానింగు (అనగా కుటుంబ నియంత్రణ) పాడవడానికేవలం దేశంలోని మగవారే కారణమని మేడమ్ గాంధి అన్నారట దేశంలోని నిరక్షరాస్యత కారణమా అని వో విలేఖరి అడిగిన ప్రశ్నకు ఆవిడ "కాదు మగవారే" అన్నారట మరి ఆడవారు కారణమే కాదా !


రక్తదానంలో ఆత్మతృప్తి

ఇల్లినాయస్‌కు చెందిన 65 ఏళ్ల జోసెఫ్ కిరోవ్‌స్కీ అనే ఆయన తాను గత 30 ఏళ్లుగా రక్తదానం చేస్తున్నట్టు తెలియ జేశారట చిన్నతనంలో వో ప్రమాదంలో తనకు చెయ్యిపోయినట్టు తత్ఫలితంగా తాను తన సోదరులతో పాటు యుద్ధంలో (రెండో ప్రపంచ యుద్ధం) చేరలేక పోయినట్టు చెప్పి, అందువలన తాను గత 30 ఏళ్లుగా రక్తదానం చేస్తున్నట్టు దానివల్ల తనకు ఆత్మతృప్తి కలుగుతోందని అన్నారట

త్వరలో

★ మాతృమూర్తి

★ భవబంధాలు





మశూచికంలో భారత్ ముందడుగు !

ప్రపంచంలో మశూచికం ఎక్కువగా వచ్చిన దేశాలలో హిందూదేశం అగ్రస్థానం కొట్టేసిందట. ఈ దేశంలో మశూచికం 83 శాతమట. మొన్న జూన్ 11 వరకూ జరిగిన లెక్కలలో హిందూదేశం 1,06,676 కేసులు చూపించిందట. పోయినేడు యిదే కాలానికి 41,970 కేసులేనట.

అణుపరీక్షా ఫలితం పాకిస్తాన్‌లో కనిపిస్తోందా !

మొన్న మే 18న హిందూదేశం చేసిన ఆటమిక్ టెస్టు ఫలితంగా తమదేశంలో అణుధార్మికశక్తి పుట్టినట్టు పాకిస్తాన్ ఆటమిక్ ఎనర్జీ కమిషను అన్నదట. పాకిస్తాన్ సరిహద్దుకు 64 కిలోమీటర్ల దూరంలో హిందూదేశంలో జరిగిన పరీక్ష ఫలితం వారి దేశంలో కనుపిస్తోందట!

కుటుంబం ఆత్మహత్య—కారణం తెలుసుకోలేని పోలీసు

వెల్లితిరువూరు అనే వూరులో 35 ఏళ్ల వచ్చు ముత్తు అనే ఒకతను, అతనిభార్య 30 ఏళ్ల కన్నియమ్మ విషంత్రాగి ఆత్మాహుతి చేసుకోడమేగాక, తమ ముగ్గురు పిల్లలకూ్కడా ఆ విషమే పెట్టి చంపేశారట. పోలీసులకు యీ చర్యకు్కారణం దొరకలేదట.

దొంగ కుక్కల మందు

కుక్కల మందులలో దొంగమందులు వస్తున్నాయని కనుక "కుక్కలున్నవారు జాగ్రత్త" అని ప్రభుత్వం (కేంద్రం) వో ప్రకటన చేసిందట. డి హెచ్. ఎల్. వాక్సిన్ అనే వో మందు, కుక్కలకు రోగనివారిణిగా యిస్తారని, ఆ మందు ప్రస్తుతం దొరకనందువల్ల దొంగమందు తయారై మార్కెట్టులకి వస్తోందని కూడా అన్నదట.

"అమ్మా! అమ్మాయిని తీసుకురండి" మీన మేషాలు లెక్కపెట్టి, శుభ ఘడియలు ఆసన్నమైన పిదప గావు కేక పెట్టేడు సిద్ధాంతి. అది పెళ్లిచూపుల సంరంభం.

గుమ్మం తెర తొలగించుకొని, మెల్లగా, తలవంచుకుని వలహంసలా అమ్మాయి వచ్చి, తనకై ఏర్పరిచిన చాపలో ఒద్దికగా కూచుంది.

అందరి చూపులు ఆమె మీదే వున్నాయి అబ్బాయి (పెళ్లికొడుకు) సభ్యత మరచి, ఆమెనే చూడసాగాడు. మెల్లగా తలెత్తి, అబ్బాయిని క్రీగంట చూచిన అమ్మాయి, అబ్బాయి కూడా ఆమె కేసి చూస్తూండగా, ఆమె కళ్లు అతని కళ్లతో కలియగా బెంబేలు పడిపోయి తలవంచేసుకుంది. అబ్బాయి. ఛటుక్కున తలత్రిప్పేసుకుని, "అబ్బ! ఎంత అందమైన కళ్లు!!" అనుకున్నాడు మనసులో రెండుసార్లు.

"నీ పేరేమిటమ్మా ?" ఇంటర్వ్యూ బోర్డులో ఛైర్మన్‌లాగ ప్రశ్నించాడు మధ్యవర్తి సిద్ధాంతి.

"శ్యామలండి" వీణ మీటినట్లుంది ఆ కంఠధ్వని.

"అబ్బ! ఎంత తియ్యని కంఠం!!" అబ్బాయి స్వగతం.

"ఎంతవరకు చదువుకున్నావు?" ఈ సారి అబ్బాయి తండ్రి ప్రశ్నించాడు.

"బియ్యే ఫైనలియర్ చదువుతున్నానండి." అమ్మాయి వినయంగా జవాబిచ్చింది.

ఆతృతగా, ఆందోళనగా చూస్తున్నాడు అమ్మాయి తండ్రి. ఆ స్థితిలో తన తండ్రిని చూచిన అమ్మాయి హృదయం బాధగా మూలిగింది.

"ఏమోయ్! ఏమైనా అడుగు" సిద్ధాంతి అబ్బాయి నుద్దేశించి అన్నాడు. అబ్బాయి గుండె ఝల్లు మంది. పెదాలు వణక సాగేయి. మళ్లీ తనకు తను ధైర్యం తెచ్చుకుని నెమ్మదిగా, "పాటలేవయినా, ... సంగీతం ···" అబ్బాయి నాలిక తిరగటం మానేసింది.

'సంగీతం చెప్పించలేదండీ అదే రేడియో దగ్గర కూర్చుని ఏదో నేర్చుకుంది.' తల్లి సంజాయిషీ యిస్తున్నట్టుగా చెప్పింది.

"పాడమ్మా, ఏమైనా పాడు" పిల్ల తండ్రి ప్రోత్సాహమిస్తూ కంఠం సవరించుకొని, అన్నాడు. లలిత గీతం ఒకటి పాడింది. అందరూ మంత్రముగ్ధులై విన్నారు.

"ఇక లోపలికి వెళ్లమ్మా!" అబ్బాయి తండ్రి అనుజ్ఞ యిచ్చేడు.

అమ్మాయి మెల్లిగా లేచి లోపలికి నడిచింది.

రెండు క్షణాలు నిశ్శబ్దం.

"అమ్మాయికి యింటి పనులన్నీ బాగా వచ్చండీ, కుట్లు, అల్లికలు కూడా బాగా చేస్తుంది." అమ్మాయి తల్లి, అబ్బాయి తల్లికి వినయంగా విన్నవించుకుంది.

అబ్బాయితల్లి హుందాగా తల వూపింది.

ఒక రెండు నిమిషాలు గడిచాక, "మేంవెళ్లి, ఏమాటా వుత్తరం వ్రాస్తాం" అంటూ లేచాడు అబ్బాయి తండ్రి.

* * *

"అబ్బాయి యు. పి. యస్. సి. ఇంటర్వ్యూలో కూడా సెలక్టయ్యాడు. రేపోమాపో క్లాస్ 1 ఆఫీసరవుతాడు. వాడి హోదానుబట్టి చూచినా కనీసం పాతికవేలు" ... అబ్బాయి తండ్రి వాదన.

"పాతికవేలా ?!" అంత కట్నం ఆయన యిచ్చుకోలేడండీ! ఒక పదివేలదాకా ఇస్తాడు. వెనకాల ఇంకా పిల్లలున్నారు కదా...మరి మీరు కూడా కొంచెం ఆలోచించాలి." సిద్ధాంతి సర్ది చెబుతున్నాడు. లేకపోతే అతని కమీషన్ దెబ్బతింటుంది.

తనని కని, పెంచి, పెద్ద చేసి, విద్యాబుద్ధులు నేర్పించిన తన తల్లి దండ్రులకు తన వివాహ విషయంలో సర్వాధికారాలూ ఇచ్చి, తను లోపలికిపోయి సినిమా పత్రిక పుటలు తిరగేస్తున్నాడు అబ్బాయి. అతని కళ్లముందు శ్యామల రూపమే కదలుతున్నా, అతని మనసు ఆమెనే కోరుతున్నా, తల్లి దండ్రులపై గల భక్తి ప్రపత్తులు అతని నోరు నొక్కేసాయి-సినిమా తారల(బొమ్మల) హొయలు చూస్తూ అన్నీ మరిచిపోవాలనుకుంటున్నాడు "పది మాటలు ఎందుకు చెప్పండి. ఒక ఇరవై వేలయితే" ...అబ్బాయి తండ్రి.

* * *

"పోస్ట్!!సుధాకర్‌గారికి రిజిస్టర్డ్ కవరు"

"సుధా ... ! నీకు లెటరొచ్చిందిరా అబ్బాయ్ !"

లోపలినుంచి వచ్చి, సంతకం పెట్టి కవరు తీసుకుని, ఒకసారి అటూ ఇటూ అయోమయంగా చూసుకుని, "మా ఫ్రెండ్ దగ్గరి నుంచమ్మా" అంటూ లోపలికెళ్లి కవరు చించేడు సుధాకర్.

అది ఒక అమ్మాయి దస్తూరిలాగుంది.



"శ్రీ సుధాకర్ గారికి,

నమస్కారములు. మీరు పెళ్లిచూపులలో చూచిన శ్యామలని నేను. దయయుంచి మీరు పూర్తిగా చదివిన వెంటనే ఈ ఉత్తరం చింపెయ్యండి. మీరు చదువుకున్న వారనీ, విశాలహృదయంతో నన్నర్థం చేసుకుంటారనీ, ఆశిస్తూ ఈ ఉత్తరం వ్రాస్తున్నాను. దయ యుంచి అన్యథా భావించకండి.

సమాజం అన్నివిధాలా అభివృద్ధిచెంది, నాగరికతా శిఖరాలకు ఒకవైపు పరుగెడు తుంటే, వేరొకవైపు సనాతనాచారాలు, మూఢ నమ్మకాలు, సమాజాన్ని వెనుకకు లాగుతున్నాయి. మధ్యలో నలిగిపోతున్నది నాలాటి వారు.

పెళ్లి చూపుల నాటి సంఘటన తీసు కుంటే, అక్కడ నేనొక వ్యక్తిననీ, నాకూ వ్యక్తిత్వ ముందన్నట్లుగా మీరు వ్యవహరిం చారా! నా గురించి ప్రతివిషయము అడిగారు గాని, కనీసం మీరు మీ పేరైనా చెప్పారా? మరి వివాహబంధం ఇరువురికి సమానం కాదా? విద్యావంతులైన మీరే ఈ విధంగా ప్రవర్తిస్తుంటే, ఇక ఈ సమాజానికి విముక్తి ఎప్పుడు?

ఇక నా మనవి. మీకు, మీ వారికి, నేను సంతృప్తికరంగా అగుపించినట్లు, సిద్ధాంతి గారి ద్వారా తెలిసింది కానీ ఒక దురదృష్ట కరమైన విషయం తలెత్తింది. అదే వరకట్న పిశాచం.

మా నాన్నకి ఉండే కోరిక, తన కూతురు ఒక పెద్ద ఆఫీసరు భార్య అయి సుఖపడాలని. కానీ కేవలం డబ్బు పోసి ఆ సుఖాన్ని నాకు కొని పెట్టడం మా నాన్నకు తలకు మించిన పని.

ఒక చిన్న విషయం. మీరు యు. పి. యస్. సి. పరీక్షకు వెళ్లారు. మీ కృషి వలన ఇంటర్వ్యూలో కూడా సెలక్టయ్యారు. కానీ ఇంటర్వ్యూ బోర్డులోని వారు లంచగొండులై ఉంటే, వారడిగినది మీరు ఇవ్వలేక పోయుంటే, మీరు సెలక్టయ్యేవారా? అప్పుడు మీరెలా బాధపడతారు నేను కూడా మీరు చేసే ఇంటర్వ్యూకి తయారయాను. కుట్లు, అల్లికలు నేర్చుకున్నాను; సంగీతం సాధన చేసాను. కానీ నాకృషికి ఫలితంశూన్యం. కేవలం ఒక ఇరవైవేలు మీ ముందు పోస్తే, మీరు నన్ను ఇంటర్వ్యూలో సెలక్ట్ చేస్తారు. లేకపోతే లేదు. ప్రభుత్వంలో ఒక అంగమవబో తున్న మీరే ఇలా ప్రవర్తించటం 'కంచే చేను మెయ్యటం'. దయుంచి విశాల హృదయంతో వ్యవహరించండి. మీ వారిని నొప్పించమని నే కోరను. వారిని ఒప్పించే ప్రయత్నంచేయండి. లేదా, కట్నం 'ఇంత' ఇవ్వమని అడగకండి. దయుంచి అమ్మాయి 'నచ్చలేదని' కబురు పెట్టండి. అపుడు "మన ఖర్మ" అనుకుం టారు వాళ్లు, లేకపోతే, తన కూతురికి ఒక మంచి సంబంధం చూడలేని తమ అశక్త తను తలచుకొని కుమిలిపోతారు నా తలి తండ్రులు. దయుంచి వారిని అటువంటి బాధకు గురిచేయకండి. ఈ ఉత్తరం ద్వారా నేను మిమ్మల్ని కోరుకోదలిచింది అదే...దయ చేసి యీ ఉత్తరాన్ని సహృదయంతో చదివి చింపేయండి.

సెలవు.

ఇట్లు.

శ్యామల.

ఉత్తరం మరోసారి చదువుకున్నాడు సుధాకర్ దాన్ని మడిచి జేబులో పెట్టుకు

[46 వ పేజీ చూడండి]

చిదంబర రహస్యం

డా. ముదిగొండ శివప్రసాద్

3

(గత సంచిక తరువాయి)

> **జరిగిన కథ: యూనివర్శిటీ** విద్యార్థి చిదంబరరావు కొన్ని మానవాతీతశక్తులను కలిగి ఉన్నాడని తోటి విద్యార్థి అయిన కిరణ్ కుమార్ క్రమేణా నమ్మి అతనికి సన్నిహితు డవుతాడు. నర్సు మాధవి ఆహ్వానంపై ఆమె ఇంటికి వెళ్లిన కిరణ్ కుమార్ ఆమె తల్లి గుడ్డితనాన్ని గురించి తెలుసు కుంటాడు

''ఏం ఫరవాలేదమ్మా - అంటూ స్వామీజీ' మాటలు జ్ఞాపకం చేసుకున్నాను — ఆయన నిన్న రాత్రి ఏమన్నారు?'

'కొందరు వినడమే కాని చూడరు — కొందరు చూడటమే కాని వినరుట'

'అజ్ఞానం అంధకారం లాంటిది ప్రత్యక్ష దర్శనం లభిస్తేనే కాని అది తొలగదు. కాని దర్శనం లభించడం అంత తేలికా ?'

దర్శనం లభించడం తేలిక కాదని స్వామీజీ సందేశం—అప్పుడిదేదో వేదాంత విషయమను కున్నాను కాని మాధవి తల్లి గూర్చే చిదంబర రావుగారు చెపుతున్నారని నాకు ఇప్పటికి కాని అర్థంకాలేదు.

ఎంత విచిత్రం !!

మాధవి తల్లి తనకు గుడ్డితనం ఎలా ప్రాప్తించిందో వివరంగా చెప్పింది. అరకు లోయ కోయవాడు రావడం—మూలికలు వాడటం—గుడ్డితనం రావడం — ఆ తర్వాత తన దురవస్థ, మాధవి కష్టాలూ.

'కిరణ్ బాబూ — నీవేం చెపితే స్వామీజీ అది వింటారని తెలిసింది. ఎలాగైనా సరే వారితో చెప్పి నాకీ కళ్లు తెప్పించు— నీ ఋణనీ జన్మానికి కాదు జన్మ జన్మలకీ తీర్చుకోలేను'

'ఫరవాలేదమ్మా మీకు తప్పకుండా చూపు వస్తుంది. ఇప్పుడు హాస్టల్ కు వెళ్లగానే స్వామీజీకి చెపుతాను. ఆయన చాలా గొప్పవాడమ్మా. మానవాతీతుడు ఆయన తలుచుకుంటే మీకు చూపురావడం ఓ పెద్ద లెక్కలో విషయంకాదు—'

'నాతండ్రీ—నా బంగారు తండ్రీ—నా దిగులంతా వెర్రిపిల్ల ఆ మాధవిగూర్చే నాయనా— దేవుడు దానికి లోకంలో లేనంత అందం ఇచ్చాడు—అదే దాని శత్రువుగా ఎక్కడ మారుతుందోనని నా భయం—గుడ్డి దాన్ని ఏం చేయగలను ? ఉద్యోగం మానిపిద్దామంటే గడవడమే కష్టం- మింగలేక కక్కలేక ఇలా విషాన్ని గొంతులోనే నిలుపుకొని కుమిలి పోతున్నాను బాబూ లోలోపలే-'

మాధవి తల్లి ఏడుస్తున్నది— మాధవీ కంటతడి పెట్టింది. నాకూ ఎందుకో అప్రయత్నంగా కళ్లలో నీళ్లు తిరిగాయి —.పైకి ఇంత అందంగా కన్పించే మాధవి వెనుక ఇంతటి విషాదం గూడు కట్టుకొని వుందని ఎవరు వూహించ గలరు ?

మాధవి తల్లి పేరు చంద్రమ్మట—అంతా చిన్నతనం నుండీ 'చంద్రా' అనే పిలిచేవారట. ఆ అందం చందంచూచి ఆడవాళ్లే మురిసి పోయేవారట. అట్లాంటి తనకు చివరకు చూపుకూడాలేని ఈ కష్టం ...

చంద్రమ్మ తన గతవైభవాన్ని నెమరు వేస్తూ స్వగతంగా కొంత, నన్ను ఉద్దేశించి మరికొంత, చెప్పకు పోతువున్నది—

'అమ్మా—వారినలా మరీ విసిగించకు నీ సోదినంతా చెప్పి. వారికసలే టైం తీరిక వుండదు—ఇలా గంటలకు గంటలు వదల కుండా చెపితే ఎలా' మాధవి, తల్లిని మంద లించింది—

'అలాగేనమ్మా— బాబూ నీ వెలాగైనా నాకీ సహాయం చేయాలి' నా రెండు చేతులూ తనచేతుల్లోకి తీసుకొని దాదాపు నమస్కరించి నట్లుగా కళ్లకద్దుకున్నది.

నాకు టైం ఏదో అమూల్యమైనదిలా భావిస్తున్నదే మాధవి— ఈమాటతో నేనిక బయలుదేరక తప్పలేదు. మనస్సు మాత్రం వెనక్కు లాగుతున్నది—

మరి కొంచెంసేపు కూర్చోవాలని—

కాళ్లుమాత్రం గత్యంతరంలేక ముందుకు సాగాయి—మాధవికూడా నన్ను వెంబడించింది.

చంద్రమ్మకు వీడ్కోలు చెప్పి గుమ్మందాకా వచ్చాను—

'మాధవీ— దిగులుపడకండి— ఈవేళ రాత్రే స్వామీజీకి చెప్పి గట్టిగా ప్రయత్నిస్తాను- ఏలాగైనాసరే కళ్లు వచ్చేటట్లు చేద్దాము -

'ఏమైనా ఇక ఈ భారమంతా మీదే కిరణ్ బాబూ — అన్ని ఇంగ్లీషు వైద్యాలూ విఫలమైనాయి — ఆపరేషను చేసినా లాభం లేదుట—మానవాతీత శక్తులవల్ల రావలసిందే కాని మన ప్రయత్నాలు ఇంకేమీ పనిచేయవు— మాధవి కన్నీళ్లు పెట్టుకుంది — దుఃఖం ఎక్కువైంది.

నాకేమిటో తోచకుండా అయిపోయింది.

'ఏడవకండి—' ఓదార్చబోయాను—

'ఆమె తప్ప నాకీలోకంలో మరెవరూలేరు— అమెగతి ఇలా అయింది—నాకింక దిక్కెవరు?' మాధవి దుఃఖం తెరలు తెరలుగా పొంగి వచ్చింది—

నేను నిలవ లేకపోయాను—

'మాధవీ'

'కిరణ్ బాబూ' ఆమె నా రెండుచేతులూ పట్టుకుంది—నాలో ఏదో తెలియని ఉద్రేకం—

'మాధవీ' ఆమె కన్నీళ్లు తుడిచాను—

'కిరణ్ జీ—'

కొన్నిక్షణాల నిశ్శబ్దం—

ఆమె దుఃఖపు పొంగు తగ్గింది— వాస్తవ లోకంలోకి వచ్చింది. నా చేతులలోనుండి తన చేతులు గుంజుకుంది.

నేనుకూడా దూరంగా జరిగాను ఏదో తప్పుచేసిన వానికి మల్లే— మెల్లగా గుమ్మం దిగుతున్నాను.

'మళ్లీ ఎప్పుడు వస్తారు?' తలవంచుకొని అన్నది మాధవి.

'రేపు'అంటూ ఆమె కళ్లల్లోకే చూస్తూ ఇవతలకి వచ్చాను.

* * *

గురూజీ ఏదో విభూతి ఇచ్చారు—


దానిని ప్రతిరోజూ చంద్రమ్మ కంటికి కాటుకలా పూసుకుంటున్నది. కొన్నాళ్లకు ఫలితం కన్పిస్తుందని, గురూజీ అన్నారు కాని ఎన్నాళ్లకో స్పష్టంగా చెప్పలేదు. 'ఇన్నాళ్ల'కు అని కాలనియమాన్ని ఇవ్వ లేదు— నాటినుండి నేను ప్రతిరోజూ మహారాణి పేట పోవడం, చంద్రమ్మ కష్టసుఖాలు విచారించడం, మాధవికి పనుల్లో సాయపడటం చేయసాగాను.

'మీకెందుకీ శ్రమ—మాబాధలేవో మేమనుభవించక తప్పదు కదా!'అని మాధవి అనేది.

'కాదు మాధవీ!— పరుల కష్టసుఖాలో పాలుపంచుకుంటున్నప్పుడే మానవుడికి నిం

మైనతృప్తి. అప్పుడెమానవత్వం వికసిస్తుంది' అని సమాధానం చెప్పేవాడిని—

అయితే ఆ సహాయం చేయబడే 'పరులు' మాధవీ, ఆమె ముసలితల్లే ఎందుకు కావాలి? రోడ్డుకు ఇరువైపులా వున్న ఎంతో మంది కుంటి, గుడ్డి బిచ్చగాళ్ళలో ఎవరైనా ఎందుకు కాకూడదు? అన్న ప్రశ్నకు నేను సమాధానం. చెప్పుకోదలచలేదు. అలా ఆత్మవంచన చేసు



కోవడంలోనే నాకేదో తృప్తి కనపడింది—

మాధవి చాలా చలాకీ మనిషి.

అలా కబుర్లు చెప్పడం మొదలుపెట్టేం ఇద్దరమూ.

దంటే క్యాలండరులో తేదీలు మారడం కూడా మరచి పోవలసిందే.

రాత్రి ఒంటిగంట—రెండూ—

ఒకనాడు బీచ్‌లో కూర్చున్నాము

మాధవి కట్టిన నైలాన్ చీర అంచు గాలికి రెపరెప లాడుతున్నది.

ముంగురులు ముఖంలో పడి చిలిపిగా దోబూచులాడుతున్నాయి—'వి'నెక్ జాకెట్‌తో మాధవి తన వీపునూ వక్షస్థలాన్ని చూపరులపై గాలాలుగా విసిరి ఇంద్రజాలాన్ని ప్రదర్శిస్తున్నది.

'మాధవి'

తెలియని ఉద్రేకంతో పిలిచాను.]

'ఊఁ—'

మా అమ్మాయి మాధవికి అయిదు సంవత్స రముల వయస్సు. "నర్సరీ" చదువు తోంది. మేము సినిమాకు వెళ్లినప్పుడల్లా "నేనూ వస్తానంటుంది." నీవు చిన్నపిల్లవి అన్ని సినిమాలు చూడకూడదు అని చెప్పినా వినదు. "ఏ" సర్టిఫికెట్టు ఇచ్చారంటే చాలు "రానంటుంది." "ఏ" సర్టిఫికెట్టు అంటే ఆ సినిమా పెద్దవాళ్లే చూడాలి, చిన్నపిల్లలు చూడకూడదు అని అలవాటు చేశాము. అందువల్ల సినిమాకి "ఏ" సర్టిఫికెట్టు ఇచ్చారంటేను; ఆ"ఏ"చూపిస్తేనేను రానంటుంది. ఒక రోజు బిస్కట్ ప్యాకట్టు కావాలని ఏడ్చింది సరే అని "అశోకా కంపెనీ



గ్లూకో బిస్కట్ పేకట్టు" కొని ఇచ్చాము. పేకట్టు విప్పుతూంటే, "ఏ" అనే ఇంగ్లీషు అక్షరం కనిపించింది.

మా పాప విప్పడం ఆపేసి "అమ్మా! ఈ బిస్కట్లకి "ఏ" సర్టిఫికెట్టు ఇచ్చారే? విప్పి చూడకూడదా? తినొచ్చా?" అని అడిగింది. అక్కడున్న వారందరమూ పొట్ట చెక్కలయ్యేటట్లు నవ్వి "అదేమీ కాదమ్మా "ఏ" అంటే ఆ కంపెనీ వారి పేరుకు గుర్తు" అన్నాము.

— *టి. రాఘవ కుమారి,*
(మచిలీపట్నం)

చిదంబర రహస్యం

'నేనొక ప్రశ్న అడుగుతాను జవాబు చెపుతావా సూటిగా'

'ఊఁ'

'ఊఁకాదు. ఇటు నా కళ్లల్లోకి చూచి జవాబు చెప్పు'

మాధవి మత్తుగా నా కళ్లలోకి చూచింది.

గుండె పిండేసి నట్లుందాచూపు.

'మాధవీ-నీ వెందుకని పెళ్లి చేసుకోలేదు'

మాధవి సముద్రపు టిసుకను దగ్గరికి లాక్కొని పిచ్చుక గూళ్ళు కడుతూ అన్నది.

'ఇప్పుడేమంత తొందర ?'

'అంటె ముసలిదానివైన తర్వాత చేసుకుంటావా ఏమిటి ?'

మాధవి నవ్వింది.

ఆ నవ్వులో ఎంత కవ్వింపు–ఎంత కొంటి తనం!

'అదికాదు...'

'మరేమిటి ?'

'పరిస్థితులు కొంత కుదుటపడాలి — తర్వాత—'

'తర్వాత'

'నా మనసుకు నచ్చినవాడు దొరకాలి'

'అంటే వాడికుండవలసిన క్వాలిఫికేషన్స్ ఏమిటి ?? తెలుగు నవలల్లో హీరోయిను కోరుకునేటట్లు అతిలోక సౌందర్య శేఖరుడూ, ఓ అరడజను ఎయిర్‌కండిషన్డ్ కార్లకు అధిపతీ, తల్లిదండ్రులు లేనివాడూ, ప్రేమ సామ్రాజ్యానికి ఏకైక చక్రవర్తీ– అలాంటి వాడిని ఊహించు కొంటున్నావా ఏమిటి ?'

'అన్ని గుణగణాలు, లక్షణాలూ నాకు కావలసిన వరుడికి నేనేమీ ఊహించుకోవడం లేదు— కేవలం నామనసెరిగిన వాడైతేచాలు— మంచివాడైతే చాలు'

'అలాంటి మంచితనం నీకింతవరకు ఎవరిలోనూ కన్పడనే లేదా మాధవీ'

'కన్పడుతూవున్నది–కాని కంటికి కన్పడిన దంతా చేతికి అందుతుందని నమ్మకమేమిటి?'

'అదంత అందని మానిపండా ?'

'ముంగిట్లో పువ్వు అందుకునే అదృష్టం అందరికీ ఉండవద్దా ?'

మాధవి ముఖంలో విషాదరేఖలు కన్పడ్డాయి.

'మాధవీ'—

ఆమె బదులు పలకలేదు—

మాధవి చేతిని నాచేతిలోకి తీసుకున్నాను.

ఎదురుగా సముద్రం హోరెత్తుతున్నది.

ఆ చేతిని నాగుండెలకు హత్తుకున్నాను—

'మాధవీ—'

"... ... ..."

చుట్టూ చిరు చీకట్లు ముసురుకుంటు న్నాయి.

మాధవీ'

'ఊఁ—'

'నాదొక చిన్నకోరిక వుంది తీరుస్తావా ?'

'ఏమిటి ?'

'ఇలా శాశ్వతంగా మనం ఈ సముద్రాన్ని చూస్తూ కూర్చోవాలి'

చీకట్లో మల్లెల కాంతులతో మాధవి మృదువైన పలువరుస మెరిసింది.

'శాశ్వతంగా ఈనీళ్లను చూస్తూ ఇలాగే కూర్చుంటే జీవన రసమంతా నీళ్లుకారి పోతుంది. సార్! లేవండి అవతల మీహోస్టల్‌లో వేడివేడి భోజనాలు తయారై వుంటాయి'

* * *

మాధవిని చూడకుండా నాకిప్పు డొక్క రోజుకూడా గడవదు. ఆమెమాటలు వినని నాడు నాకు పిచ్చెక్కినట్లుండేది. ఆమెతో కలిసి కొత్త సినిమాలేవి వచ్చినా వెళ్ల వల సిందే—మాధవికి మాత్రం పాత సినిమాలు, అందులోనూ ఆఖరాటనాడు చూడటమంటే ఎంతో ఇష్టం.

అప్పుడు హాలు చాలాభాగం ఖాళీగా ఉంటుంది—

వెనక ఎక్కడో ఎవరికీ కన్పడకుండా కూర్చోవచ్చు—

అలా వేరుశనగ పప్పులు తింటూ రొమాంటిక్ సినిమాలు చూస్తూవుంటే మమ్మల్ని మేము మరచి పోతూ వుంటాము.

తెరమీద నాయికా నాయకుల స్థానంలో మేమే వుంటాము—

మాధవికి కూడా సినిమాలంటే చాలా ఇష్టం.

అందులోనూ లవ్ సీన్సు వచ్చినప్పుడు చీకట్లో మెరిసే ఆకళ్లను చూస్తే ఆమె మాధవిలా కాక మాచల్దేవిలాగానో, క్లియోపాత్రాలాగానో కన్పించేది.

చీకట్లో నా మెడ చుట్టూ చెయ్యివేసి నన్ను దగ్గరికి లాక్కొని వెచ్చని శ్వాసను

నాపై ఆమె వదులుతూంటే నా నరాలన్నీ ఉద్రిక్త శిఖరాలను చేరుకునేవి.

పిచ్చిపిచ్చిగా పళ్లతో నా క్రింది పెదవిని కసితీరా కొరుక్కుంటూ ఆమె రెండు భుజాలను గట్టిగా పట్టుకునేవాణ్ణి.

మాధవి పరవశంతో అలా నా భుజాలపై వాలిపోయేది.

అలా ఎంతసేపు కూర్చునేవాళ్లమో.

మళ్లీ హాలంతా అదిరిపోయేటట్లు ఏ నేపథ్య గాయకుడో హీరోయిన్ మీదనో హీరో మీదనో ఓ పాట పాడుతుంటే అప్పటికి తిరిగి ఇది సినిమా హాలని గుర్తుకు వచ్చేది—

అలా హాలు నుండి నేరుగా మహారాణీ పేటకే ఇద్దరం వెళ్లేవాళ్లం—

ఒక్కొక్కప్పుడు ఎల్లమ్మ తోటవద్ద ఓ 'ఏ' క్లాస్ హోటల్లో భోంచేసేవాళ్లం.

లేదా ఇంటికి పోగానే ఆ రాత్రి వేడి వేడి పూరీలు వేయించేది—కబుర్లు చెప్పుకుంటూ తినేవాళ్లం.

చంద్రమ్మ కూడా మా అన్యోన్యానికి సంతోషించేదే కాని ఏమీ అనేది కాదు.

'భగవంతుడే మా కష్టాలను గట్టెక్కించడానికి నీ రూపంలో మాకు వరాన్ని ప్రసాదించాడు' అనేది ఎప్పుడైనా.

ఒకరోజు మేము సినిమానుండి వచ్చేసరికి బాగా ఆలస్యమైపోయింది— సినిమా కూడా చాలా బోర్‌గాఉంది.

చెత్తకథ— చెత్తడైరెక్షన్ — అప్పడాల పిండిలా సాగదీశాడు ఇరవైరెండు రీళ్లు. ఆటవదిలి బయటకు వచ్చేసరికి భోజన హోటళ్లు మూసివేశారు. హాస్టల్‌లో మెస్ కూడా కట్టేసి వుంటారు. మాధవితోబాటు మహారాణిపేట వెళ్దామా? అనుకుంటూ వుండగా 'హల్లో మాధవీ' అంటూ ఎవరో విష్‌చేశారు. మాధవి సంతోషంగా మళ్లా విష్‌చేసి 'వీరే డాక్టర్ ఆల్‌ఫ్రెడ్. ఆమె మిసెస్ ఆల్‌ఫ్రెడ్— మీట్ మీ మై ఫ్రండ్ మిస్టర్ కిరణ్ ఎం. ఎస్. సి. (ఈయన నా మిత్రుడు కిరణ్ ఎం. ఎస్. సి.) అని పరస్పరం పరిచయం చేసింది. మాధవి తల్లికి నేత్ర వైద్యం చేసినప్పుడు ఆల్‌ఫ్రెడ్ దంపతులు బాగా పరిచయమైనారట. అప్పటి పరిచయం క్రమంగా ఫామిలీ ఫ్రండ్‌షిప్‌గా మారిందట— 'రండి' అని మమ్మల్నికూడా ఆహ్వానించి ఆల్‌ఫ్రెడ్ దగ్గరలోని ఒక హోటల్‌కు నడిచాడు—వారివెంట మాధవి,మాధవి వెంట నేను.

ఆల్‌ఫ్రెడ్ సొంతగొడవ ఏదో చెపుతున్నాడు.

నలుగురం నాలుగు కుర్చీలలో కూర్చున్నాము— మిసెస్ ఆల్‌ఫ్రెడ్ నాకు ఎదురుగా కూర్చున్నది. వాళ్లు ఏదో ఇంగ్లీషు పిక్చర్ చూచివచ్చారు— అందులోని క్రైంగూర్చీ సెక్సుగూర్చి మిసెస్‌ఆల్‌ఫ్రెడ్ వర్ణిస్తున్నది. ఆమె అర్ధనగ్నంగా కేబారా నృత్యానికి తగ్గట్లు దుస్తులు అలంకరించుకుంది నిత్య జీవితంలోనే—

ఛలోక్తులు విసురుతూ మత్తుగా నావైపు తమాషాగా చూస్తుంటే నామనస్సు ఏదోలా అయిపోయింది. సర్వర్ నాలుగు గ్లాసుల పానీయాన్ని తెచ్చి టేబిల్‌మీద పెట్టాడు— మిసెస్ ఆల్‌ఫ్రెడ్ నాగ్లాసుకు తనగ్లాసు తగిలించి నాఆరోగ్యాన్ని కోరుతూ ఆపానీయం తాగుతున్నట్లు ఆంగ్లంలో చెప్పి సిప్‌చేయడం మొదలు పెట్టింది—ఆమెతోబాటే ఆల్‌ఫ్రెడ్, ఆల్‌ఫ్రెడ్‌తోబాటు మాధవీ—

నేనిప్పుడు తాగకపోతే అదేం అనాగరిక ప్రవర్తన అనుకుంటారో మాధవీ, మిసెస్ ఆల్‌ఫ్రెడ్ అని గ్లాసు ఎత్తుకున్నాను—భరించలేని వాసన—

కొంచెం సిప్ చేశాను— కుంకుడుకాయ రసంలా వుంది. అసహ్యతను కన్పడనీయకుండా మిసెస్ ఆల్‌ఫ్రెడ్‌కళ్లల్లోకి చూస్తూ గ్లాసు మొత్తం గడగడ తాగేశాను—

ఆల్‌ఫ్రెడ్ బిల్లు చెల్లించాడు

మిసెస్ ఆల్‌ఫ్రెడ్ నాకు షేక్ హాండ్ ఇచ్చి 'పరిచయం పెరగాలంటే వస్తూ పోతూ వుండాలి. తీరినప్పుడు రండి' అని నన్ను ఆహ్వానించింది—

ఆమె కరస్పర్శతో నా మనస్సుజల్లుమన్నది శరీరంలో, నరాల్లో, మెదడులో ఏదో తెలియని మత్తు—సరికొత్త ఉద్రేకం—

ఆల్‌ఫ్రెడ్ దంపతులు వెళ్లారు—

మాధవి రిక్షా మాట్లాడింది—

ఇద్దరం ఎక్కాము—

మాధవి మెడచుట్టూ చేయి వేసుకొని కూర్చున్నాను—

నేనేదో మాట్లాడుతున్నానని నాకు తెలుసు.

కాని ఏం మాట్లాడుతున్నానో మటుకు తెలియడంలేదు—

ఏంచేస్తున్నానోకూడా తెలియడంలేదు.

అతిగాప్రవర్తించానేమో మరి 'ఇది రిక్షా' అని చిరుకోపంతో మాధవి నా చేతిని తన మెడమీదినుండి విడిపించుకున్నది—

రిక్షా మహారాణిపేట చేరడం, ఇంట్లోకి వెళ్లి మంచంమీద పడటం లీలగా గుర్తున్నాయి—

అంతే! ఒకటేమత్తు—ఒకటేనిద్ర—

* * *

అప్పటి నుంచి తరుచు కొంచెం పుచ్చుకోవాలనిపించేది. మాధవి మాత్రం మందలించేది.

ఒకటి రెండు సార్లు గట్టిగా తిట్టింది కూడాను!

'నాకీ తాగుబోతుతోనా చివరకు పరిచయం లభించింది' అన్నది ఒకసారి.

'మాధవీ! నేను తాగుబోతునైతే అందుకు నీవే కారణం — మీ ఆల్‌ఫ్రెడ్ దంపతులే కారణం' అన్నాను నేను.

ఆమె కోపంతో, తోకపై లేచిన నాగినిలా విజృంభించింది.

'కిరణ్—నేనేదో ఆదర్శాలను పల్లించక పోవచ్చు కాని నీచానికి మాత్రం దిగజారను.

(42 వ పేజీ చూడండి)



జీవితం మలి

ప్రియమైన సూర్యం బావకు,

ఊర్మిళ నమస్కరిస్తూ!

కులాసాగాఉన్నావని తలుస్తాను. మేమంతా క్షేమమేను. బహుశా ఈ పాటికి మమ్మల్ని నువ్వు పూర్తిగా మర్చి పోయుండాలి. అందుకే మమ్మల్ని మేం జ్ఞాపకం చేయటం కోసం ఈ ఉత్తరం వ్రాస్తున్నాను.

ఏం బావా! ఈ అయిదు సంవత్సరాల్లోను కనీసం ఒక్క మాటంటే ఒక్కమాటైనా నీకు మేం జ్ఞాపకం రాలేదూ? పట్నంలో జీవితం ఎంత బావున్నా పల్లెటూళ్లంటే అంత పూర్తిగాపడకి పోవటం బావుండదు. అందులోను పుట్టి పెరిగిన ఇందుపల్లిని— ఆడిపాడిన ఇందుపల్లిని మర్చిపోవటం ఘోరమైన నేరం అవుతుంది సుమా!

ఏ మాటలా ఉంచు... నాకు మాత్రం నిన్నొకసారి అర్జంటుగా చూడాలని కోరిగ్గా ఉంది. "ఎందుకూ?" అనకు, "ఏమో!" అనేస్తాను సమాధానం ఏం చెప్పాలో తోచక. ఈ ఉగాదికి మా వూళ్లో నాలుగు రోజులు వచ్చి ఉండమని ఆహ్వానిస్తున్నాను. నా ఆహ్వానాన్ని మన్నిస్తావా?

ఉంటాను!.

—ఊర్మిళ

పి.ఎస్:— ఇలా నీకు నేను ఉత్తరం వ్రాసినట్లు ఎవరి దగ్గర అనకు అందరూ నవ్వుతారు. నీ అంతట నువ్వే వచ్చినట్లు రా.



జి. యస్. సూరి

"ఏడవకపోయింది!" అంటూ ఉత్తరం చదవటం ముగించి కాగితాన్ని మడిచి ప్రక్కన పడేశాడు సూర్యం.

అంతవరకూ ఏదో నవల్లో రొమాంటిక్ సన్నివేశం చదవటంలో మునిగిపోయిన సూర్యం జతగాడు సుబ్బారావు తలెత్తాడు చివరి మాటలు వింటూ.

సూర్యం మొహం చిటపటలాడటం చూసిన సుబ్బారావు— "ఎందుకురా అబ్బీ! మొహంఅదోలా పెట్టావ్? అస్తమాను డబ్బు కోసం రాస్తే వీపు చిట్లేస్తానన్నాడా మీ నాన్న? లేకపోతే నువ్వు రాసిన లౌ లెటర్ తీసుకెళ్లి ప్రిన్సిపాల్‌కిస్తానందా బి జెడ్.సి. పద్మ? ... అదేమిటో చెప్పి మరీ ఏడు ... అలాకాకపోతే ఏడ్చేసి ఆ తర్వాత చెప్పు!" అన్నాడు.

సూర్యం ఉరిమి చూశాడు సుబ్బారావు వైపు. దాంతో సుబ్బారావు కంగారుపడి— "సరేలే ఏడుస్తానే చెప్పు" అన్నాడు.

సూర్యం మళ్లీ కోపంగా చూడప్పోయ్యాడు కాని సుబ్బారావు అలా చూసినకొద్దీ వంకరటింకరగా మాట్లాడతాడని తగ్గిపోయాడు.

సూర్యం మాట్లాడకుండా వూరుకునేటప్పటికి సుబ్బారావుకి జాలేసింది. "ఒరేయ్ సూరీ! ప్రతీ దానికి అలా డీల అయిపోతే ఎలారా? బొత్తిగా ఆడపిల్లలా తయారవుతున్నావస్మే. నాతో చెప్ప కూడని కష్టమా అది?" అన్నాడు వోదార్పుగా.

"సుబ్బీ!.. ఇది చూడరా..." అంటూ ఊర్మిళ వ్రాసిన ఉత్తరం సుబ్బారావుకి అందించాడు సూర్యం.

సుబ్బారావు మాట్లాడకుండా సూర్యం అందించిన ఉత్తరం తీసుకున్నాడు. శ్రద్ధగా ఉత్తరాన్ని చదివి ఫక్కుమని నవ్వుతూ— "ఇదేమిట్రా వెంగళాయి! ఆడపిల్ల ... అందునా వరుసైన పిల్ల ముద్దుగా—ముచ్చటగా ప్రేమలేఖ వ్రాస్తే ఏడుపు ముఖం పెడ్తావ్? అయినా ఇంతకూ నాకు తెలియక అడుగుతాను . . నీకో మరదలున్నట్లూ. పైగా ప్రేమలేఖ వ్రాసే ఈడుదైనట్లు నా కెప్పుడూ చెప్పలేదేం?" అన్నాడు.

సూర్యం రెండు క్షణాలు మాట్లాడలేదు.

సుబ్బారావు పరిశీలనగా సూర్యం మొహంలోకి చూడసాగాడు.

"హోరేయ్ సుబ్బీ! ప్రమాదం పీకల మీదికొచ్చి కూర్చుంటే పరిహాసాలాడతావేమిట్రా?... అది మరదలా?.. దాన్ని గురించి మరొకరితో ముచ్చటించేపాటి అదృష్టం కూడానా? లేదురా...

బాబూ ! లేదు. అప్పు[illegible] సుబ్బిగా ! నువ్వెప్పుడైనా తాటకీ—శూర్పణఖాలాంటి పేర్లు విన్నావా ? . . . సరిగ్గా ఆ కోవకి చెందినదిరా ఈ ఊర్మిళ. ఊర్మిళట ! ఊర్మిళ ! గొంగళిలా మొహం అది. వోరేయ్ ! ఆ పేరుకు తగ్గట్టు దాని మొహం కూడా నిద్ర మొహమేరా సుబ్బీ . . ."

సుబ్బారావుకి సూర్యం చెప్పేది ఒక్కటికూడా తలకెక్కటంలేదు.

అంతా విని "నాకేం అర్థం కావటం లేదురా అబ్బీ ! . . . ఆ చెప్పేదేమిటో సరిగ్గా చెప్పేడవ రాదూ ?" అన్నాడు ఏళ్ళ మండి.

"అర్థం అవ్వదురా . . . అంత సులభంగా అర్థం అయితే నీది మట్టి బుర్ర ఎందుకవుతుంది ?" సూర్యం వెక్కిరింపుగా అన్నాడు.

సుబ్బారావు మొహం చిన్నబుచ్చుకుంటూ— "నా బుర్రను గురించి నీ కాంప్లిమెంట్స్ తర్వాత పాస్ చేద్దువుగాని కాని . . . ముందు ఊర్మిళ ఎవరో ఆ అమ్మాయి నీకెలా మరదలయ్యిందో . . . ఆంధ్రదేశంలో ఇందుపల్లి ఏ ప్రాంతంలో ఉందో వివరంగా చెప్పి మరీ అఘోరించు. అలా కాదన్నావో . . . . నీకెవరో ఊర్మిళనే పిల్ల తో లెటర్ రాసి నట్లు బి.జడ్.సి. పద్మకు చెప్పెయ్యనీ" అన్నాడు.

చివరి మాటలు వింటూ ఒక్కమాటుగా ఉలిక్కి పడ్డాడు సూర్యం.

"సుబ్బీ . . . ఆ పని మాత్రం చేయకురా నీకు పుణ్యం ఉంటుంది. ఇంతకు ఊర్మిళ గురించే కదా నీక్కావల్సింది. చెప్తాను ! కాని . . . నువ్వో మాటివ్వాలి. పద్మ దగ్గర ఊర్మిళ వూసు మాత్రం ఎప్పుడూ ఎత్తకూడదు. నీకు తెలుసుగా పద్మ నా ఎడం గుండెకాయని ?" కన్నీళ్ళు మినహాగా సుబ్బారావుని బ్రతిమాలసాగాడు సూర్యం.

సుబ్బారావు అందుకున్నాడు.

"తెలియకేం ? . . . అన్నీ తెలుసు ! ! సరళ నీ కుడి గుండెకాయనీ . . . సరోజ నీ ఆరో ప్రాణమనీ . . . మీనాక్షి నీ మనుగడనీ . . . ఇంకో పేరు చెప్పే వాడివి . . . అదేమిట్రా ?" జ్ఞాపకం రాక ఆగిపోయాడు.

సూర్యం టక్కున అందించాడు— "అరుణ !" అంటూ.

"ఆఁ ! . . . అరుణదీ నీది ఒకే బాట . . . ఒకే మాట అనీ . పూర్తిగా తెలుసురా అబ్బీ ! . . . కాకపోతే నీ లిస్టులో ఊర్మిళనే మరో ప్రేమదేవత పేరు కూడా చేరబోతున్నట్లు ఇప్పుడే తెలిసింది. అయినాసరేరా ! ఇంతమందికి మనసిచ్చి పుచ్చుకోటానికి నువ్వేమన్నా గోపాలకృష్ణుడనుకున్నావ్రా ? మీ నాన్నకు తెలిస్తే వీపు చిట్లిపోతుందస్మీ ! . . . ఆ అమ్మాయిలకు తెలిసినా అదే జరుగుతుందనుకో !" అన్నాడు సుబ్బారావు మందలింపుగా.

సూర్యం మాట్లాడలేదు. తలొంచుకుని కూర్చున్నాడు.

సుబ్బారావు స్నేహితుడి భుజం మీద చేయి వేసి— "అయినా సూరీ ! నిక్షేపంలాంటి మరదలుండగా నీకివేం బుద్ధుల్రా ? నోరార "బావా !" అని ముద్దుగా పిలుస్తోన్న అమ్మాయిని కాదని "రవుడీ ! . . . రాలుగాయి అంటున్న వాళ్ళ జోలికెందుకు పోతావురా ? . . . నా మాట విని ఊర్మిళ సంగతి ఆలోచించు శ్రద్ధగా" అనునయంగా అన్నాడు.

సూర్యం సూటిగా సుబ్బారావు కళ్ళల్లోకి చూశాడు. ఇప్పుడో కాసేపట్లోనో ఏడుస్తామన్నట్లున్నాయి ఆ కళ్ళ తీరుచూస్తే. సుబ్బారావుకి భయమేసింది స్నేహితుడే క్షణంలో బేరుమంటాడోనని. అంత పని జరిగింది. ఎటొచ్చి ఏడుపు మినహాయింపుగా బొంగురుపోయిన గొంతుకతో— "సుబ్బీ ! మరదళ్ళంటే నాకు మాత్రం ముచ్చట లేదనుకున్నావుట్రా ? సరైనా మరదలే ఉంటే నేనిలా "పద్మా ! సరళా" అంటూ వూరి వాళ్ళమీద పడుదునా ? . . . ఊర్మిళ మరదలు కాదురా . . . రాక్షసి ! నువ్వెప్పుడూ దాన్ని చూడ లేదు కాని చూస్తే నన్నిలా శూలాల్లాంటి మాటలతో బాధించేవాడివికాదు. తెలుసా ?" అనడిగాడు.

సుబ్బారావు వెంటనే— "ఏం ? అసలా అమ్మాయి నీకెందుకు చేదయింది ? అందంగా ఉండదా ? ఆ మాటకొస్తే నువేమంత పెద్ద అందగాడివి ? . . . గుణం మంచిదికాదా ? అదే అయితే నువేమంత గుణవంతుడివి ? . . . వోరేయ్ సూరీ ! . . . అమాయకురాలైన ఓ ఆడపిల్లని ఏడిపించి పెడుతున్న నువ్వురా . . . నువ్వు రాక్షసుడివి" అంటూ కోపంగా విరుచుకు పడిపోయాడు సూర్యం మీద.

సుబ్బారావు ఏడ్వడం మానే వరకూ మౌనంగా వూరుకున్నాడు సూర్యం. తర్వాత పది నిముషాలకు సుబ్బారావు పూర్తిగా ఏడ్వడం మానేసి తోటకూర కాడల్లే వాడిపోయిన మొహంతో కుర్చీలో జార్లపడి కూర్చున్నాడు.

సూర్యం ప్రారంభించాడు. "సుబ్బీ ! అయిన దానికీ . . . కాని దానికీ హైరాణ పడిపోవడం నీకీ మధ్య బాగా అలవాటయిపోయిందస్మీ. అది కాస్త నువ్వు తగ్గించుకోవాలి. పోతే . . . ఊర్మిళ నాకు నచ్చకపోతే మధ్య నీకేమిట్రా కోపం ? . . ."

"కోపం కాదు . . . బాధ !" నీరసంగా జవాబిచ్చాడు సుబ్బారావు.

"ఎందుకూ ?" అడిగాడు సూర్యం.

"ఒక ఆడ కూతురి మనసు నొప్పిస్తున్నందుకు . . . అదీకాక వలచి వచ్చే పడతిని కాదంటున్న నీ తెలివి తక్కువతనం చూసి !" సుబ్బారావు మామూలు మనిషి అవుతున్నాడు.

సూర్యం పెద్దగా నిట్టూర్చాడు. ఆ తర్వాత బరువుగా వూపిరితీసుకున్నాడు. "సుబ్బీ ! ఊర్మిళ అంటే నాకు ససేమిరా ఇష్టం లేకపోవటం ఎందుకో తెలుసా ? . . . అది ఏనాడు నన్ను మనిషిగా చూడలేదురా ! . . . ఈ మాటలు పూర్తిగా అనుభవంతో చెప్తోన్నవి . . ."

సుబ్బారావు మధ్యలో ఏదో మాట్లాడపోతే— 'నువ్వాగరా అబ్బీ ! పూర్తిగా నే చెప్పేది విను సందేహాలుంటే తర్వాత అడుగు. తీరుస్తా !' అన్చెప్పి "ఊ ! ఏం చెప్తున్నానూ ? ఊర్మిళ నన్ను మనిషిగా చూడని సంగతేగా ? అవునురా సుబ్బీ ! . . . నా హైస్కూలు చదువంతా అమలాపురంలోనే జరిగింది. మా మావయ్య అప్పుడు ఇందుపల్లిలో ఉంటూండేవాడు. వాళ్ళింట్లో ఉండి రోజూ మూడు మైళ్ళు అమలాపురం వెళ్ళి చదువు కొచ్చేవాణ్ణి. మా నాన్నగారు అప్పుడు రాజమండ్రిలో ఉండేవారనుకో. అక్కడే ఉద్యోగం ! అయితే రాజమండ్రిలో చదవక మధ్యలో అమలాపురంలో ఏమిటంటావ్ ? అవునా ? నాకు అప్పట్లో మేనమామలంటే మహా యిష్టంగా ఉండేది. పైగా పల్లెటూళ్ళంటే అదో రకమైన మోజు కూడా ఉంది. కారణం ఏమను . . . పరాయింట్లోన ఉండి చదవటం అంటే హాస్టల్లో ఉండి చదువుకోవటంలాగే ఫీలయ్యేవాణ్ణి, అదో సరదా !" అంటూ మధ్యలో వూపిరితీసుకోడానికన్నట్లు క్షణంసేపు ఆగాడు సూర్యం

ఆ క్షణం సేపుని వినియోగించుకొని— "ఈ సొదంతా ఎందుకురా సూరీ ? సంగతేదో మూడు ముక్కల్లో తేల్చిపారేయ్ బావుంటుంది" అన్నాడు

"ఆఁ ! ఆఁ ! వచ్చేస్తున్నాను మా ఇందుపల్లి మావయ్య కూతురన్నమాట ఊర్మిళంటే

పెళ్ళి చూపులు

వస్తున్నారమ్మా వస్తున్నారు
పెళ్ళిచూపులకు వస్తున్నారు
అక్కను వాళ్ళు చూస్తారంట !
బావగారి రేటు, చెపుతారంట ! !
డాక్టరు బాబుకు '70' వేలు !
ఇంజనీరుకు '20' వేలు !
భూస్వాములవారికి '40' వేలు . . .

వెళ్తున్నారమ్మా వెళ్తున్నారు !
అక్కను వాళ్ళు చూశారంట !
బావకు పిల్ల నచ్చిందంట.
కట్నము అసలే వద్దంట
ఆడబిడ్డ లాంచనాలు చాలంట.

"అవి" అంతా కలసి ఎంతోకాదు,
అన్నీ కలసి '60' వేలు
అతిగా ఆశలు లేవంట

పెండ్లికుమారునికీ, స్కూటర్ వారి
అత్తమామలకు, ఆడబిడ్డలకు,
అతి స్వల్ప లాంచనాలంట

వెళ్తున్నారమ్మా వెళ్తున్నారు
పెళ్ళిచూపులకు వచ్చి వెళ్తున్నారు
అక్కకు పెళ్ళి వద్దమ్మా
హాయిగ మనతో ఉంటుందమ్మా ! ?

కె. విజయకుమారి.

మావయ్య సంతానంలో వూర్మిళే పెద్దది. మనిషి నల్లగా బొగ్గు ముక్కలా ఉంటుంది. దానికి సాయం ఎడ్డితనం అంతా దాని మొహాన్నే తాండవం చేస్తూంటుంది. వోరేయ్ సుబ్బీ! పైగా అదెంత రాక్షసో తెలుసా? అస్తమానూ నన్ను ఉత్తి పుణ్యానికి తిట్టిపోస్తూండేది. పితూరీలు చెప్పి మా ప్రైవేటు మాష్టారి చేత కొట్టించటం కూడా చేసేది. రాక్షసిరా బాబూ! అందుకే అప్పట్నుంచి ఇప్పటివరకూ అదంటే నాకు మంట. అది మహా అందంగా ఉండేడిసినట్లు నన్ను పట్టుకుని "కోతి బావా! కోతి బావా!" అంటూ వేళా కోళం చేసింది. కాకిపిల్ల కాకికి ముద్దన్నట్లు మా మావయ్యా—అత్తయ్యా ఒకటే నవ్వేవారు దాని వాగుడికి మురిసిపోతూ. నాకు భలే మంటగా ఉండేదిలే... అదేమిట్రా! తల పట్టుకూర్చుంటావ్? అంత బోర్ కొడ్తోందా? అయినా

జీవితం రుచి

వోరేయ్! ఊర్మిళ గురించి చెప్పమని నువ్వేగా అడిగావ్?... పైగా ప్రాణాలు పోతోన్నట్లు వెధవ ఫోజు ఒకటా?... సరే అయిపోవచ్చిందితే... ఆ! నన్ను గురించి మా వీధి ఆడపిల్ల లందరి దగ్గర దండోరా వేసేదిరోయ్! రవుడీననీ... ఆడపిల్లల్ని ఏడిపిస్తానని... తనకి లౌ లెటరు రాసానని... ఒట్టుగా ఆ మూడో పని మాత్రం నేనెప్పుడు చేయలేదు. అయినాసరే దానికదో గ్లామరు. ఎప్పుడైనా దాని అల్లరి హద్దుమీరి ఉక్రోషం పట్లేక అత్తయ్యకీ— మావయ్యకీ చెప్తే "పోనిద్దూ అంటే అంది... కాకపోయినా నీ పెళ్లామే కద్రటా అంటూంట. దానికంత ఉడుకుమోత్తనం ఎందుకు?" అనేవారు. అదిరా బాబూ కథ! ఈ ఉచ్చు నా మెడ చుట్టూ అప్పట్నుంచే బిగించటం మొదలుపెట్టారు. ఆ బ్రహ్మ రాక్షసిని.. సివంగిని నాకు కట్టపెట్టాలని వాళ్ల ప్లాను. అందుకే హటాత్తుగా ఈ ఉత్తరం వూడిపడింది. వోరేయ్ సుబ్బీ! ఆ ఉత్తరం రాస్తోన్నట్లు వాళ్లందరికీ తెలుసురా... అయినా దానంతట అదే రాసినట్లు చిన్న నాటకం! ఇదంతా మా అత్తయ్య ఏర్పాట్లే. కుర్ర వెధవ! పట్నంలో ప్రేమ సినిమాలు చూసి చూసి ఉంటాడూ.. ప్రేమ కథలు చదివి చదివి ఉంటాడు. ఇంతోటి బోడి లౌ లెటరుకి ఉబ్బిపోతాడూ... అనుకుని ఉంటారు. అమ్మా!... ఎంత ప్లాను!! నేను పడ్తానా?" ఏక బిగిని వాగి చివర్న చిన్న ముక్తాయింపు ఇచ్చి ఆపాడు సూర్యం.

"హమ్మయ్య!" అనుకున్నాడు సుబ్బారావులోపలే.

"ఇప్పుడు చెప్పరా సుబ్బీ! ఆ రాక్షసిని... రణపెంకిని ఎలా చేసుకోమంటావ్? అదంటే నాకు మహా చెడ్డ ఎలర్జీరా బాబు... అంతకన్నా సెకెండ్ ఇయర్‌లో ట్యూబ్ లైట్ అంటారే సావిత్రి అనే పిల్ల!... ఆ అమ్మాయిని కట్టుకోవటం రైటు!... అహ! మాటవరుస కంటున్నాననుకో... నేనేలాగూ పద్మని చేసుకుందుకు నిర్ణయించుకున్నానులే! అది వేరే సంగతి" అంటూ పద్మని గురించి వన్ సెకన్ కల కనటంలో లీనమయ్యాడు సూర్యం.

సుబ్బారావు సూర్యాన్ని భుజం తట్టి కలనుంచి మెల్కొలిపాడు. "సూరీ!... నీది బొత్తిగా డ్రీమ్ లాండ్‌రా! పద్మ నీకు ఎలా అందుతుందనుకున్నావ్? దీపంలాంటి పిల్లని ఆశపడుతున్నావేమో?... ఆ ఆశ ఎక్కువైతే చేయి అంటుకుంటుంది జాగ్రత్త!"

సూర్యానికి కోపం వచ్చింది— "అంటే?... అంటే నీ అభిప్రాయం?" ఉక్రోషంతో నిండిన కంఠంతో అడిగాడు.

"అంటేనా? వెర్రి మొర్రి ఆశలకు పోక మీ మావ కూతురు ఊర్మిళని పెళ్లాడమంటున్నాను... హాయిగా ఉండమంటున్నాను. అయినా సూరిగా!.. ఒక మాట అడుగుతాను... ఊర్మిళని నువ్వు చూసి ఎన్నేళ్లవుతోంది?"

"అదే రాసిందిగా!... అయిదేళ్లు!!"

"అలాగా?... అయితే అప్పటి ఊర్మిళ వయస్సెంత?"

"పదకొండు!.. అయి నాఇవన్నీ ఎందుకురా?"

సుబ్బారావు మనసులోనే ఏవేవో గుణించాడు— తీసివేశాడు. రకరకాల కేలుక్లేషన్స్ అయిన తర్వాత — "వోరేయ్ అమాయకుడా!... ఎప్పుడో చిన్నప్పుడు చూసిన ఊర్మిళని మనసులో ఉంచుకుని ఎంత తెలివి తక్కువ వాడవవుతున్నావురా!... నా మాట విని ఇప్పుడు వెళ్ల... ఊర్మిళ చాలా మారిపోయుంటుంది. నీకు చాలా నచ్చేలా కూడా ఉండొచ్చు" హితోపదేశం చేశాడు సూర్యానికి

సూర్యం సుబ్బారావు మాటలు తీసేస్తూ చిన్నగా నవ్వాడు

(38 వ పేజీ చూడండి)



ప్రవాసాంధ్రులు — పాలిటిక్స్ వెక్క మరో తెలుగోడి గోడు

పిప్పళ్ళ సూర్యప్రకాశరావు

"తెలుగు సినిమా వచ్చింది గురో!" అని అరిచాడు పాపారావు పరుగెత్తుకొచ్చి.

'సౌత్ యిండియన్ హోటల్'లో కూర్చున్న మోహన్రావు అప్పటిదాకా మింగలేక బాధపడుతున్న యిడ్లీలాంటి పదార్థాన్ని, గబుక్కున మింగేసి గటాగటా నీళ్ళు తాగేశాడు.

"అయితే గురూ ! నిజంగా తెలుగు సినిమా వచ్చిందంటావా ?" అని అనుమానంగా అడిగాడు.

"నిజం గురూ ! నీ మీద ఒట్టు" అని మోహన్రావు నెత్తిమీద చేయిపెట్టాడు.

"ఒరేయ్ ! ఒరేయ్ ! తెలుగు సినిమా గురించి నే చచ్చిపోవాల్రా" అని ఏడుపుమొహం పెట్టాడు, మోహన్రావు.

"భయపడకు గురూ ! తెలుగు సినిమా యిక్కడకు వచ్చినా రాక పోయినా నీవు మాత్రం చావవు. ఈ వూళ్లో నాయరు హోటళ్లో తిండితింటున్న ఏ వెధవా అంత తేలిగ్గా చావడురా !" అంటూండగానే "పిల్చారా ?" అంటూ వచ్చాడు నాయరు, మాసి పోయిన లుంగీని మడిచి కట్టుకుంటూ.

"అబ్బే లేదే ? మావాడేదో తెలుగు సినిమా గురించి చెప్తూ. . . ."

"ఏందయ్యా ? తెలుగు సినిమాగా ! ఎక్కడయ్యా ? నాకు భలే యిష్టమయ్యా ? ఎక్కడాడ తదయ్యా ?" అనడిగాడు.

వెంటనే పాపారావు సవినయంగా చేతులు జోడించి, "నాయరో ! నీ పాతబాకీ నీకిచ్చేస్తాను గాని, నీవు తెలుగు మాత్రం మాట్లాడకు" అని ప్రార్థించాడు.

"ఏందయ్యో ? నాకు తెలుంగు రాదనే ? అసలు నేను బడ్డీకొట్టు పెట్టింది భీమవరంలో నయ్యో· ఖర్మయ్యో, ఖర్మ. మీలాంటి దిక్కులేని వాళ్లకు వండిపోయటాన్కి యిక్కడకొచ్చానుగాని, నాతెలుంగుకేం ?" అని వాదానికి దిగాడు.

మోహన్రావు కలగజేసుకుని "మా వాడి మాట లేంగాని, కొంతమంది ప్రవాసాంధ్రులు కంటే నీవు చాలా నయం నాయరూ ! ఏదీ రెండు కప్పులు స్ట్రాంగ్ కాఫీపట్రా" అన్నాడు.

పాపారావు వంక నాయరు గుర్రుగాచూసి "రెండు కాఫీ" అని గట్టిగా అరిచాడు.

"ఏరా ! అరువిస్తున్నాడుకదా అని నాయరుకి గాలి కొడతావురా ?" అని నిలదీసాడు పాపారావు.

"అదిసరేగాని తెలుగు సినిమా అన్నావు. ఎక్కడ? ఎప్పుడు ?" అని టాపిక్ మార్చాడు

"అప్సరలో "ఈద్" రోజున.

"అదేంటి గురూ !"

అది అంతే అప్సర ప్రొప్రయిటరు ఈ మధ్యన హైద్రాబాద్ వెళ్లాడులే. బహుశ అక్కడున్న మన వాళ్లు తెలుగుకంటే ఉర్దూయే బాగా మాట్లాడి ఉంటారు."

"ఎన్నాళ్లకు పేల్చావుగురూ ! జోకొకటి" అని ఫక్కున నవ్వాడు మోహన్రావు.

శ్రుతి కలిపాడు పాపారావు.

"కుషికా బాత్ హై క్యా ?" అంటూ కుర్చీ లాక్కున్నాడు భీంసింగ్.

"ఖాస్‌బాత్ హై జరూర్. హమారా పిక్చరు ఏక్‌టోయిధర్ ఆనే వాలా హై" అన్నాడు మోహన్రావు

"అచ్ఛా ! రియల్లీ ! యునో ఐలైక్ యువర్ మద్రాసీ లాంగ్వేజ్ మళయాళం" అన్నాడు భీంసింగ్

పాపం పాపారావుకి బైటనున్న ఎండకంటే ఎక్కువగానే ఒళ్లు మండిపోయింది. భీంసింగ్ గడ్డం పట్టుకుని పీక్లాడుదామనుకున్నాడు. కాని దాన్కి చుక్కలగుడ్డ అడ్డువుండటంవల్ల ఆ ప్రయత్నం మానుకున్నాడు.

"ఒరేయ్ సింగూ ! నీవెప్పుడైనా ఇండియామేప్ చూసావా ? దక్షిణాదిన నాల్గు రాష్ట్రాలున్నాయిరా. నాల్గు. ఒక్కొక్కళ్లకు ఒక్కొక్క భాష ఉందిరా." అని లోలోపలే అనుకుని.



"మిస్టర్ వుయ్ ఆంధ్రాస్ స్పీక్ తెలుగు, యిటలియన్ ఆఫ్ ది యీస్ట్" అన్నాడు పైకి.

ఈలోగా "కలుస్తా గురూ. బిల్లిచ్చెయ్యి" అని సైకిలెక్కాడు పాపారావు.

* * *

కొత్తగా వచ్చిన తెలుగు ఆఫీసర్ని కాకా పట్టాలని పాపారావు పడ్డపాట్లన్నీ చిత్తయి పోయాయి. వాళ్లత్తగారు పంపిన కొత్త ఆవకాయ జాడీడు పట్టుకెళ్లిస్తే "ఐలైక్ దిస్ పికిల్ వెరీమచ్. థాంక్యూ" అన్నాడు.

కనీసం ఆవకాయను ఆవకాయ అంటాడేమో అని పాపారావు ఎంతో ఆశపడ్డాడు. యింతెందుకు ! ఆఫీసులో డ్రాఫ్టు తప్పురాస్తే తెలుగులో తిడతాడేమోనని ఎంతో వుబలాట పడుతుంటాడు. కాని ఆఫీసరు మాత్రం తెలుగెక్కడ దొర్లుతుందేమోనని చాల జాగ్రత్తగా యింగ్లీషులోనే పాపారావుని తిట్టేవాడు.

కాని ఈ సారి పాపారావుకి యీ సదవకాశాన్ని జారవిడుచుకోవడం యిష్టంలేదు. ఆఫీసరుకి సినిమాల పిచ్చని తెల్సు. తెలుగు సినిమా వచ్చిందంటే ఎగిరి గంతేయవచ్చు.

ఆలోచించుకుంటూ ఆఫీసరింటికి వచ్చాడు పాపారావు. వరండాలో ఎదురైన పాపను పట్టుకుని "పాపా ! నీపేలేంటి ? నాపేలు పాపాలావు. మీ నాన్నగాలున్నాలా ?" అన్నాడు.

పాప బొద్దుగా, ముద్దుగా వుంది, చిత్రంగా కళ్ళు తిప్పుతూ.

"క్యా హై ? ఆప్ కవున్ హై ? క్యా కామ్ హై ?" అని ప్రశ్నల వర్షం కురిపించితే చతికిలబడి పోయాడు పాపారావు. యింతలో "షీలా !" అంటూ వచ్చాడొక పన్నెండేళ్ల కుర్రాడు. కుర్రాడితో "చూడు నాయనా ! నాన్నగారున్నారా ? ఉంటే చెప్పు. ఆఫీసులో నిద్రపోయే, సారీ పన్జేసే పాపారావు వచ్చాడని" అన్నాడు.

"సారీ ! ఐకాంట్ ఫాలో యూ" అని విసవిసా నడిచి వెళ్ళిపోయాడు, శెనగల శ్రీనివాసరావు గారబ్బాయి.

(సారీ ! ఎస్. ఎస్. రావ్ గారబ్బాయి.)

ఇంతలో పాపారావు ఎదురు చూస్తున్న ఆఫీసరు పాపారావు ఎదురుగా వచ్చాడు.

పాపారావు సవినయంగా నమస్కరించి "సార్ ! తెలుగు సినిమా వచ్చింది సార్ ! సార్ ! తెలుగు సినిమా. . తెలుగు సినిమా. . ." రెట్టించాడు.

ఆఫీసరుకి, చెవిటివానికి చెపుతున్నట్టుగా— "సో వాట్ ?" అని బిల్డింగ్ అదిరేటట్టుగా అరిచాడు ఆఫీసరు.

పాపారావుకి మూర్ఛవచ్చినంత పనైంది.

కాని పడుకుని దొర్లితే, దార్ని పోయే వాళ్లు డబ్బు లిసురుతారేమోనని భయపడి ఆ ప్రయత్నం మానుకున్నాడు. కాస్సేపటికి చెదిరిపోయిన ధైర్యం కూడగట్టుకుని, బెరుగ్గా "సార్ ! పదేళ్లలో తెలుగు సినిమా యీ పూర్కి (రూర్కెలా) రావడం యిదే ప్రథమం . . ."

"సో వాట్ కెనైడూ ? నో స్పేస్" అని విసుగ్గా సిగా పాపారావు వంక చూసాడు ఆఫీసరు.

పాపారావు జుట్టు పీక్కుని, పిచ్చివాడిలా రోడ్డు మీద పడ్డాడు. ఇక్కడున్న తెలుగు వాళ్ళందరికీ తెలుగు సినిమా చూడటం నామోషి కాబోలు!

తనపై ఆఫీసర్లతో బెంగాలీ, పంజాబీ, మళయాళ సినిమాలకు చీమూడు ముక్కులతో ఉన్న పిల్లకాయల్తో సహా బయల్దేరే ఆఫీసరు మరి మన తెలుగు సినిమాకి రాడేం ? లేక పోతే తను తెలుగు వాడన్న సంగతి, 'తెలుగు సినిమాకెళితే,అందరికీ తెల్సి పోతుందేమో !

* * *

మెల్లగా మలుపు తిరుగుతున్న మాణిక్యాలరావుని, స్పీడ్‌గా సైకిలు మీద వస్తున్న పాపారావు "గురో తెలుగు సినిమా వచ్చింది గురో !" అని కేకేసాడు.

కేక విని మాణిక్యాలరావు అదిరిపడ్డాడో లేక, తెలుగు సినిమా మీద మోజు పడ్డాడో తెలియదు కాని, మొత్తం మీద బేలన్స్ తప్పిపడ్డాడు.

పాపారావు పరుగెత్తుకొచ్చి జబ్బట్టుకుని లేవదీసి, "దెబ్బలు తగిలాయా ?" అన్నాడు.

"చాల్లే వెధవ పలకరింపులు నువ్వూను." అది కస్సుమన్నాడు మాణిక్యాలరావు.

"అది కాదు గురూ ! మన సినిమా వచ్చిందని చెపుదామని." అన్నాడు.

ఆవిధంగా హుషారుగా ఈల వేసుకుంటూ పాపారావు సైకిలు టైర్లు అరిగేదాకా తెలుసున్న వాళ్ళకు, తెలియని వాళ్ళకు, తెలుగు వాళ్ళకు, తెలుగొచ్చినా తెలుగు మాట్లాడని వాళ్ళకు, తెలుగు వాళ్ళమని చెప్పుకోడానికి సిగ్గుపడే వాళ్ళకూ, అందరికీ చెప్పాడు.

* * *

ఆ రోజు—

పాపారావు మిత్ర బృందం సిటీ బస్సు యెక్కి అప్సర వైపు పయనించ సాగారు. అనుకోకుండా కొందర్ని అదృష్టం వరిస్తుంది. పాపారావు పక్కన ఉన్న ఖాళీసీట్లో, పంజాబీ దుస్తుల్లో ఒక సన్నటి, నున్నటి అమ్మాయి కూర్చుంది. తుపుక్కున తుమ్మారు మిత్ర బృందంలో ఎవరో.

"ఛాన్సు కొట్టావు గురూ !"

"ఒరేయ్ కొంచెం సేపు ఆ సీటు నాకివ్వరా ?"

"చిలక బాగుందే !"

"ఎక్కడ పట్టావోయ్ పాపారావ్ ?"

"ప్రయర్ అప్పాయింట్‌మెంటా గురూ ?"

"తెలుగుసినిమాకి తీసుకు వెళుతున్నావా గురూ?"

"పాపారావు—పక్కన అమ్మాయి. జంటబాగుంది కదరా ?"

"ఏడిశావ్ ఆ అమ్మాయి నా పక్కన వుంటే మరీ బావుంటుందిరా !"

"అసూయవు వెధవల్లారా ! అల్లరి చేయకండి. పిట్ట పారిపోగలదు." అన్నాడు పాపారావు.

పక్కన నవ్వారు అందులో వున్న ప్రవాసాంధ్రులందరు.

"మిష్టర్ ! ఒళ్ళు దగ్గర పెట్టుకుని, మాట్లాడు. వళ్ళూడగలవు." అని ఆ చిలక, స్టాపు వస్తే దిగి వెళ్ళిపోయింది.

పాపారావుకి కళ్ళు తిరిగినవి.

"తెలుగులోనే తిట్టిందా గురూ?" సందేహం వచ్చింది మిత్ర బృందంలో ఒకరికి.

ఇంతలో ఒక నడి వయసుక్కురాలు, ముడి సవర జేసుకుంటూ లేచి "అవును నాయనా స్వచ్ఛమైన తెలుగులోనే తిట్టి వెళ్ళింది. ఇంకా నయం. అమ్మాయి మంచిది కాబట్టి సరిపోయింది." అని పాపారావు దగ్గర కెళ్ళి "చూడు బాబూ ఇక్కడ తెలుగువాళ్ళు రెండు వేల పై చిలుకు వున్నారు. కాస్త ఒళ్ళు దగ్గర పెట్టుకుని మాట్లాడటం నేర్చుకో.



నీ కోసమే చెపుతున్నానుబాబూ. కాలుకో, చేయికో నష్టం వస్తే కష్టం బాబూ" అని తనూ దిగి పోయింది.

దాంతో మొహాలు వేలాడేసిన మిత్ర బృందం సిన్మా టాకీసుకి వచ్చే సరికి హాలు ముందు ఎవరూ లేరు.

"బిగినయిందేమో గురూ" అని కంగారుగా పాపారావు వెళ్ళేసరికి—

"అనివార్య కారణాల వల్ల యీ రోజు తెలుగు సినిమా వేయనందుకు చింతిస్తున్నాము" అని యింగ్లీషులో బోర్డు వుంది. అది చూసి మిత్ర బృందం పాపారావుని పట్టుకోబోతుంటే పారిపోయాడు.

* * *

మర్నాడు నాకు కనపడి, "సారీ గురూ! మిమ్మల్నందర్నీ శ్రమ-పెట్టాను. అయినా నాకర్థం కావడం లేదు. హాలువాడు తెలుగు సినిమా ఎందుకు వేయలేదంటావు? మనమంటే సినిమా వాడికీ అలుసయి పోయిందా గురూ?" అని అన్నప్పుడు నాకు పాపారావు మీద బోలెడంత జాలి కలిగింది అవును ఆ రోజు ఆంధ్రదేశానికి వేలమైళ్ళ దూరంగా తెలుగు సినిమా ఎందుకు ఆడ లేదు?

నిజం చెప్పనా? చెపితే మీరు నమ్మక పోవచ్చు. కొన్ని నిజాలు వినడానికి సొంపుగా వుండవు. నమ్మడానికి అసలే బావుండవు.

ప్రవాసంలో వున్న "ఆంధ్ర కళా సంస్థలు"లోని రాజకీయాలే కారణం. ఈ సంఘాలు కళామతల్లికి సేవ చేయక పోయినా, చిట్లపేక సేవకే అంకితమైపోయాయి.

తమ వాళ్లకెపుడూ సహాయం చేసుకునే సంకుచిత బుద్ధి ఆంధ్రులకు ఎపుడూ లేనట్టే వారి కళా సమితి కూడా ఆంధ్రులకు ఏమీ చేయకపోయినా వూళ్ళో వాళ్ళకు చాలా ఉపకారం చేసిపెట్టింది.

సమితి పెట్టక మునుపు వూళ్లో పేకాడే వాళ్ళ సంఖ్య వేళ్ల మీద లెక్క పెట్టేవారు. కాని ఇప్పుడు పేకాటకు టేల్ కొంటే!

వచ్చిన వెంటనే ప్రెసిడెంటుగారు ఇంటికి పట్టుకెళ్లి చింపుకొచ్చిన సినిమా రంగాలతో, సెక్రటరీగారి చంటోడు చింపేసిన చందమామలతో, నెలక్రితం వచ్చిన దిన పత్రికలతో, దయామయులైన మెంబర్లు తిరిగి తీసుకొచ్చి ఇచ్చిన అట్టలూడి పోయిన పుస్తకాలతో, సాహితీ సేవ కూడా చేస్తుంది.

తెలుగు సమితి కదా అని అందరూ తెలుగు మాట్లాడుకుంటారని అనుకునేరు. తెలివితక్కువ పాపారావు, మరో ఇద్దరు ముగ్గురు తప్ప మిగతా వాళ్ళంతా ఇంగ్లీషులోనే మాట్లాడుకుంటారు.

ఇహ పాలిటిక్స్ అంటారా? అడక్కండి! ఆంధ్రప్రదేశ్‌లోని జిల్లా పరిషత్తులు, పంచాయితీ సమితులు చాలా నయం అనిపిస్తుంది!

కొత్తమొహం ఎపుడైనా అడుగు పెడితే "మన యింటి పేరు ఏమిటి?" అని అడుగుతారు. తెలివైన వాళ్ళు అతితెలివిగా "కులాలు" నిర్ణయించేది ఈ ప్రశ్నతోనే.

సమితికి ఫ్యాక్టరీ వాళ్ళు ఇచ్చింది రెండు చిన్న గదులున్న క్వార్టరయినా, ఒక గదిలో అధికార వర్గీయులు, మరో గదిలో అసమ్మతి వర్గీయులు పేకాడటం రివాజు.

ఆ రెండు గ్రూపులు ఎప్పుడూ ముష్టి యుద్ధానికి తలపడకుండా ఉండేటట్లు కాబోలు మధ్య నున్న తలుపు ఎప్పుడూ మూసే వుంటుంది.

నోరు లేని పెద్ద మనిషిని ప్రెసిడెంటుగాను, అప్పులెక్కువగా వున్న వాణ్ణి ట్రెజరర్ గాను, తెలుగు రాని వాణ్ణి సెక్రటరీగాను ఎన్నుకోవడం కద్దు.

ఎలక్షన్ల ముందు అధికారంలోని పార్టీ ఎన్నో వాటికి ప్రారంభోత్సవములు చేసినట్లుగానే, ఎలక్షనులు వస్తున్నాయి కదా అని సమితిలోని అధికార వర్గీయులు తెలుగు సినిమా ఒకటి తెప్పించి, ప్రవాసాంధ్రుల్ని మెప్పించి, మరో యేడాది పాటు అధికారములో వుండాలని ఉబలాటపడ్డారు.

కాని అసమ్మతి వర్గీయులు ఆ విషయం ముందుగానే పసిగట్టి తెలుగు సినిమా ఆ వూరికి రాకుండా గట్టి ప్రయత్నాలు చేశారు.

"ఫిలిం బాక్స్" ఆ రోజుకి ఆ వూరికి రాకుండా రైల్వేలో పనిచేసే ఒకానొక రామారావుగారు సాయపడితే—

ఆర్. ఆర్. సకాలంలో హాలు వాడికి అందకుండా పోస్టల్‌లో పనిచేసే ఒకానొక వెంకట్రావుగారు చేతనయిన విధంగా తోటి ప్రవాసాంధ్రులకు సేవ చేశారు.—"అయ్యా ఇదీ గోడు"

వారఫలం

—మహేష్

19-7-1974 శుక్రవారం మొదలు 25-7-1974 గురువారం వరకు

మేషం :— ఉద్యోగంలో గౌరవం బాగుంటుంది. ఆర్థిక వ్యవహారాల్లో మొగమాటాలు తగవు. వ్యాపారంలో ఆదాయం పెరుగుతుంది. విద్యా వైజ్ఞానిక రంగాల్లో ఖ్యాతి లభించగలదు. వారం ఆఖరులో అనవసరమైన సందేహాలు కలుగుతాయి. స్త్రీలకు— పుణ్యకార్యాలుచేస్తారు. సాటివారితో మాటపట్టింపులు తగవు.

వృషభం :— వృత్తిలో అనుకూల వార్తలను వింటారు. సజ్జన సాంగత్యం లభిస్తుంది. స్థిరాస్థి వ్యవహారాలు బాగుంటాయి. మీ మంచితనమే మీకు ఇబ్బందిని కలిగిస్తుంది. భవిష్యత్తులో లాభించగల వ్యవహారాల్లో అభివృద్ధిని సాధిస్తారు. స్త్రీలకు—ఆరోగ్యం బాగుంటుంది. వినోద కాలక్షేపాల్లో పాల్గొంటారు.

మిధునం : — ఆర్థిక వ్యవహారాలు బాగుంటాయి. నూతన విషయాలను తెల్సుకొంటారు. వ్యాపారంలో సాటివారి పోటీ తగ్గుతుంది. మిత్రులకు సహాయం చేస్తారు. వారం ఆఖరులో అన్ని వ్యవహారాల్లోను ఫలితం సామాన్యంగా ఉంటుంది. స్త్రీలకు—కుటుంబ వ్యవహారాలు బాగుంటాయి. ప్రయాణాలోచనలు చేస్తారు.

కర్కాటకం:— వృత్తి వ్యాపారాలు బాగుంటాయి. సాటివారితో గౌరవం బాగుంటుంది. ప్రయోజనం గల పరిచయాలు ఏర్పడతాయి. నూతన విషయాలను తెల్సుకొంటారు. అధికారులవలన జరగవలసిన వ్యవహారాలు బాగుంటాయి. స్త్రీలకు—ఆరోగ్యం బాగుంటుంది. బంధుమిత్రులను కల్సుకొంటారు.

సింహం :— లాభం రావలసిన వ్యవహారాల్లోనే నష్టం రావచ్చును. వృత్తిలో శ్రమ కలుగుతుంది. వారం మధ్యలో మీ కార్యక్రమాలు బాగుంటాయి. వ్యాపారంలో ఆదాయం పెరుగుతుంది. ప్రయాణం ద్వారా కార్యసాధన చేయగలరు. స్త్రీలకు—కుటుంబ వ్యవహారాలు బాగుంటాయి. దైవకార్యాలు నెరవేరతాయి.

కన్య :— వృత్తి వ్యాపారాలు లాభదాయకంగా ఉంటాయి. మిత్రుల సహాయం లభిస్తుంది. వారం మధ్యలో చికాకులు ఏర్పడతాయి. సాహసిక వ్యవహారాల్లో నష్టం వస్తుంది. వారం ఆఖరులో అన్ని వ్యవహారాలు తిరిగి బాగుంటాయి. స్త్రీలకు — ఆరోగ్యంబాగుండదు. సాహిత్య కళారంగాల్లో ఖ్యాతి లభిస్తుంది.

తుల :— అధికారుల వలన జరగవలసిన వ్యవహారాలు బాగుంటాయి. ప్రయాణాలు ఫలిస్తాయి. సాహసిక వ్యవహారాలు లాభిస్తాయి. వ్యాపారంలో ఆదాయం బాగుంటుంది. వారం ఆఖరులో మీ తాలూకు మనుష్యులే మిమ్మల్ని వ్యతిరేకిస్తారు. స్త్రీలకు—కుటుంబ వ్యవహారాల్లో శ్రమకలుగుతుంది. బంధుమిత్రులను కల్సుకొంటారు.


వృశ్చికం :— వ్యాపారంలో అనుకూల వార్తలను వింటారు. నూతన వ్యవహారాలు లభిస్తాయి. ఉద్యోగంలో గౌరవం లభిస్తుంది. స్థిరాస్థి వ్యవహారాలు బాగుంటాయి. వారం ఆఖరులో మీ కార్యక్రమాలు ప్రోత్సాహకరంగా ఉంటాయి. స్త్రీలకు—ఆరోగ్యం బాగుంటుంది. సంతానానికి సౌఖ్య సంతోషాలు లభిస్తాయి.

ధనుస్సు :— మీరు శ్రమపడినా, ఫలితం దక్కదు. వృత్తిలో చికాకులు ఏర్పడతాయి. వారం మధ్యలో ఆర్థిక వ్యవహారాలు బాగుంటాయి. విద్యావైజ్ఞానిక రంగాల్లో ఖ్యాతి లభిస్తుంది. అన్ని వ్యవహారాల్లోను గౌరవం బాగుంటుంది. స్త్రీలకు— కుటుంబ వ్యవహారాల్లో కార్యభారం పెరుగుతుంది. వినోద కాలక్షేపాల్లో పాల్గొంటారు.

మకరం :— మీ ప్రయత్నాలు ఫలిస్తాయి. నూతన వ్యవహారాలు బాగుంటాయి. వారం మధ్యలో ఆందోళన కలుగుతుంది. సాహసిక వ్యవహారాల్లో నష్టం వస్తుంది. వారం ఆఖరులో వృత్తి వ్యాపారాలు అనుకూలంగా ఉంటాయి. స్త్రీలకు— ఆరోగ్యం బాగుండదు. సాటివారిలో గౌరవం లభిస్తుంది.

కుంభం :— వ్యాపారంలో సాటివారి పోటీ పెరుగుతుంది. రాజకీయ వ్యవహారాల్లో శ్రమ కలుగుతుంది. ఆర్థిక వ్యవహారాలు బాగుంటాయి. మీ ఆలోచనలు ఫలిస్తాయి. వారం ఆఖరులో చేజిక్కిన అవకాశాలు కూడా జారిపోగలవు. స్త్రీలకు — కుటుంబ వ్యవహారాలు బాగుంటాయి. పుణ్యకార్యాలు చేస్తారు.

మీనం :— వృత్తి వ్యాపారాలు ప్రోత్సాహకరంగా ఉంటాయి. మిత్రుల సహాయం లభిస్తుంది. ఎవరితోను వాద ప్రతివాదాలు తగవు. అనవసరమైన సందేహాలు కలుగుతాయి. భాగస్వాములతో కలిసి చేసే వ్యాపారాలు లాభించగలవు. స్త్రీలకు— ఆరోగ్యం బాగుంటుంది. వినోద కాలక్షేపాల్లో పాల్గొంటారు.



(గత సంచిక తరువాయి)

4

ఆ రోజు శనివారం ప్రయివేటు చెప్పడం మధ్యాహ్నమే ముగించుకొని యింటికి వెళ్ళిపోయిన పురుషోత్తమరావు, సాయంత్రంవేళ, భాను వచ్చి "ఇవాళ శనివారం కదూ మాష్టారూ గుడికి వెళ్ళరూ?" అంది

"శనివారం అయితే గుడికి వెళ్ళాలా?" అన్నాడు భాను నిరుత్సాహ పడిపోయింది కారణం, ఆ సాయంత్రం అన్నపూర్ణ, సత్య గుడికి వెళ్తారు మాష్టారు వస్తే, అత్తయ్యకు చూపించవచ్చని ఊహించిన భాను, మాష్టారు అలా అడగటంతో, నిట్టూర్చింది నిరాశగా

'నువ్వు వెళ్తావా భానూ!" అన్నాడు పురుషోత్తమరావు.

"మీరూ రాకూడదూ మాష్టారూ! ఈ ఒక్కరోజు" అంది

"ఎందుకు?"

"గుడికి ఎందుకని అడుగుతారా?" అంది ఆరిందాలా

"ఊహూఁ" అంటూ నవ్వి బయలుదేరాడు పురుషోత్తమరావు

మాష్టారు బయలుదేరడంతో, భాను సంతోష పడిపోయింది "అత్తయ్యకు మాష్టారును చూపించాలి తప్పదిక అత్తయ్య ఈరోజు మాష్టారును చూస్తుంది" అని అనుకుంటూ మురిసిపోయింది

వాళ్ళు వెళ్ళేసరికే సత్య, రుక్మిణి, రాధ అన్నపూర్ణతోపాటు గుడికి వచ్చేశారు అన్నపూర్ణ తప్ప మిగతా ముగ్గురు గుడి మెట్ల మీద కూర్చున్నారు భాను పరుగెత్తుతూ వెళ్లి ప్రదక్షిణాలు చేస్తున్న అన్నపూర్ణ ప్రక్కకు చేరింది

ఓసారి భానువంక చూసి, మౌనంగా ప్రదక్షిణాలు చేస్తున్న అన్నపూర్ణ దేవుడి కెదురుగా నిలబడి తదేకంగా విగ్రహాన్ని చూస్తున్న వ్యక్తిని చూసి ఓసారి తాకబోయి ఉలిక్కిపడి, రెండోసారి తప్పుకొని, మూడోసారి విసుక్కుంది ప్రసాదం తీసుకొని, గుడి మెట్లదగ్గరి కొచ్చింది అన్నపూర్ణ భాను పురుషోత్తమరావును తీసుకొచ్చి, "మా మాష్టారు" అంటూ మెల్లిగా చెప్పింది అన్నపూర్ణతో ఉలిక్కిపడ్డట్టుగా చూసిన అన్నపూర్ణ, యిందాక గుడిలో తను ఓసారి ఉలిక్కిపడి, మరోసారి తప్పుకొని, ఇంకోసారి విసుక్కునేలా చేసిన అతనే భాను మాష్టారు కావడంతో కంగారుపడిపోయింది

"మాష్టారూ! మా అత్తయ్య ఈమె మా పెద్దక్కయ్య" అంటూ అన్నపూర్ణను, సత్యను పరిచయం చేసింది భాను

"నమస్తే" అంటున్న అతని మాటలకు అన్నపూర్ణ తడబడిపోతూ, "నమస్తే" అంది చేతులు జోడిస్తూ మాష్టారుకు భయపడుతూ నమస్కరించే విద్యార్థినిలా, రెండు చేతులను జోడించి నమస్కరించిన అన్నపూర్ణ వంక క్షణం చూసిన మాష్టారు పెదవుల మీద చిన్న మందహాసం విరిసింది అన్నపూర్ణ చేతులు జోడించటం చూసి, సత్య కూడా బుద్ధిగా నమస్కరించింది

ప్రసాదం అందరికి పంచిన అన్నపూర్ణ యధాలాపంగా అందరికి యిచ్చి, మాస్టారును మరిచిపోయింది

"మరి మాష్టారుకు" అంది భాను గట్టిగా.

"ఓహ్" అంటూ మాస్టారును మరిచిపోయి ప్రసాదం యివ్వనందుకు ఏమనుకుంటాడోనని లోలోపలే సిగ్గుపడిపోతూ, తనకోసం మిగుల్చుకున్న ప్రసాదం ఇవ్వమంటూ, భాను కిచ్చేసింది

"మీకు" అన్నాడు పురుషోత్తమరావు.

"నాకు..." అంటూ తడబడిపోతున్న



అన్నపూర్ణను చూసి, "అవును నీకేది?" అంది భాను

"గుడికి వచ్చాక ప్రసాదం తినకుండా వుండడం పాపం తప్పు" అంటూ తన కిచ్చిన ప్రసాదంలో సగం తీసి తీసుకోమన్నట్టుగా చేయి చాచాడు పురుషోత్తమరావు. ఇబ్బందిగానే చేయి చాచింది అన్నపూర్ణ అతని పెదవుల మీద అదే అందమైన చిరునవ్వు

"వెళ్తాం మాష్టారూ!" అంది భాను అందరూ కదలడం చూసి

'ఊహు అందరి తరపున నువ్వే చెప్పేసావేం?' అన్నాడు నవ్వుతూ అన్నపూర్ణ, క్షణంపాటు అతని వంక చూసి, తెలియని స్థితి ఆవహించగా, ఎవరో తరుముతున్నట్టుగా నడుస్తూ వెళ్ళిపోయింది

"ప్రతి శనివారం మాష్టారు గుడికి వస్తారా?" అంది ఆ రాత్రి నిద్రపోయేముందు అన్నపూర్ణ భానుతో

"ఊహూఁ"

"మరి యివాళ ఎలా వచ్చారూ?"

"నేనే రమ్మని తీసుకువచ్చా నత్తయ్యా," అంటూ అసలు విషయం చెప్పి, "మా స్కూల్లో అందరి మాష్టార్ల కంటె మాస్టారే బావుంటారు రాధక్కలా తెల్లగా వున్నాడు కదూ అత్తయ్యా చాలా మంచివాడు కదూ!" అంది

"అవును" అంది అన్యాలోచితంగా అన్నపూర్ణ

జరిగిన కథ 2: జగన్నాధరావుకు చెల్లెలు అన్నపూర్ణలా భాను కూడ తనకు దూర మవుతుందేమో నన్న భయం గతాన్ని గుర్తుకు తెస్తుంది పిల్లల బాధ్యత అన్నపూర్ణ కప్పగించి కన్నుమూస్తుంది జగన్నాధరావు భార్య మహాలక్ష్మమ్మ భాను తన ముగ్గు రక్కలవలె కాక నిర్భయంగా మాటాడుతుంది తండ్రితో క్రొత్తగా ఆ వూరు వచ్చిన పురుషోత్తమరావు మాష్టారు జగన్నాధరావు ఇంట్లో ఉంటూ వారి పిల్లలకు ట్యూషను చెప్తుంటాడు భానుకు మాష్టారంటే చాలా ఇష్టం

5

ఆ సంవత్సరం స్కూల్ వార్షికోత్సవాలలో భానుచేత నాటకంలో వేషం వేయించా లనుకున్నాడు పురుషోత్తమరావు భానుచేత ఓ పాట కూడా పాడించాలని, పాట రాసి యిచ్చి ప్రతి రోజు సాయంత్రం వేళ, ప్రయివేటు అయిపోయాకా తనతో పాటె యింటికి తీసుకుపోయి నేర్పించసాగాడు

"రుక్కును పాడమంటే పాడనంది అత్తయ్యా!" అంది విషయం చెప్పి భాను

"అదేం? ఎందుకని?" అంది అన్నపూర్ణ రుక్కుని పిలిచి

"నాకు రాదు" అంది రుక్మిణి

"మాస్టారు నేర్పిస్తా నన్లేదూ?" అంది భాను

"అయినా నేను పాడను!" అంది బింకంగా రుక్మిణి

"ఎందుకు?" అంది అర్థం కాక అన్నపూర్ణ

"భయం! అవునా?" అంది భాను అసలు విషయాన్ని బయట పెడుతూ, రాధ భయపడుతుందని అందరికి తెలుసు క్లాసులో నిశ్శబ్దంగా ఎవ్వరితో మాట్లాడకుండా మూగగా కూర్చుండే రాధ, క్లాసులో మాస్టారు వేసే ప్రశ్నలకు జవాబు తెలిసినా చెప్పలేక తల వాల్చుకొని నిలబడే రాధ అంటే మాస్టార్లకు జాలి కాని రుక్మిణి అలా కాదు తెలియకపోయినా తెలిసినట్టు మొహం పెట్టి "చెప్పను" అన్నట్టుగా ప్రవర్తిస్తుంది లోపల భయం వున్నా లేనట్టు ప్రవర్తిస్తుంది ఈ విషయం అన్నపూర్ణకు బాగా తెలుసు

"నీకే వుందిలెద్దూ బోడి ధైర్యం," అంటూ కోపంగా వెళ్ళిపోయిన రుక్మిణి మీద జాలిపడుతూ, "రుక్కూ! నీకు భయం లేకపోతే ఎందుకు పాడ నన్నావ్? చెల్లికి తోడుగా వుండేదానివి నీ కంఠం కూడ బావుంటుంది నువ్వు పాడకపోయినా చెల్లి పాడుతున్నందుకు గర్వపడాలి కాని కోపగించుకుంటావా! భానును అందరూ మెచ్చుకుంటుంటే నీకు సంతోషంగా వుండదూ?" అంది ప్రక్కనే కూర్చో బెట్టుకొని నచ్చ చెబుతూ

రుక్మిణి తల వాల్చుకుంది

"భానులా నువ్వు చదవకున్నా, ధైర్యంగా మాట్లాడలేకపోయినా, చెల్లిని చూసి గర్వపడాలి కాని ఈర్ష్యపడి కోపగించుకుంటారా?" అన్న అన్నపూర్ణ మాటలకు జవాబివ్వలేదు రుక్మిణి

వరసగా రెండు ఆదివారాలు భాను యింట్లో కన్పించకపోయేసరికి, రావు అడిగాడు.

"బళ్ళో ఏదో నాటకం వేస్తున్నారట

అన్నయ్యా! మాస్టారింటికి వెళ్లింది" అంది అన్నపూర్ణ

"నాటకం ఏమిటి? భాను వేషం వేయడం ఏమిటి?" అంటూ అంతెత్తున ఎగిరిపడ్డాడు రావు "నన్ను అడగకుండా భానుచేత వేషం వేయిస్తాడా ఆ మాస్టారూ?" అంటూ అడగడానికి బయలుదేరిన రావును అప్పుడు ఆపినా, అసలు అడగకుండా ఆపలేకపోయింది అన్నపూర్ణ

"చిన్నపిల్లకదూ అన్నయ్యా! సరదాపడి అడగ్గానే పేరు యిచ్చేసిందట బళ్లో జరిగేవాటి గురించి నువ్విలా రాధ్ధాంతం చేయడం బావుండదు" అంది అన్నపూర్ణ

కాని రావు ఊరుకోలేదు రేపు స్కూల్‌లో భాను వేషం వేయడం చూసి, ఊరివాళ్లంతా రావు గారి కూతురు వేషం వేసిందని అంటే ఎంత తలవంపు? పరువేమైనా వుంటుందా? తెలిసిన ప్రతి వెధవ, ఎదురైన ప్రతివాడు మీ అమ్మాయి వేషం వేసిందటగా అని అంటే తను తలెత్తుక తిరగగలడా? అంటూ మధనపడిపోయాడు రావు.

"భాను చాలా చురుకైందండీ రావుగారూ! స్కూల్ ఆవరణలోనే జరుగుతుంది వీధి నాటకంలా అందరూ వచ్చి చూడరు భాను లేకపోతే నాటకం వేయడం మానుకోవాల్సి వస్తుంది" అన్నాడు పురుషోత్తమరావు కారణం నాటకంలో ముఖ్య పాత్ర భానుదే డైలాగులన్నీ కంఠస్తంచేసి, అద్భుతంగా నటిస్తున్న భానును చూస్తుంటే, మరొకరెవరూ అంత బాగా నటించలేరని, నాటకం తప్పకుండా అందరి మన్ననలను పొందుతుందని ఆశలు పెంచుకున్న పురుషోత్తమరావు, రావు ఖచ్చితంగా వద్దనేసరికి నచ్చచెప్పినా లాభం లేక హెడ్మాస్టరుతో చెప్పాడు

పురుషోత్తం బాధను అర్థంచేసుకున్న హెడ్మాస్టరు, స్వయంగా రావుతో మాట్లాడి, చివరికి ఈ ఒక్కసారికి ఔననిపించాడు

తండ్రి అలా అందరిచేత బతిమాలించుకొని చివరికి ఒప్పుకోవడం భానుకు నచ్చలేదు

"వేషం వేస్తే తప్పేమిటి నాన్నా!" సూటిగా తండ్రినే అడిగింది

"ఇవాళ చిన్నదానివి కాబట్టి సరిపోయింది రేపు ఇది అలవాటుగా మారుతుంది ఫలానా రావు గారి కూతురని అందరు చెప్పుకుంటుంటే మన పరువు, ప్రతిష్ట, గౌరవం ఏం కావాలి?" అన్నాడు రావు

"ఏమవుతాయి?" అర్థంకాక అడిగింది భాను

"మట్టిలో కలుస్తాయి"

"పరువు ప్రతిష్ట అంటే ఏమిటి నాన్నా! ఎలావుంటాయ్? మట్టిలో కలిస్తే మళ్లీ వెతుక్కోలేమా నాన్నా?" అమాయకంగా అడిగింది భాను

భాను చిన్న మెదడుకు అర్థం అయేలా ఎలా చెప్పాలో తోచలేదు రావుకు

"మొన్నోసారి వెంకయ్యగారబ్బాయి దొంగతనం చేశాడని, పోలీసులు వచ్చి తీసికెళ్లాకా, ఊళ్లో వాళ్లందరు వెంకయ్యగారబ్బాయి గురించి, చెడ్డగా చెప్పుకోలేదూ అంటే ఏమిటి వాళ్ల పరువు పోయి నట్టేగా అలా నీ గురించి చెడ్డగా చెప్పుకుంటే మన పరువుంటుందా?"

"కాని నేను దొంగతనం చేయడంలేదుగా నాన్నా!" భాను ప్రశ్న ఎంత అమాయకంగా వున్నా, రావుకు కోపం వచ్చింది

"మీ అమ్మాయి నాటకాల్లో వేషాలు వేస్తుందట కదూ! అని నలుగురు అడిగితే నా పరువేం వుంటుంది?"

"తప్పుకాదుగా నాన్నా!"

"తప్పుకాదూ? మా తాతల కాలంనుండి ఎవ్వరైనా అలా చేసారా? స్టేజీ ఎక్కారా? అసలు గడపదాటి వెళ్లారా?"

గడప దాటకుండా ఎలా వుండేవారో? ఎంత ఆలోచించినా అర్థంకాలేదు భానుకు.

"వాళ్లంతా యింట్లోనే వుండేవారా నాన్నా!



ఎప్పుడూ గడపదాటి వచ్చేవారుకాదా ?'' అంది ఆశ్చర్యంగా.

"ప్రక్కిళ్లకు **కూడా** వెళ్లేవారుకాదు !'' అన్నాడు గర్వంగా రావు.

"ఎందుకు నాన్నా ! పోట్లాడుకునేవారా ? లేక...'' ఆసక్తిగా అడిగింది భాను.

"తప్పుకాబట్టి ! పరువుగల యిల్లాలు ప్రక్కిళ్లకు కూడా వెళ్లేదికాదు.''

"అందరూనా ? అయితే పిల్లలు...''

"వాళ్లకూడా.'' అన్నాడు.

"మరయితే అక్కయ్యలు, నేను బడికి వెడుతున్నాంగా. ప్రక్కిళ్లకు వెళ్లి ఆడుకుంటున్నాంగా. అత్తయ్య పూజారిగారి అమ్మాయి శ్యామల వస్తే వెళ్లి మాట్లాడుతుందిగా, పెద్దక్కయ్య కూడా వాళ్ల స్నేహితురాలింటికి వెడుతుందిగామరి. ఇది కూడా తప్పేనా నాన్నా ? మనకు పరువు లేనట్టేనా ?'' భాను ఎంతో అమాయకంగా అడిగినా, ఆ ప్రశ్న, రావును చెళ్లున చరిచినట్టయ్యింది. దూరంగా కూర్చున్న రుక్మిణి, రాధ, వసారాలోని అన్నపూర్ణ కుతూహలంగా చూస్తుంటే, తండ్రి మొహంలోని కోపాన్ని చూసి, సత్య భయపడిపోతూ చూసింది. చాలాసేపటి వరకు రావు జవాబివ్వలేదు.

"మీరు చదువుకోవాలిగా మరి ! అందుకు బడికి పంపించాల్సి వస్తుంది...'' రావు మాట పూర్తి కాకముందే మధ్యలోనే, – "అయితే వాళ్ళకు చదువక్కర్లేదా నాన్నా ! చదువుకోవాలంటే ఎలా చదువుకునేవారు ?'' అంది భాను.

"వాళ్ళు యింట్లోనే చదువుకునేవారమ్మా !''

"ప్రయివేటు చదువుకునేవారా !''

"అబ్బే...'' అన్నాడు రావు.

"మరి... పరీక్ష లెలా ప్యాసవుతారు నాన్నా?''

"పరీక్షలు ప్యాసవడం దేనికి ? చక్కగా చదవటం, రాయడం వస్తే చాలు.''

"అలా అయితే పెద్ద చదువు లెలా చదువుతారు నాన్నా ! నాకు అక్కయ్యలకు చదవడం, రాయడం వచ్చేసిందిగా'' అంది.

"కాలం మారింది కదూ భానూ ! పరీక్షలు ప్యాసవ్వాల్సిందే. పెద్ద చదువులు చదివినా చదవకపోయినా, చదివినంతవరకు గుర్తుగా పరీక్షలు ప్యాసవ్వాల్సిందే'' అన్నాడు.

"మరి అలాంటప్పుడు, బళ్ళోకి వెళ్ళి చదువుకున్నాకా, నాటకంలో వేషం వేస్తే తప్పేమిటి నాన్నా ?'' కూతురు ఋష్ఫి మొదటికి రావడంతో, ఉడుకెత్తిపోయాడు రావు.

"నే చెప్పానుగా !'' తప్పు అన్నాక అది తప్పే. వెళ్ళి ఆడుకో'' అంటూ భానును పంపించాడు. కాలం మారిందంటూనే, కాలం మార్పును గుర్తిస్తూనే మరు క్షణంలోనే మరిచి, మూర్ఖంగా మాట్లాడే రావు అంటే, అన్నపూర్ణకు చిరాకుతో పాటు, జాలి కలిగేవి. కాని అతని బలహీనతను ఏనాడూ ఆమె పిల్లల ముందు బహిర్గత పరచలేదు.

"అన్నయ్యా ! భాను చిన్నపిల్ల అయినా తెలివిగలది అర్థం లేనివాటి గురించి చెబుతూ, తృప్తి కలిగించలేక కసురుకోవడం ఏం బావుంటుంది. అవసరానికి రాని ఆ పరువు ప్రతిష్టల గురించి పిల్లల కెందుకు చెప్పడం కాలం మారుతోంది అన్నయ్యా ! ఈనాటి ఈ తరానికి అవసరమైనవి, రేపటి మరో తరానికి పనికిమాలినవిగా కన్పిస్తాయి. అలాంటప్పుడు, పాతవాటిని పట్టుకొని వ్రేలాడ్డం...''

"అది కాదు పూర్ణా ! వాటి అవసరం మనకు...''

"నీ కుంది అన్నయ్యా ! వాళ్ళకు ముడిపెట్టకు. పెంచడం వరకే నీ ధర్మం. ఆ తరువాత వాళ్ళ ఇష్టం. మంచేదో, చెడు ఏదో తెలిసేలా పెంచితే చాలు. మన బాధ్యత తీరుతుంది'' అని అంటున్న అన్నపూర్ణ మాటలకు, రావు చిరాకు పడిపోయాడు.

"పూర్ణా ! ఈ యింట్లో నాకేం అవసరమో, మిగతావారికి అవే అవసరంగా వుండాలి. వాళ్ళను వాళ్ళ ఇష్టానికి వొదిలేస్తే... చెడిపోతారు'' అన్నాడు. అతని మాటలకు అన్నపూర్ణ నవ్వింది.

"అన్నయ్యా ! అధికారంతో నీ మాట శాసనంగా మార్చగలవ్ కాని... కాలం నీకు లొంగదు. కాలంతోపాటు మారే మార్పు నీకు అందదు. ఈ పిల్లలు... నీ శాసనాన్ని బలవంతంగా ఆచరించినా... భాను... భాను మాత్రం ఏనాడు నీకు లొంగదు. ఈ మార్పును ప్రతీకగా నిలుస్తుంది.'' అనుకుంది అన్నపూర్ణ.

రావులోని మొండి పట్టుదల, అర్థంలేని ఆవేశం, చాలాసార్లు, పిల్లలను చాలా విషయాల్లో నిర్బంధించేవి.

కులం గాని వాళ్ళతో, పాలేరు లాంటి పనివాళ్ళతో పిల్లలు ఆడుకోవడానికి వీలు లేదు. పిల్లలెవరు, పరాయి యిళ్ళలో, పచ్చి మంచినీళ్ళు తాగకూడదు. యింటికి ఎవరైనా వస్తే, బయటికి రాకూడదు. తాను ఏదైనా చెప్పాడంటే, అది తు. చా. తప్పకుండా వినాలి. అనుసరించాలి. తన యిష్టాన్నే, తమ యిష్టంగా మార్చుకోవాలే తప్ప ఎదురు ప్రశ్నలు వేయరాదు.

ఈ విషయాలేవి అన్నపూర్ణకు నచ్చేవి కావు. ఏలాటి లోటూకన్పించనీయకుండా పిల్లలను పెంచినా, ఈ నిర్బంధాలలో పిల్లలు పెరగడం, అన్నపూర్ణకు బాధగా వుండేది. ఆమె చదువుకోకపోయినా, సంస్కారం నిండుగా నింపుకున్న మనిషి. కాలం మార్పుతోపాటు, మంచి చెడుతోపాటు, అర్థం లేని వాటి గురించి పాకులాడే వెర్రి లేని ఆమె చాలా విషయాల్లో రావుతో వాదించేది. అయినా రావు తన మొండి పట్టుదల వొదిలేవాడు కాదు అన్నపూర్ణ మాటలకు మౌనం వహించినా తన కిష్టంలేని పని యింట్లో ఎవరు చేసినా కోపంతో మండిపడేవాడు. అలాంటి సమయాల్లో, అతణ్ణి మార్చలేక, పిల్లలను వెనకేసుకొచ్చేది అన్నపూర్ణ.

సత్య, రుక్మిణి, రాధ అంతగా అల్లరి చేసేవారు కాదు. తండ్రి అంటే వాళ్ళకు భయం ఎక్కువ. ఏ పని చేయాలన్నా, పెదవి విప్పి, తండ్రితో గట్టిగా మాట్లాడాలన్నా, వాళ్ళకి బెదురే. ఒక్క భాను మాత్రం ధైర్యంలో అన్నపూర్ణను స్ఫురింపచేస్తూ, ప్రతి చిన్న విషయానికి తండ్రితో వాదన వేసుకునేది.

ఎప్పుడైనా తమ పాలేరు కూతురు లక్ష్మి వస్తే – భాను ఎంతో స్నేహంగా పలుకరించి మాట్లాడేది. అది చూసిన, రావు మండిపడేవాడు. "ఆ అమ్మాయితో నీకు స్నేహ మేమిటి భానూ ! అసలు ఆ అమ్మాయిని తాకకూడదు !'' అంటూ గట్టిగా అనేవాడు.

"ఎందుకు నాన్నా ! ఆ అమ్మాయి చాలా మంచిది. రోజూ స్నానం చేస్తుంది. నేను తాకితే ఏమిటి ?'' అని అడిగేది. తాకకూడదు అని తండ్రి అన్నందుకు.

"అలా అడ్డమైనవాళ్లను తాకితే మైలపడిపోరూ ? స్నానం చేసిరా'' అనే తండ్రి మాటలకు, "మైలపడ్డం ఏమిటి నాన్నా ! ఆ అమ్మాయి ఎంతో శుభ్రంగా వుంది. జిడ్డుమొహం కాదుగా'' అనేది అమాయకత్వంగా.

భాను మాటలకు రావు కోపంతో ఊగిపోయేవాడు. కాని అన్నపూర్ణ వచ్చి శాంతపరిచి, రావు ఎదురుగా "రా ! భానూ నీళ్ల పోసుకుందువుగాని'' అంటూ, తీసికెళ్లిపోవడంతో శాంతించేవాడు.

"ఎందుకత్తయ్యా నాన్న అలా అంటాడు ?'' అంటూ అన్నపూర్ణను వేధించేది భాను.

"ఆ అమ్మాయి నాలాగే వుంటుంది. ఎందుకు తాకకూడదు. మనకు బోల్డు డబ్బుంది కాబట్టి, లక్ష్మి వాళ్ల నాన్నకు డబ్బులేదు కాబట్టి మన దగ్గర పాలేరు పని చేస్తున్నాడు. లక్ష్మి వాళ్ల నాన్న చేస్తున్నాడేకాని లక్ష్మి కాదుగా. లక్ష్మిని తాకితే తప్పేమిటి ?'' అంటూ నిలదీసేది.

"నువ్వు మొన్న పాఠం చదివావు గుర్తుందా ! ఆరోగ్యమే మహాభాగ్యం అంటూ. మరి ఆరోగ్యం జాగ్రత్తగా చూసుకోవాలిగా. లక్ష్మి ఊరవతల ... మురికివీధిలో వుంటుందికదూ ! తాకితే ... నీకు జబ్బుచేస్తుందని అలా అన్నాడు నాన్న !'' అంటూ నచ్చచెప్పేది అన్నపూర్ణ.

మరోసారి, రహీంసాయిబు కూతురు సుల్తానాను యింట్లోకి తీసుకొచ్చింది భాను. బొమ్మలపెళ్లికి భానుతోపాటు, సుల్తానా ఇల్లంతా కలయతిరగడం, యింట్లోకి వచ్చిన రావు చూస్తూనే గట్టిగా అరిచినంత పని చేసాడు.

"ఆ ముస్లిముల పిల్లను యిల్లంతా తిప్పుతావా ?'' అన్నాడు కోపంగా.

"ఏమవుతుంది నాన్నా !'' అంటున్న భానును కొట్టబోయాడు రావు. అన్నపూర్ణ అడ్డుకుంది.

"ఏమిటత్తయ్యా ప్రతిదానికి నాన్నకు కోపం వస్తుంది నేను వాళ్లింట్లోకి వెళ్లి అంతా తిరుగు

అలలు

గాలి తరలించినప్పుడు
మురళి రవళించినప్పుడు
ప్రకృతి పరవశించినప్పుడు
ఎదలో స్తబకాలు పూస్తాయి
సుధలూరు తలపులు తోస్తాయి !
పువ్వు నవ్వినప్పుడు
నవ్వు వెలిగినప్పుడు
వెలుగు కలిగినప్పుడు
సౌజన్యం మెరుస్తుంది
చైతన్యం విరుస్తుంది !

- ఎన్. ఆర్ వెంకటేశం

తాను. ఓసారి వాళ్ల మసీదుకు కూడా వెళ్లాను చూడ్డానికి. నాకేం కాలేదు. నువ్వు చెప్ప ... దేవుడు ఒక్కడేనని చెప్పలేదు నువ్వు'' అంది.

అన్నపూర్ణకు జవాబేం చెప్పాలో తోచక, ''అదికాదమ్మా భానూ, మనం యింట్లో చెప్పులు వేసుకు తిరుగుతామా? మరి ఆ అమ్మాయి వేసుకుందికదూ!'' అంటూ నచ్చచెప్పి బుజ్జగించేది.

''ఊఁ ... నువ్వు నాన్న ఒకేపార్టీ'' అంది భాను మూతి ముడుచుకుంటూ.

6

ఆ రోజు ప్రొద్దున్నుండి, యింట్లో లేదు భాను. ఆ రోజు సాయంత్రమే స్కూల్ వార్షికోత్సవం. రిహార్సిల్ అంటూ వెళ్ళిపోయింది. మధ్యాహ్నం భోజనానికి కూడా రాలేదు. అన్నపూర్ణ గాబరా పడిపోయింది. ఆ రోజు స్కూల్‌కు సెలవిచ్చారు. సత్యతోపాటు రుక్మిణి, సత్య స్నేహితురాలింటికి వెళ్ళింది. రాధ హోం వర్కు చేసుకుంటూనే అలాగే నిద్రపోయింది. అన్నపూర్ణకు ఎటూ తోచలేదు. సమయానికి రావు యింట్లో లేడు. ఏ పాలేరూ అటువైపు రాలేదు.

వీధి గుమ్మంలో నిలబడి, ఎవరైనా కన్పిస్తారేమోనని చూస్తున్న అన్నపూర్ణ, నిప్పులు చెరుగుతున్న ఎండలో భాను దూరం నుండి రావడం చూసి, దగ్గరికి రాగానే – ''ప్రొద్దుననగా రెండు ముద్దలు తిని వెళ్ళావ్! ఆకలి వేయడంలేదూ? చూడు మొహం ఎలా పీక్కుపోయిందో! యిక వేషం వేసినట్టే, అయినా మీ మాస్టారుకు ఆ మాత్రం తెలీయదూ! పసిపిల్ల ఆకలి వేస్తుందన్న ధ్యాస లేకుండా ఏమిటీ?'' అంటూ భాను మొహాన్ని రెండు చేతుల్లోకి తీసుకొని నిమురుతున్న అన్నపూర్ణ కళ్ళలో నీళ్ళు తిరిగాయి.

''ష్..., అత్తయ్యా! మాస్టారూ!'' అంది మెల్లిగా భాను. అంతవరకు భాను వెనకే వచ్చిన పురుషోత్తమరావును గమనించని, అన్నపూర్ణ ఒక్కసారిగా ఉలిక్కి పడిపోయింది. గబుక్కున మొహం దించుకొని లోపలికి వెళ్ళిపోయింది.

''అత్తయ్యా! నా పట్టు పరికిణీ ఇవ్వవూ?'' అంది మాస్టారును కూర్చోబెట్టి లోపలికి వస్తూ.

''ఊఁ... సరేకాని, వెళ్ళిపోయాడా? వెనకే తీసుకొచ్చావేం? మళ్ళీ వెంటనే వెళ్ళాలా? వీల్లేదు. కొస్త అన్నం తిని, కాసేపు...''

''అన్నం అప్పుడే తినేసాను అత్తయ్యా! నే వెళ్ళాలి త్వరగా! పరికిణీ యిచ్చేయ్!'' అంది భాను.

''ఎక్కడ తిన్నావ్?'' విస్తుపోతూ అడిగింది.

''మాస్టారు టిఫెన్ కారియర్ తీసుకొస్తే యిద్దరం తినేసాం.''

''ఆఁ...'' నిర్ఘాంతపోయింది అన్నపూర్ణ.

''భానూ! నాన్నతో ఈ విషయం చెప్పకు సుమా! తిడతాడు'' అంది.

''ఎందుకు?'' అంది భాను. వెంటనే సమాధానం చెప్పలేకపోయింది అన్నపూర్ణ.

''కులం పోతుందని నాన్న తిడతాడంటే – కులం అంటే ఏమిటి'' అంటూ అడుగుతుందని మౌనం వహించింది అన్నపూర్ణ.

''అలాగేలె! ముందు పరికిణీ యిచ్చేయ్!'' అంది భాను హడావుడిగా.

''కడుపునిండా తిన్నావా? పోని ఓ ముద్ద పెరుగుతో తింటావా!''

''టిఫెన్ అంతా నాకే పెట్టారు. పాపం! మాస్టారు ఏం తిన్లేదు. ఆ...దార్లో చెప్పారు. యింటికెళ్లగానే మంచినీళ్లు ఇవ్వమని; యివ్వు అత్తయ్యా!'' అంది భాను అప్పుడు గుర్తుకు తెచ్చుకుంటూ.

''మాస్టారు వెళ్లిపోలేదూ?''

''ఊహూఁ. బయట గదిలో వున్నారత్తయ్యా!' అంది భాను నీళ్లు తీసుకువెడుతూ. అంతవరకు తనెంత గట్టిగా మాట్లాడిందో, గుర్తుకొచ్చి సిగ్గుపడిపోయింది అన్నపూర్ణ. అంతలోనే ''భానూ!' అంటూ వెనక్కి పిలిచింది అన్నపూర్ణ.

''మీ మాస్టారేం తిన్లేదన్నావుగా! పాలున్నాయ్! కాచి యివ్వనా! అటుకులు వేసుకు తింటారా?'' అంది.

''త్వరగా చేసియిస్తావా అత్తయ్యా! ఆలస్యం అవుతుందేమో!''

''క్షణంలో చేసియిస్తానమ్మా! మంచినీళ్లు తీసుకువెళ్లకుమరి'' అంటూ గబగబా వంటింట్లోకి వెళ్లిపోయింది.

పావుగంటకల్లా పాలు కాచి, అటుకులు పంచదార వేసి యిస్తూ, ''మీరు తినేసరికి, నేను పరికిణీ తీసిపెడతా'' అంటూ గిన్నెలు అందించింది.

''అమ్మో!'' అంటూ కెవ్వున కేకవేసి, గిన్నెలు కిందపెట్టి ''కాలుతున్నాయ్ అత్తయ్యా! నువ్వే తీసుకురా'' అంటూ వెళ్లిపోయింది.

''నేనా?'' అంది అన్నపూర్ణ. పురుషోత్తమరావు ముందుకు వెళ్లాలంటె, మరోసారైతే వెళ్లేదే. కాని యిప్పుడు వెళ్లాలంటే, యిందాకటి తన మాటలు గుర్తుకువచ్చి సిగ్గు, సంకోచం కలిగాయి.

''అత్తయ్యా! మాస్టారు వెళ్లిపోదామంటున్నారు'' భాను కేకవేయడంతో అన్నపూర్ణ యిక తప్పదనుకొని, ఓ గిన్నెను ఎడమ అరచేతిలో పెట్టుకొని రెండో గిన్నెను, కుడిచేయి కాలుతున్నా, లెక్కచేయకుండా, వంటింట్లో నుండి, వసారాలోకి వచ్చి బయటి గది గుమ్మలో ఆగిపోయింది.

గుమ్మంలో నిలబడ్డ పురుషోత్తమరావు అన్నపూర్ణను చూస్తూనే, ''త్వరగా తిని వచ్చెయ్ భానూ'' అంటూ అడుగు వేయబోయాడు.

''అత్తయ్య మీకు కూడా తీసుకువచ్చింది మాస్టారూ!'' అంటున్న భాను మాటలకు అన్నపూర్ణ వంక తిరిగి ''నేను యిందాకే టిఫిన్ తిన్నానండి'' అన్నాడు. అతను తనతో చెప్పేసరికి అన్నపూర్ణ ఉలిక్కిపడి –

''మీ టిఫిన్ అంతా భాను తిన్నానని చెప్పింది. ఫర్వాలేదు'' అంటూ సూటిగా తననే చూస్తున్న పురుషోత్తమరావు వైపు చూడలేక, కళ్లు వాల్చేసుకుంది. వేడికి అరచేయి, వేళ్లు కాలిపోతున్నాయ్.

''అబ్బా! కాలుతున్నాయ్ అత్తయ్యా!'' అంటూ మరోసారి అందుకోబోయి కింద పెట్టేసింది భాను. గుమ్మంలో నిలబడ్డ అన్నపూర్ణ గది లోపలికి రాలేదు.

''ఓహ్! కాలుతోందా భానూ!'' అంటూ, అన్నపూర్ణ చేతిలోని గిన్నెను అందుకున్నాడు పురుషోత్తమరావు. అతని వేళ్ళు వేడికి చురుక్కుమన్నాయ్. అన్నపూర్ణ వంటింట్లోకి వెళ్ళి, మంచినీళ్ళు తీసుకువచ్చి, కాస్త ధైర్యంగా లోపలికి వెళ్ళి టేబుల్ మీద పెట్టివస్తుంటే, ఎర్రబారిన ఆమె

(29వ పేజీ చూడండి)



చిత్తూరుజిల్లా రచయితల నాలుగవ మహాసభలు జూన్ 7 నుంచి 9 వరకూ చిత్తూరులో జరిగాయి. ప్రారంభోత్సవ సభలో నివేదికని సమర్పిస్తున్న సంఘం ప్రధాన కార్యదర్శి శ్రీ కె రామకృష్ణ ప్రక్కన వరుసగా సంఘం అధ్యక్షులు శ్రీ కె బాలకృష్ణారెడ్డి, పద్మశ్రీ పుట్టపర్తి నారాయణాచార్యులు, శ్రీ ఎం ఎస్ రెడ్డి (సభాధ్యక్షులు), సంఘం గౌరవాధ్యక్షులు శ్రీ కె రామస్వామి అయ్యంగార్లను చిత్రంలో చూడవచ్చు

సినిమా విశేషాలు



ఎన్టీఆర్‌తో కలర్ !

శోభన్‌బాబుతో కలర్ చిత్రాన్ని నిర్మిస్తున్న డి వి ఎస్ రాజు మరొక మంచి కథను అన్వేషిస్తున్నారు ఈ కథలో నాయకుడిగా 'నటరత్న' నటిస్తారు ఇదికూడా ఈస్ట్‌మన్ కలర్‌లో నిర్మిత మవుతుంది

కొత్త చిత్రంలో రామారావు !

"లక్ష్మీకటాక్షం" చిత్రాన్ని నిర్మించిన పింజల సుబ్బారావు యిటీవల ఒక శుభవార్త చెప్పారు. అదేమిటన నందమూరి తారకరామారావుతో ఒక పౌరాణిక చిత్రాన్ని రంగులలో నిర్మిస్తారట. బహుశా "పాశుపతాస్త్రం" కావచ్చు

మళ్లీ వచ్చింది !

"మరపురాని తల్లి" చిత్రం ద్వారా ఒక ప్రతిభ వున్న దర్శకుడిని పరిచయం చేశారు రవిరాజ్ అధినేత కేశన జయరాం తన రెండవ చిత్రానికి మరెవ్వరినో దర్శకుడిగా పెట్టుకొన్నట్లు చెప్పిన విషయాన్ని పాఠకులకు తెలిపాను

ఈమధ్య ఒకచోట ఆయన్ను కలిసినప్పుడు తన రెండవ చిత్రాన్ని కూడా డి ఎస్ ప్రకాశరావుకు యిచ్చినట్లు చెప్పాడు "వెరీగుడ్" అన్నాను

ఒక మంచి వ్యక్తిని పైకి తీసుకురావడం ఎప్పుడైనా శ్రేయస్కరం అని ఆయనతో అన్నాను. ఈ చిత్రంలో కృష్ణ, వాణిశ్రీ ప్రధాన పాత్రలను పోషిస్తారు మహారథి మాటలను రాస్తున్నారు



"మాంగల్య భాగ్యం"లో ఒక దృశ్యం

స్వాతంత్రం వచ్చింది

ఈ పేరు గొన్న ప్రయోజనాత్మక చిత్రాన్ని జయప్రద మూవీస్ తలపెట్టింది. దీనికి మూలం గణేష్ పాత్రో రాసిన "కొడుకు పుట్టాలి; పావలా" అని డాక్టర్ ప్రభాకరరెడ్డి చెప్పారు.

మన దేశానికి స్వతంత్రం వచ్చి యిరవై ఆరు ఏండ్లు పూర్తయినాయి. అయినా, నిజమైన స్వేచ్ఛ ఎంతమందికి వచ్చింది, ఎందరు అనుభవిస్తున్నారు అన్నది తీరని సమస్యగానే వున్నది. ఈ అంశంపై అల్లబడిన కథ "స్వతంత్రం వచ్చింది" అన్నారు డాక్టర్. ప్రభాకరరెడ్డి. ఈ చిత్రానికి ముద్దిపట్ల సూరి సినేరియోను, లక్ష్మీదీపక్ దర్శకత్వాన్ని చేపట్టారు. సంగీతాన్ని సత్యం, ఛాయను రామమూర్తి నిర్వహిస్తారు. ఇందులోని ప్రధాన పాత్రలను గుమ్మడి, ప్రభాకరరెడ్డి, రావు గోపాలరావు, త్యాగరాజు, ప్రభ, శుభ, కె. విజయ, మమత + నిర్మల పోషిస్తున్నారు. కథానాయకుడి వేషాన్ని మీ రభిమానించే నాయకులలో ఒకరు వేస్తారు.

రచయితగా ప్రభాకరరెడ్డి ఎంత ప్రతిభావంతుడో ఆయన అందించిన "పచ్చని సంసారం, పండంటి కాపురం, గాంధీ పుట్టిన దేశం" చిత్రాలే సాక్ష్యాలు.

పల్లె పడుచు

మమతా కంబైన్స్‌వారి "పల్లెపడుచు" చిత్రం దాదాపు పూర్తయినట్లు నిర్మాత వాశిరాజు ప్రకాశం ద్వారా తెలుసుకొన్నాను. ఈ చిత్రం "గాయ్ అవుర్ గోరి" ఆధారంగా నిర్మించబడింది. శారద, లక్ష్మి అనే ఆవు ముఖ్య పాత్రలను పోషించిన యీ చిత్రానికి కృష్ణంరాజు కథానాయకుడు. ఉపనాయికగా విజయలలిత నటించింది. హీరో అమ్మగా అంజలీదేవి అగుపించే యీ చిత్రంలో హాస్య భూమికలను రాజబాబు, రమాప్రభ ధరించారు. యువకుల్ని పరవశింప చెయ్యడానికి జ్యోతిలక్ష్మి కూడా వుంది

"పల్లె పడుచు" చిత్రానికి బొల్లిముంత మాటలను మధుర మనోహరంగా వ్రాశారు సాలూరి రాజేశ్వరరావు సుమధుర సంగీతాన్ని సమకూర్చారు ప్రతి ఆర్టిస్టును ధామస్ తన చతురతతో అందంగా ఫొటోగ్రాఫ్ చేశారు. పెద్దపెద్ద సెట్లను కళాధర్ కళాత్మకంగా నిర్మించారు.

"కాలం మారింది" ప్రకాశానికి పేరు బహుమతిని ఆర్జించిపెడితే, 'పల్లె పడుచు' కానుక యిచ్చే మాపును ఆకట్టుకొంటుంది

ప్రెసిడెంట్ పేరిందేవి

ఈ పేరును తన మూడవ చిత్రానికి యిడినట్లు నిర్మాత ప్రకాశం చెప్పారు ఆగస్టు 15 పాటల రికార్డింగు ప్రారంభ మవుతుంది సెప్టెంబర నుండి షూటింగు ఆరంభం ప్రెసిడెంట్ పేరిందేవి పాత్రను "పల్లె పడుచు" పాత్రధారిణి ధరిస్తుంది

సంవత్సరానికి మూడు చిత్రాలు

ప్రేక్షకులకు నచ్చిన జంటలలో శోభన్‌బాబు శారద ఒకటి అనేది నిజాన్ని ఎవరూ కాదనలేరు ఇంతవరకు యీ జంటకు అపజయం నేస్తంగ రాలేదు. అలా రాకుండా వుండడానికై ఒక సముచి నిర్ణయాన్ని యీ యిద్దరు తీసుకొన్నారట అదేమిటన, సంవత్సరానికి యిద్దరూ కలి మూడు చిత్రాలలో మాత్రమే నటిస్తారట

ఈ ఏడు రెండు మాత్రమే అంగీకరించారు ఒకటి లక్ష్మి ప్రొడక్షన్స్ వారి రంగుల చిత్రం రెండు. రవిశంకర్ ఆర్ట్‌పిక్చర్స్‌వారి బలిపీఠం వర్ణ చిత్రం. ఈ రెండూ 1974 డిశంబరుకలా విడుద లవుతాయి.

పంతులమ్మ పాత్ర

"పాపం పసివాడు" నిర్మాత పూర్ణచంద్రరావు రంగులలో నిర్మిస్తున్న చిత్రంలో శారద పంతులమ పాత్రను పోషిస్తున్నది. ఆమె ఆ గ్రామంలో పుత్ర

హాలను యిచ్చే హౌస్ట్ మ్యాన్‌ను ప్రేమిస్తుంది అతడు పంతులమ్మను హృదయరాణిగా ఏలుకొంటాడు ఇద్దరూ అదమరచి హాయిగా జీవితాన్ని గడుపుతుంటారు. గాఢానురాగ బద్ధులైన యీ యిద్దరి జీవితంలో విధి వింత మలుపును తెచ్చింది. ఆ మలుపు యీ చిత్రానికి జీవనాడి అని కథకుడు గొల్లపూడి ద్వారా తెలిసింది. అట్టి రహస్యాన్ని బహిర్గతం చేస్తే, చిత్రంలో థ్రిల్ ఎలా వుంటుంది ?

ఈ చిత్రంలో అతిథి పాత్రలను పోషించడానికి ఎస్వీ రంగారావు, లక్ష్మి, చంద్రమోహన్ అంగీకరించారు. ఒక ముఖ్య భూమికను కాకరాల ధరిస్తున్నాడు. అతడి ట్యాలెంట్‌ను పరీక్ష చేసే పాత్ర యిది. ఈ చిత్రానికి చలపతిరావు సంగీత సారథి. ఆయన కొత్త పోరవడిని యీ చిత్రంలో ప్రవేశ పెట్టారు. కన్నప్ప ఛాయను చేపట్టడంచేత, కెమెరా పనితనాన్ని గూర్చి వేరే చెప్పనక్కరలేదు. ఈ చిత్రానికి తాతినేని రామారావు దర్శకుడు. ట్రీట్‌మెంటును ట్రిమ్ముగా వ్రాసుకుని రంగంలోకి దిగాడు రామారావు. మాటలను సత్యానంద్ వ్రాశాడు. చిత్రం సగం పూర్తయింది.

బలిపీఠం

ప్రముఖ కథా రచయిత్రి వ్రాసి, బహుళ పాఠకాదరణ పొందిన యీ నవలను రంగుల కావ్యంగా రూపొందిస్తున్నారు, రవిశంకర్ అధినేత సునీల్ చవుదరి. జాన్ పదిన శ్రీ శ్రీ వ్రాసిన పాటలో యీ చిత్రానికి అంకురార్పణ జరిగింది. ఈ చిత్రానికి చక్రవర్తి సంగీత దర్శకుడు.

దాసరి - శోభన్

శోభన్‌బాబు నటిస్తున్న చిత్రానికి దాసరి దర్శకత్వం చేపట్టడం "బలిపీఠం" ద్వారా జరిగింది. ఈ చిత్రానికి మాటలను, సినిమా అనువాదాన్ని కూడా నారాయణరావు సమకూర్చారు.

ఇంతవరకు శారద ప్రేక్షకుల సానుభూతిని, ఓదార్పును పొందే కరుణరస ప్రధానమైన పాత్రలను పోషించియుంది. కాస్త భిన్న ప్రవృత్తి కలిగిన పాత్రను "బలిపీఠం"లో ధరిస్తున్నది సహాయ పాత్రలను సత్యనారాయణ, రాజబాబు, అల్లు రామలింగయ్య, కె వి చలం, రోజారమణి, నిర్మల, రమాప్రభ పోషిస్తున్నారు. ఈ చిత్రానికి రామ్ చవుదరి ఛాయాగ్రాహకుడు.

ఈ చవుదరి యిప్పటివాడు కాదు. ఈడూ-జోడు నాటివాడు. సరుకు వున్న సమర్థుడు. "మేనకోడలు" చిత్రం యితడి ప్రతిభకు కాణాచి. ఇప్పుడు శ్రీ వాణీ ఆర్ట్ కంబైన్స్‌వారి "పుట్టింటి గౌరవం", ఎస్. ఎ. మూవీస్‌వారి "వర్ణ చిత్రం" యితడు చేస్తున్న చిత్రాలు.

కన్నీటి కథ


మహిళా దర్శకురాలు విజయనిర్మల రూపొందిస్తున్న మూడవ చిత్రం యిది. దీనికి ఈవిడ దర్శకత్వం నిర్వహించిన "కవిత" మళయాళ చిత్రం మూలం.

తెలుగులో ఈమె గొప్పతనం ఏమిటో "మీనా" చిత్రం విశదపరిచింది. "కన్నీటి కథ" చాలా క్లిష్టమైన ప్రయత్నం అనే చెప్పాలి. ఈ చిత్రానికి మహారథి మాటలను, రమేష్‌నాయుడు సంగీతాన్ని, గోపీకృష్ణ ఛాయాగ్రహణాన్ని చేపట్టారు.

ఇద్దరు కొత్తవాళ్లు

విజయకృష్ణ కంబైన్స్ ప్రారంభించిన "కన్నీటి కథ" చిత్రంలో విజయనిర్మల, దేవిక, ఛాయాదేవి, జగ్గయ్య, గిరిబాబు, అల్లురామలింగయ్యలతో బాటు ఖమ్మం నుండి కథానాయకుడు, విజయవాడ నుండి వుపనాయిక పాల్గొంటున్నారు. ఆంధ్రప్రదేశ్‌లో ఈ చిత్రం షూటింగు పూర్తవుతుంది. దుష్ట పాత్రను "కన్నవారి కలలు" చిత్రంలో కెప్టెన్ వేషాన్ని వేసిన భక్తవత్సలం పోషిస్తున్నాడు.

అశం శుభం ఎరుగని అమాయకురాలికి జరగరాని అపచారం, అవమానం జరిగిన విచిత్ర వైఖరి



"ఇంటికోడలు"లో ప్రమీల, కృష్ణంరాజు



"సోము"లో చంద్రకళ

ఈ కథలోని ముఖ్య అంశం.

చంద్రముఖి ఎవరు ?

విజయకృష్ణ మూవీస్ సినిమాస్కోప్ కలర్‌లో తలపెట్టిన శరత్ అపూర్వ సృష్టి 'దేవదాసు'. చిత్రంలో అతి ముఖ్యమైన చంద్రముఖి పాత్రను పోషించడానికి సరైన తార వహీదా తప్ప మరొకరు లేరు అనిపిస్తుంది.

చంద్రముఖి అపవిత్రమైన పాత్ర అని కొందరు అపోహపడి, వెయ్యడానికి వెనుకాడారట' చిత్రంలో పవిత్రతను చివరివరకు తను నమ్మిన దేవుడిపైన కేంద్రీకరించిన పాత్ర చంద్రముఖి అన్న నిజాన్ని ఎవరు కాదనగలరు. అట్టి పాత్ర గాకపోతే వైజయంతిమాల వేసివుండేదా ?

దేవదాసుగా కృష్ణ, పార్వతిగా విజయనిర్మల, ధర్మదాసుగా మిక్కిలినేని, దుర్గాపురం జమిందారుగా గుమ్మడి, దేవుడి స్నేహితుడు భగవాన్‌గా సత్యనారాయణ, దేవదాసు అన్నయ్యగా కాంతారావు, వదినగా కృష్ణకుమారి, దేవదాసు తండ్రిగా రావు గోపాలరావు నటిస్తారని తెలిసింది.

"దేవదాసు" చిత్రానికి ఆత్రేయ కలం బలాన్ని, రమేష్‌నాయుడు సంగీత సామర్థ్యాన్ని, గోపీకృష్ణ ఛాయాగ్రహణ చాతుర్యాన్ని ప్రదర్శిస్తారు. జులై యిరవైనుండి షూటింగు ప్రారంభం అవుతుంది.

ఈ చిత్రంపై వస్తున్న విమర్శలే చిత్ర విజయానికి కొంతవరకు దోహదం చేస్తాయి అన్నది నా నమ్మకం.

చిన్ననాటి కలలు

రవీంద్రా ఆర్ట్ పిక్చర్స్ యింతవరకు తీసిన ఏ చిత్రమూ "బాగోలేదు" అన్న పేరును పొందలేదు. ఆదే నమ్మకంతో ప్రస్తుతం తమ్మారెడ్డి కృష్ణమూర్తి తన నిర్వహణలో ధ్రువన్విత అనే చిత్ర నిర్మాణ సంస్థ ద్వారా "చిన్ననాటి కలలు" అన్న కరుణరస ప్రధానమైన చిత్రాన్ని మైసూర్ స్టుడియోలో తన పుత్రుడు టి లెనిన్‌బాబు దర్శకత్వంలో తయారు చేస్తున్నారు. పేరునుబట్టి చూస్తే, ఇదొక కన్నీటి కథ అని తెలుస్తోంది.

చిన్నతనంలో కలలుకనడం సర్వసాధారణం. ఏవేవో కోర్కెలు అలల్లా మనసు నరాల్లో పెనవేసుకుంటాయి. ఏదో చెయ్యాలి, సాధించాలి అన్న ఆవేశం ఆవహిస్తుంది. కానీ అవన్నీ నెరవేరుతాయా? మంచుగడ్డలు కరిగిపోయేట్లు కొందరి కలలు కన్నీటిబొట్లుగా కరిగిపోతాయి. జీవితంలోఎదురైన సమస్యల సుడిగుండంలో చిక్కుకొని,వూహించుకున్న కలలు గాలిమేడల్లా నిలిచిపోగా, లోకుల ఎత్తిపొడుపులకు అనవసరంగా బలి అయిపోయిన ఓ మగువ కథయే "చిన్ననాటి కలలు".

కృష్ణంరాజు, గుమ్మడి, జయంతి,ప్రమీల,అల్లురామలింగయ్య, రావుగోపాలరావు, పి వెంకటేశ్వరరావు, కె వి చలం, రమాప్రభ,ఝాన్సీ, పుష్పకుమారి, సుజాత ప్రధాన పాత్రధారులైన ఈచిత్రానికి కథను భీసెట్టి లక్ష్మణరావు, మాటలను పినిసెట్టి, భీసెట్టి, ఛాయను వి ఎస్ ఆర్ కృష్ణారావు, సంగీతాన్ని చలపతిరావు, కూర్పును ఆదుర్తి హరనాథ్ సమకూరుస్తున్నారు. టి భరద్వాజ, డాక్టర్ ఇ యస్ రెడ్డి నిర్మాతలు.

ఇల్లు - వాకిలి

నాగరికత దినదినానికి నాకాన్ని అందుకుంటున్న రోజులివి. పాశ్చాత్య దేశంలో ఏ ఫాషన్ వాడుకలో వుందో అదే ఫాషన్ మన దేశంలో విశృంఖల విహారం చేస్తున్న రోజులివి. మన సంస్కృతిని, మన వేష భాషలను విస్మరించి, పరాయివాని వేషాన్ని, భాషను అరువు తెచ్చుకొని, మన పరువు విలువను తగ్గించేస్తున్నారు తెలివిగలవాళ్ళ కొందరు. మరికొందరు వారికి తాళం వేస్తున్నారు. కానీ భవిష్యత్తులో దీని పరిణామం ఏమిటి? నాగరికతా వ్యామోహం యిలా దినదినానికి దిగజారిపోవాల్సిందేనా? అలా జరగడం మూలంగా వాటిల్లే కష్టనష్టాలు ఏమిటి? ఈ విషయా లన్నింటిని సమన్వయించి, సోదాహరణంగా నిరూపించడానికి మేఘాలయా మూవీస్ అనే చిత్ర సంస్థ "ఇల్లు—వాకిలి" అనే చిత్రాన్ని నిర్మిస్తోంది.

డి లక్ష్మీకాంతరావు, ఎమ్ సత్యనారాయణ రెడ్డి నిర్మిస్తున్న పై చిత్రానికి పి డి ప్రసాద్ దర్శకుడిగానూ, ఎన్ ఆర్ నంది సంభాషణల కర్తగానూ, సుఖదేవ్ కెమెరామెన్‌గానూ, బి శంకర్

సినిమా

సంగీత దర్శకుడిగానూ వ్యవహరిస్తున్నారు.

ఎస్ వి రంగారావు క్రొత్తతరహా పాత్రను పోషిస్తున్న ఈ చిత్రంలో కాంతారావు, చంద్రమోహన్, గిరిబాబు, రావికొండలరావు, రాజసులోచన ముఖ్య పాత్రధారులు.

అంజలి పిక్చర్ కంబైన్స్!

"భక్త తుకారామ్" తరువాత అంజలీ పిక్చర్



"రాధమ్మ పెళ్లి"లో దృశ్యం

కంబైన్స్ రెండు చిత్రాలను వరుసగా ప్రారంభించబోతుంది. ఒకటి పౌరాణికం మరొకటి మరాఠీ నవల "రథ చక్ర" ఆధారంగా తీయనున్న సాంఘికం. రెండూ ఈస్ట్‌మన్ కలర్‌లో నిర్మిత మవుతాయి. రెండింటిలో అంజలీదేవి ముఖ్య నటి. రెండింటికీ ఆదినారాయణరావు సంగీత సారథి.

"పండంటి సంసారం"లో భారతి



మహాకవి క్షేత్రయ్య

ఈ చిత్రంలో ప్రధాన పాత్రను పోషించగల ప్రతిభ ఒక్క నటుడికి మాత్రమే వుంది. అతడు ఎవరో? "విప్రనారాయణ, తెనాలి రామకృష్ణ, కాళిదాసు, తుకారామ్" చిత్రాలను చూచి మెచ్చిన వాళ్లకు తెలుసు. సంగీత రస ప్రధానమైన యీ చిత్రానికి ఆదినారాయణరావులాంటి మేధాసంపన్నుడు మాత్రమే న్యాయం చెయ్యగలడు. 'ఆ' హీరోగా, "ఆ" సంగీత సారథిగా యీ చిత్రం ఎప్పుడు ఆరంభ మవుతుందో!

దేవుడి చిన్న చూపు

చిరంజీవి చంద్రమోహన్‌కు దేవుడు అన్నీ యిచ్చాడు. ఇంకాస్త ఎత్తును ప్రసాదించి యుంటేయీనాడు వున్న హీరోలకు దీటుగా నిలబడి, యుండేవాడు.

డాక్టర్ బి ఎన్ రెడ్డి ద్వారా"రంగుల రాట్నం" చిత్రంలో హీరోగా పరిచయం అయిన చంద్రమోహన్ యిప్పటికి షుమారు వంద చిత్రాలలో వేషాలు వేశాడేగాని చెప్పుకోదగినట్టిది, మరువలేనట్టిది, ఒక్కటయినా లేదు.

ఆయన్ను యీమధ్య ప్రసన్న లక్ష్మి పిక్చర్స్ వారి "కొత్తకాపురం" సెట్స్లో కలసి ఎన్ని చిత్రాలలో నటిస్తున్న విషయాన్ని వివరించమని అడిగాను.

చంద్రమోహన్ కనిపించేచిత్రాలు!

లక్ష్మి చిత్రవారి "సత్యానికి సంకెళ్ళు", రవి ఆర్ట్ థియేటర్స్,దేవీఆర్ట్స్‌వారి"ధనవంతులు—గుణవంతులు", మధు పిక్చర్స్ "ఇంటి కోడలు", వినస్—మహీజా వారి "యశోదా కృష్ణ" సుభాషిణీ ఆర్ట్ పిక్చర్స్, గోపాల కృష్ణ ప్రొడక్షన్స్, రాజలక్ష్మి కంబైన్స్, వనజా మూవీస్, టి వి ఎస్ ఇంటర్నేషనల్.

ప్రాముఖ్యత వున్న పాత్రలు!

నందినీ ఫిలింస్‌వారి "అన్నదమ్ముల కథ", రవి కళామందిర్ వారి కొత్త చిత్రం, మహా విశ్వేశ్వరా ప్రొడక్షన్స్, విజయకృష్ణామూవీస్‌వారి "దేవదాసు".

వెరైటీ వేషాలలో కృష్ణ

"అల్లూరి సీతారామరాజు"గా ఆద్యంతం అసమానంగా నటించిన కృష్ణ యికపై ఏ వేషాన్నయినా వేసి మెప్పించగలడు అన్న నమ్మకం ప్రేక్షక సమూహానికి ఏర్పడింది.

ఇప్పు డాయన పాత్రల ఎన్నికలో కడు జాగ్రత్త వహిస్తున్నారు. ఈ ఏడు విడుదలయ్యే చిత్రాలలో వెరైటీ కృష్ణ కనిపిస్తాడు.

"రాధమ్మ పెళ్లి"లో పెద్ద వేషం గాకపోయినా, పెద్దగానే చేశాడు. లోకేశ్వరీ ఆర్ట్ పిక్చర్స్ వారి చిత్రంలో, లక్ష్మి చిత్రలో, కొత్త కాపురంలో, రంజిత్ మూవీస్‌లో, సీతారామాంజనేయ మూవీస్‌లో, ధనవంతులు — గుణవంతులులో, డూండీశ్వరరావు చిత్రంలో కృష్ణ వైవిధ్య మున్న వేషాలను వేస్తున్నాడు. ఒక చిత్రంలోని పాత్రకు, మరొక దానికి ఏ మాత్రం సంబంధం లేని విధంగా

"నేను ఆ ఐదు రోజులు ఎవరి ముందుకూ వెళ్లేదాన్ని కాదు.



ఇప్పుడు నాకు 'కేర్ ఫ్రీ' సానిటరీ నేప్‌కిన్‌లను గురించి అదృష్టవశాత్తు తెలిసింది మరియు నెలలో 30 పూర్తి రోజులు హాయిగా వున్నాను!"

వండర్‌రాప్‌గల క్రొత్త కేర్ ఫ్రీ స్త్రీయొక్క దేహమునకు పూర్తి సౌఖ్యమును, పూర్తి రక్షణను యిస్తుంది

నెలలో ఆ ఐదు రోజులు స్త్రీయొక్క దేహమునకు ఒక ప్రత్యేకమైన రకపు రక్షణ తప్పకుండా కావాలి ఆ బాధ్యతను తీసుకొనుటకు యిప్పుడు కేర్ ఫ్రీ ఉంది .
కేర్ ఫ్రీ యొక్క పై పొరయగు సాటిలేని వండర్‌రాప్ చెమ్మను లోపలి పొరలలోనికి త్వరగా పీల్చుకొంటుంది కనుక మీ చర్మము పొడిగా ఉంటుంది మరియు మీరు సౌఖ్యముగా ఉంటారు.




కేర్ ఫ్రీ మాత్రమే నేప్‌కిన్ లోపలి పొరలలోనికి చెమ్మను ఏకరీతిగా చేరేలా చేసే ప్రత్యేకమైన పీల్చే గుణముగల పదార్థముతో తయారుచేయబడినది. అందువలన ఒకేచోటు తడిసి పాడవదు

నేప్‌కిన్ అడుగు భాగమంతా మరియు రెండు వైపులా చుట్టివున్న నీలి అంచు కారణముగా మరక పడుతుందను బాధ ఉండదు

కేర్ ఫ్రీ వాడుకలో ఎంతో వీలైనది ఎందుకంటె, దానిని ఉపయోగించిన తరువాత సులభముగా ఫ్లష్ చేయవచ్చును. కనుక మీరు బయట తిరుగునపుడు లేక ప్రయాణములో చికాకు పడరు

కేర్ ఫ్రీ మీ దేహమునకు సౌఖ్యముగా సరిపోయేలా మార్చుకొగలిగే సైజులో లభిస్తోంది ప్రతి ప్యాకులోను ఉచితముగా యివ్వబడే కేర్ ఫ్రీ బెల్టు పెట్టబడింది

అమ్మయ్య! మీరు నెలలో 30 పూర్తి రోజులు హాయిగా ఉండగలరు!



ఇప్పుడు దేనిలో యిమిడే క్రొత్త పోలి బ్యాగ్‌లో

జాన్సన్ & జాన్సన్•
స్త్రీలకు హాయియైన రక్షణకు



''అమ్మ మనసు''లో జయంతి, శుభ

సినిమా

కృష్ణ నటిస్తున్నాడు 1974 లో కృష్ణ వుత్తమ నటుడిగా వచ్చే అవకాశం కనిపిస్తూ వుంది

కురుక్షేత్రం

గ్లామర్ నిర్మాత జి హనుమంతరావు సినిమా స్కోపులో కౌరవ, పాండవ యుద్ధాన్ని నిర్మించడానికి సంకల్పించిన విషయాన్ని పాఠక లోకానికి ఎప్పుడో తెలిపాను ఈ చిత్రంలో కృష్ణార్జునులుగా మా అభిమాన హీరోలు నటించగలరని నేను వ్రాశాను కానీ అలాంటి మంచి పని జరిగే అవకాశాలు తక్కువగా కనిపిస్తున్నాయి అయినా షూటింగు వచ్చే సంవత్సరం కదా అప్పటికి పరిస్థితులు మారొచ్చు ఎవరు వేసినా వెయ్యకపోయినా, ''కురుక్షేత్రం'' నిర్మాణం మాత్రం ఆగదు కృష్ణ అసాధ్యుడు అనుకున్న పని అయ్యే వరకు నిద్రపోడు

మట్టి మనుషులు

ప్రేమాలయా మూవీస్ నిర్మిస్తున్న యీ చిత్రం తుది మెరుగులు దిద్దుకుంటుంది ఈ చిత్రం మరొక మంచి దర్శకుడ్ని చూపెడుతుంది అతడి పేరు శ్రీనివాసులురెడ్డి కెమెరా దేవరాజ్ సమర్పించే ఈ చిత్రంలో వై విజయకు పెద్ద వేషం యివ్వబడింది వేషంలో న్యాయం జరిగినట్టు దర్శకుడు చెప్పాడు ఒకనాటి రాజశ్రీ యిందులో ముఖ్య పాత్రను పోషించింది నాగభూషణంది కొత్తరకం పాత్ర మహానటుడు ఎస్వీరంగారావు మహోన్నతమైన భూమికను ధరించాడు ఈ చిత్రం తరువాత 'గీత' ప్రసాద్ రాత మారుతుంది

ఎస్ వి ఎస్ ఆర్ పిక్చర్స్ !

మదరాసు తేనాం పేటలో వెలసిన కొత్త సంస్థ దీనికి భూమా బాలిరెడ్డి, వి వెంకటేశ్వరరావు అధినేతలు వీరికి కిరణ్ వ్రాసిన కథ నచ్చింది ఆయనే మాటలనుకూడా వ్రాశారు

ఉత్తమురాలు

చిత్రం పేరు యిది టైటిల్ పాత్రను జయంతి పోషిస్తున్నది ఒక గాయకురాలి జీవిత కథ యిది ముఖ్య భూమికలను జగ్గయ్య, విజయ లలిత, గుమ్మడి, పద్మనాభం, రాజబాల, జాన్సి, సుంకర లక్ష్మి ధరిస్తున్నారు టి కృష్ణ అనే నూతన నటుడు యీ చిత్రం ద్వారా పరిచయమవుతున్నాడు

''ఉత్తమురాలు'' చిత్రానికి రాఘవులు సంగీతాన్ని, దేవరాజ్ ఛాయను, మోహన్ కూర్పును, కేశవరావు కళను, రమణమూర్తి నిర్మాణ నిర్వహణ బాధ్యతను చేపట్టారు

జులై 29 న ఆచార్య ఆత్రేయ, దాశరథి వ్రాసిన పాటలను, గానకోకిల సుశీల జెమినీలో పాడింది ఆగస్టునుండి షూటింగు ఆరంభం ఇంతకీ దర్శకుడు ఎవరో వ్రాయాలిగా

''మట్టి మనుషులు'' చిత్రం ఒక ప్రతిభావంతుడ్ని చూపెడుతుంది అని వ్రాశానే, ఆ శ్రీనివాసులురెడ్డే ''ఉత్తమురాలు'' చిత్రానికి నిర్దేశకుడు ఇతడు నెల్లూరీయుడు దర్శకుడు ఎం మల్లికార్జునరావు వద్ద ఆరేండ్లు పాఠాలు అభ్యసించాడు

శారదా రంగనాథ్

నవత చిత్ర కృష్ణంరాజు 'శీష్‌మహల్' ఆధారంగా నిర్మిస్తున్న చిత్రంలో శారదకు జతగాడుగా 'చందన' రంగనాథ్ నటిస్తున్నాడు ఇతడు నిజంగా అదృష్టవంతుడు మొదటి సినిమా దారుణంగా దెబ్బతినినా, తనకు మాత్రం రావలసిన ఏర్పరచింది కాబట్టి నిర్మాత గిరిబాబుకు ఎంతయిన ఋణపడియున్నాడు ఈ చిత్రంలో ఎస్వీరంగారావు ముఖ్య నటుడు మాటలను డి వి నరసరాజు వ్రాశారు సహాయ పాత్రలను కృష్ణకుమారి, నిర్మల, అల్లు రామలింగయ్య, రావుగోపాలరావు, గిరిబాబు పోషిస్తున్నారు ఈ చిత్రానికి శింగీతం శ్రీనివాసరావు దర్శకుడు జి కె వెంకటేష్ సంగీతాన్ని, కళాధర్ కళను చేపట్టారు

ఈయన నిర్మించి, దర్శకత్వం నెరపిన స్వర్గీయ రాజాజీ విరచితమైన ''దిక్కట్ట పార్వతి'' తమిళ చిత్రం కొలంబో చిత్ర ఉత్సవానికి ఎన్నికైంది తమిళదేశ ముఖ్య నగరంలో ఈ సినిమాకు ప్రేక్షక ఆదరణ లభించింది

ముఖ్య పాత్రలో నాగేష్

సీతారామాంజనేయ మూవీస్ ''ప్రతీకారం'' నవలాధారంగా నిర్మిస్తున్న చిత్రంలో కృష్ణ, జగ్గయ్య, షావుకారు జానకి, భారతి, అనిత, గిరిబాబులతో బాటు ప్రసిద్ధ తమిళ హాస్య నటుడు నాగేష్ ముఖ్య పాత్రను పోషిస్తున్నాడు ఈ చిత్రానికి పి సాంబశివరావు దర్శకుడు అమరా రామసుబ్బారావు నిర్మాత సహనిర్మాతలు బాబురావు, కొలిసెట్టి శివప్రసాదరావు

''కొత్తకాపురం''లో
సూర్యకాంతం, అల్లు రామలింగయ్య



ధర్మపథం — దైవాధీనం జగత్సర్వం — బులుసు వెంకటరమణయ్య

లోకంలో జనులు అందరూ ఒకే మాదిరిగా ఉన్నారా? లేరు. కొందరు ఉత్తములుగా ఉంటారు. కొందరు అధమంగా ఉంటారు. కొందరు మంచి పనులు చేస్తూ ఉంటారు. కొందరు చెడ్డ పనులకే అలవాటు పడి ఉంటారు. కొందరి గృహాలలో ఎక్కువగా శుభ కార్యాలు జరుగుతూ ఉంటాయి. కొందరి గృహాల్లో అశుభాలే కావస్తాయి.

ఆ విధంగానే అనుకోకుండానే కొందరిని కలుసుకోవడం జరుగుతుంది. అనుకోకుండానే కొందరితో ఎడబాటులూ కలుగుతాయి

ఇలా జరుగుతూ ఉండడానికీ, వ్యక్తులు విభిన్న రీతుల్లో ఉండడానికీ, వేర్వేరు పరిస్థితులకూ కారణం మానవుల చేతుల్లో లేదు.

సమస్తమూ దైవాధీనమే!

అవతార మూర్తులకు కూడా శ్రమపడడం, కష్టాలు అనుభవించడం తప్పలేదు.

దీనికి భగవదవతార పురుషుడు శ్రీరాముడే మనకు ప్రబలమైన సాక్షి.



దైవ నిర్ణయాన్ని ఎదిరించడానికి వ్యక్తి ఎంత ప్రయత్నించినా ప్రయోజనం లేదు. అతని బలం ఏ మాత్రమూ పని చెయ్యలేదు. రావణుడు, కంసుడు మున్నగువారిని దీనికి దృష్టాంతంగా గ్రహించవచ్చును.

"దైవాధీనం జగత్సర్వం
జన్మ కర్మ శుభాశుభమ్,
సంయోగాశ్చ వియోగాశ్చ
న చ దైవాత్పరం బలమ్."

అనే శ్లోకంలో ఈ విషయమే చెప్పబడింది.

ఈ జగత్తు యావత్తూ దైవానికి లొంగి ఉన్నది. పుట్టుక కాని, శుభకర్మ కాని, అశుభ కార్యం కాని నియతిపైనే ఆధారపడి ఉంటుంది. ఆ విధంగానే ఒకరిని కలుసుకోవడం, ఒకరితో ఎడబాటు కలగడం దైవాధీనమే! దైవ బలాన్ని మించిన బలం మరొకటి లేనే లేదు — అని దీని అభిప్రాయం.

అయితే — దైవాన్నే నమ్ముకుని మన ప్రయత్నం మానుకుని కూర్చోవలెనా? — అంటే — అలా కూర్చోకూడదు. ప్రయత్నానికి దైవం సాయపడవచ్చు.

ఇంతకూ అది వేరే విషయం.

గుణవంతుడిగా కృష్ణ

ధనవంతుడు తానెన్ని దగా పనులు చేస్తున్నా ధనంతో వాటిని కప్పిపుచ్చుతాడు. కాని అది ఎంతో కాలం సాగదు. ఒకనాటికి అతని అసలు స్వరూపం బయటపడక మానదు. కానీ గుణవంతుడికి అలాంటి దాపరికాలు, దొంగవేషాలు వెయ్యవలసిన అవసరం వుండదు. తాత్కాలికంగా కొన్ని బాధలు పడ్డా, కొంతకాలానికి తలమానికంగా నిలబడతాడు.

ఆనంద్ పేద రైతు కుటుంబంలో పుట్టాడు. ఎన్నో తంటాలుపడి చదువుకున్నాడు. చిన్నతనం నుంచి యింటి కష్టాల్ని దృష్టిలో పెట్టుకుని జీవితాన్ని గడపడం అలవాటు చేసుకున్నాడు. ధనం విషయంలో పేదవాడే అయినా, అభిమాన ధనంలో పెద్దవాడుగా వ్యవహరించేవాడు.

ఆనంద్ గుణగణాలను బాల్యం నుంచి కళ్లారా చూస్తున్న పద్మ అనే ధనవంతులమ్మాయి ఆనంద్‌ను గాఢంగా ప్రేమించింది. ఆనంద్ పవిత్ర ప్రేమను కాదనలేకపోయాడు. కానీ ధనం వారిరువురి మధ్య అడ్డుగోడగా నిల్చింది. ఇల్లరికాన్ని సమ్మతించలేక, శ్రమించి, చెమటోడ్చి, తన సుగుణాలు అనే పనిముట్లతో ధనవంతుడు కావడమే కాకుండా, పద్మ తండ్రి కెదురుగా నిలబడి పంచాయితీ బోర్డు ప్రెసిడెంటు కాగలిగాడు. ప్రేమించిన కన్నెను పరిణయమాడాడు ఆనంద్.

ఈ ఆనంద్ పాత్రను హీరో కృష్ణ దేవీ ఆర్ట్స్ వారి "ధనవంతులు — గుణవంతులు" చిత్రంలో అద్వితీయంగా పోషించాడట. ధనవంతులమ్మాయిగా విజయనిర్మల కృష్ణకు జతగా నటించిన ఈ చిత్రంలో దేవిక, గుమ్మడి, సత్యనారాయణ, రాజబాబు, రమాప్రభ, అల్లు రామలింగయ్య, రాజసులోచన, మిక్కిలినేని, చంద్రమోహన్, నీరజ, నిర్మల, వై. వి. రాజు, జి. ఎస్. స్వామి ప్రధాన పాత్రధారులు. వజ్జె నాగేశ్వరరావు నిర్వహణలో వజ్జె పూర్ణచంద్రరావు నిర్మిస్తున్న ఈ చిత్రానికి కె. వరప్రసాదరావు దర్శకుడు.

— శ్రీనివాస్

అన్నపూర్ణ

(22వ పేజీ తరువాయి)

ఎడమ చేతిని, కుడి చేతి వేళ్ళను చూసి నివ్వెరపోయాడు పురుషోత్తమరావు.

"అబ్బా! ఎంత ఎర్రగా అయ్యింది చేయి. మండుతోందా అత్తయ్యా!" అంటూ పరికిణి యిస్తోన్న అన్నపూర్ణ చేతివంక చూస్తూ జాలిగా అడిగింది భాను.

"పాలు వేడిగా వున్నాయ్ కదూ! నువ్వు జాగ్రత్తగా తిన్నావా? నాలిక కాల్చుకోలేదుగా!" అంటున్న అన్నపూర్ణ అతి నిర్భయంగా లోపలికి వచ్చిన పురుషోత్తాన్ని చూస్తూనే తడబడిపోతూ లేచి నిలబడింది.

"మిమ్మల్ని చాలా ఇబ్బంది పెట్టాను. క్షమించండి!" అంటున్న అతడి మాటలకు — "అబ్బే... లేదు. మీరే నన్ను క్షమించాలి. యిందాకా నా మాటలు... భాను ప్రొద్దున అన్నం సరిగా తినలేదు. త్వరగా రాలేదని," అంటూ పురుషోత్తం వైపు చూసింది. తన తడబాటుకు అతని పెదవులు నవ్వుతున్నట్టు అన్పించడంతో, చెప్పడం ఆపేసింది అన్నపూర్ణ.

"మరి వెళ్దామా మాస్టారూ!" అంది భాను.

"నమస్తే" అంది అన్నపూర్ణ, ఆ రోజు గుళ్ళో అతను ముందుగా తనకు నమస్కరించడం గుర్తుకు తెచ్చుకుంటూ? అతను రాగానే తను నమస్కరించలేదన్న విషయం స్ఫురించడంతో. ఈసారి పురుషోత్తం చిన్నగా నవ్వేసాడు. అతని కళ్ళలో కదిలిన చిలిపితనానికి తోడు, ఆ నవ్వు చూసేసరికి, ఎందుకు నవ్వాడో అర్థం కాక, ఆలోచిస్తున్న అన్నపూర్ణకు జవాబు దొరికేసరికి, తన తడబాటుకు, తొందరపాటుకు తానే సిగ్గుపడిపోతూ నవ్వుకోబోయి. నవ్వేసింది. అంతలోనే ఎదురుగా చూసింది, పురుషోత్తమరావు, రెప్ప వాల్చకుండా తననే చూడ్డం చూసిన అన్నపూర్ణ మొహం ఎర్రబారిపోయింది. కళ్ళు తిప్పుకొని తల వాల్చేసుకుంది. వాళ్ళిద్దరు వెళ్ళిపోయాక ఏదో ఆలోచిస్తూ కూర్చుండిపోయింది అన్నపూర్ణ.

మరోసారి శనివారంనాడు సత్య తలనెప్పిగా వుందంటూ గుడికి రాలేదు. సత్యకు జతగా రుక్మిణి యింట్లో వుండిపోయింది. భాను, రాధ వెంట రాగా గుడికి వెళ్ళింది అన్నపూర్ణ. దైవదర్శనం అయిపోయాకా, గుడి మెట్లమీద కూర్చున్న అన్నపూర్ణ, కొబ్బరి ముక్కలను తుంచి, ఎదురుగా నిలబడ్డ, భానుకు, రాధకు ఇవ్వబోతూ, భాను వెనకే నిలబడి చేయిచాచిన పురుషోత్తమరావును చూస్తూనే ఉలిక్కిపడుతూ చేతిలోని కొబ్బరి ముక్కనంతా అతని కిచ్చేసింది.

"మరి మీకో ... మీకు మిగుల్చుకోకుండా అంతా యిచ్చేస్తున్నారు." అంటున్న మాస్టారు పెదవులమీద నవ్వు చూస్తూనే, తల వాల్చేసుకుంది. అతను తిరిగి యివ్వడానికి చేయి చాచాడు. అన్నపూర్ణ చేయి చాచలేదు.

"పద భానూ! రా రాధా!" అంటూ గబగబా అడుగులువేస్తూ వెళ్ళిపోయింది. నిశ్చేష్టగా

"హారతి"లో ఒక దృశ్యం



ప్రశ్నావళి * కె. రామలక్ష్మి

పి. ఎల్. ఎస్. ఆర్. రాజమండ్రి

కొందరు మిమ్మల్ని దారుణంగా, అసభ్యంగా మాట్లాడతారు కదా? మీకు బాధగా వుండదా?

★ చూడండి రావుగారూ, నేను నాల్గు సంవత్సరాల పాటు 'మదర్స్' సహచర్యంలో పెరిగాను... అప్పుడు చాలా నేర్చుకున్నాను: మనలోని దయా గుణం, ఎదుటివాడి నిర్దయని కొంచెం తగ్గించి చూపుతుంది... అంచేత బాధగా వుండదు.

కొంద రసలు తప్పులే చేయనట్టు మాట్లాడుతారు. నమ్మవచ్చు నంటారా?

★ కొంద రసలు తప్పులు చెయ్యరు ఎందుకో తెలుసా? అసలు, చేయదగిన పని ఏదైనా చేయ ప్రయత్నిస్తేగద!?

కె. పి.హెచ్. ఆర్. ఖర్గపూరు

రచయిత్రులు తమ రచనల్లో నేటి సమస్యలను ప్రతిబింబించడమే కాక, వాటి పరిష్కార మార్గాలను ప్రజల ముందుంచినపుడే రచనలు సార్థక మవుతాయని నా అభిప్రాయం.

★ కాని అప్పు అవదేమోనని — వాళ్ల భయం!

వై. కె. వెంగారెడ్డి

నేటి రోజుల్లో ధర్మబద్ధంగాను నీతికి కట్టుబడితే మనిషి మనుగడ సాగేటట్టుగా లేదు. మరి మార్గం?

★ ప్రతి ప్రాణికీ ఓ అదృష్టాని వుంటుంది! అది తెలుసుకో కల్గిన వాడే — హాయిగా బ్రతుకుతాడు.

ఎల్. వి. రావికమతం

ఒక ప్రేమికుని మాటల్లో, ఒక పిచ్చివాని మాటల్లో ఎలాంటి వ్యత్యాసం వుంటుంది?

★ ఏం తేడా వుండదు—ఇద్దరూ తమకు తెలిసి మాట్లాడే స్థితిలో వుండరు కనుక.

ఒక అభిమానురాలు. వి. ఎస్. ఎస్., ఆతేపురం.

నాకు అందరూ వున్నారు. కాని ఆత్మ యివ్వడానికి అంగీకరించిన ఆడది కరువైంది. నా కన్నీరు కడుపు నిండి పోయింది. ఈ బ్రతుకు యింతేనా?

★ బాగుంది! ఇన్నాళ్ళ యిలాంటి దుఃఖాతి దుఃఖ భాజనులై కన్నీటితో సర్వాన్ని ముంచెత్తే ఉత్తరాలు ఆడవాళ్ళే ఎక్కువగా రాసేవారు... మారారా? రోజులు మారాయి! బాబూ, అభిమానీ, దుఃఖంతో కడుపు నిండిం దంటున్నావుగా, బ్రతుకు భారంగా నెట్టుతూ రా, నీకూ మంచి రోజులు రాకపోవు!

ఎమ్. ఎ. వి. విశాఖపట్నం

స్త్రీ పురుషులలో విశ్వాసఘాతకులు ఎవరు?

★ ఒకరికొకరు!

క్రికెట్టు జట్టును రాజకీయ పార్టీలకు పోల్చిచూస్తే?

★ ఇంకా అదంత అధ్వాన్న స్థితికి దిగజారినట్టు లేదు. లేకుంటే మొన్నీ మధ్య ఒక సందర్భంలో చెడినట్టు "మా కులానికి ప్రాతినిధ్యం లేదు" అని ఆపేసేవారే!!

ఎ. వి. కొవ్వాక.

సతీసావిత్రి మీలాగే ఉండేదా?

★ నాకంటే రెండాకు లెక్కువ చదివినట్టుందామె — నేను మనుషులనే గెలవలేకుండా వున్నాను. మాటలతో— ఆమె యముణ్ని గెలుచుకొచ్చింది కదా!

డి. జె. ఎస్. హైదరాబాదు

ప్రయత్నే ఫలే అంటారే — ఒక్క ప్రయత్నం చాలా?

★ చాలదు. పూర్తి ప్రయత్నం చేయకుండా ఏ పని సాధ్యంకాదు.

ఎస్. ఎస్. ఎస్. విజయవాడ

మీరొక ప్రశ్నకు సమాధానం యిస్తూ (ఆడవాళ్ల అడుగుతున్నది తమని వ్యక్తులుగా గుర్తించమని) అన్నారు. నిజమే. నేను మీతో ఏకీభవిస్తున్నాను. మగవారు చాలామంది ఆడవారిని వ్యక్తులుగా చూడక దేవతలుగా నెత్తికి ఎక్కించుకుంటున్నారు. అదే వారు చేస్తున్న పెద్ద పొరపాటు అంటాను. మీరూ నాతో ఏకీభవిస్తారనుకుంటూ...

★ చిత్తం—ఏకీభవించక ఛస్తానా? దేవత అని తలకెక్కించుకుని "నైవేద్యం" పడేస్తే చాలు "కోరికలు" తీరుస్తుందని — ఓ బొమ్మలా ఎందుకండీ ఆడదాన్ని చూడ్డం? మనిషిగా చూడండి. చాలు.

అన్నపూర్ణ

నిలబడి పోయాడు మాస్టారు. అన్నపూర్ణ అలా వెళ్లిపోవడం మాస్టారుకు బాధ కలిగింది. "తానేం తప్పుగా అన్లేదే ... అంత తొందరగా అన్నపూర్ణ ఎందుకు వెళ్లిపోయింది" అన్న ఆలోచనతోపాటు, మరో భావం చోటు చేసుకోవడంతో అతని మనసు మూగబోయింది. దీనంగా ఓసారి గుళ్లో దేవుడి వంక చూసి తలవాల్చుకొని మెల్లిగా అడుగులు వేస్తూ, బయటికి వచ్చేసాడు.

"అత్తయ్యా! మాస్టారంటె నీకు కోపం కదూ!" అంది భాను రెండురోజుల తరువాత.

"ఛ ..నాకెందుకు కోపం!" అంది అన్నపూర్ణ విస్తుపోతూ

"పాపం! మాస్టారు చాలా మంచివా రత్తయ్యా! నిన్న మాస్టారు ఏమన్నారో తెలుసా? నాకొక్కదానికే మాస్టారంటే కోపం లేదుట. దేవుడికికూడా మాస్టారంటే కోపమేనట."

"కాని... నాకేం కోపంలేదు భాను." అంది అన్నపూర్ణ. భాను అలా ఎందుకు చెబుతుందో అర్థంకాక.

"అయితే మొన్న ప్రసాదం ఎందుకు తీసుకోలేదు? మాస్టారెంతో బాధపడ్డారు! తన మూలంగా దేవుడి ప్రసాదం, నువ్వు తినలేకపోయావని" భాను మాటలకు అన్నపూర్ణ బాధపడిపోయింది. ఆరోజు తానలా వచ్చేసినందుకు తరువాత బాధపడింది అసలు ఎందుకలా వచ్చిందో అర్థంకాక, అలా వచ్చేసినందుకు అతను బాధపడతాడని అనుకుంది. కాని ... అతనంటే తనకు కోపం లేదు. అసలు కోపమెందుకు? ఆ మాటే భానుతో చెబితే భాను సంతృప్తి పడిపోయింది కాని అన్నపూర్ణ స్థిమితపడలేదు. అసలు తనకు మాస్టారంటే కోపమని అతనెందుకన్నాడో అర్థంకాక బాధపడిపోయింది.

7

ఆ వూరి కరణానికి, రావుకు చాలా స్నేహం. ఒకే కంచంలో తిని, ఒకే మంచంలో పడుకోక పోయినా, వాళ్లిద్దరిమధ్య ఏళ్లతరబడిగా స్నేహం పెరగడానికి కారణం, ఇద్దరి మనస్తత్వాలు, భావాలు, ముఖ్యంగా ఆలోచనలు ఒకేలా వుండడం, మొండి పట్టుదల, అర్థంకాని ఆవేశం ఇద్దరిలో సమపాళ్లలో వుండడం, అన్ని విషయాలలో ఒకరికొకరు సమం కావడం అని చెప్పొచ్చు. అప్పుడప్పుడు, పట్నం వెళ్లినా, కరణం తనతోపాటు రావును తీసికెళ్లిపోతాడు. ఏదైనా కొత్త వస్తువు యిద్దరి యిళ్లలో ఒకేసారి వస్తుంది.

ఆరోజు భోజనంచేసి, వరండాలో కూర్చొని కరణంతో బాతాఖానీలో పడిపోయిన రావు, పాలేరు పరిగెత్తుకుంటూ, రావడం చూసి, "ఏమిట్రా?" అన్నాడు విసుగ్గా.

"బాబుగారూ! మద్దేనం భోజనానికి ఇంటికి వస్తున్న పంతులుగారిని మన ఆవు కుమ్మేసిందండి" అంటూ గాబరాగా చెప్పాడు.

"మన ఆవే ... ఎంత ఘోరం జరిగింది. ఇంతకి ... ఆ పంతులు..."

"మన పాత యింట్లో వుంటున్న పంతులయ్యేనండి" అన్నాడు పాలేరు.

"అయ్యో..." అంటూ "ఒరేయ్ వెళ్లి డాక్టరు గారిని పిలుచుకురా!" అంటూ, గబగబా అడుగులేస్తూ, బయలుదేరాడు రావు. వెనకే కరణం వెళ్లాడు.

"ప్రాణానికేం భయంలేదు. చాలా కొద్దిలో ప్రమాదం తప్పిపోయింది" అన్నాడు డాక్టరు, వెళ్లిపోతూ. కుమ్మడంవల్ల భయంతో వెనక్కి పడిపోయిన పురుషోత్తమరావు పొట్ట గీసుకుపోయి, తల, బలంగా రాయికి తాకి రక్తం రావడంతో స్పృహతప్పి పడిపోయాడు.

"జాగ్రత్తగా చూసుకో" అంటూ పాలేరును కాపలా వుంచి, యింటిదగ్గర ఈ విషయం తెలిసి, పిల్లలు గాబరాపడిపోతారని, యింటికి వచ్చేసాడు రావు.

విషయం తెలిసిన అన్నపూర్ణ భయంతో నిలువునా వణికిపోయింది. మిగతా నలుగురి కళ్లలో నీళ్లు తిరిగాయి. భానుమాత్రం, రావును చుట్టేస్తూ బావురుమని ఏడ్చింది.

(ఇంకా వుంది)


"బాబు పొడుగ్గా, వెడల్పయిన బుజాలతో
గట్టి, తెల్లని పళ్ళతో పెరుగుతాడు.
"ఎందువల్లనంటే, నేను
కాల్షియం-శాండోజ్
తీసుకుంటున్నాను గనుక"
మీ పసిపాప పళ్ళూ, ఎముకలూ మీరు గర్భిణితో ఉన్నప్పుడే తయారవటం
మొదలెడతాయి. అప్పుడే పాపకు కాల్షియం అత్యవసరం దానిని మీరే యివ్వగలరు
తేలికైన కాల్షియం శాండోజ్ పద్ధతిలో
రోజుకు మూడుసార్లు 3 4 బిళ్ళల చొప్పున కమ్మని, రాస్ప్బెరీ రుచి కలిగి విటమిన్లు
మరియు డి.తో పుష్టివంతం చేయబడిన కాల్షియం శాండోజ్ బిళ్ళను చప్పరించండి
మీ పాప గట్టి పళ్ళూ, పటిష్టమైన ఎముకలూ కలిగినదిగా తయారు అవుతుంది. మీకు
కాల్షియం లోపంగాని, కాళ్ళు పట్టటంగాని, కండరాల నొప్పిగాని ఉండదు.
శాండోజ్‌ను విశ్వసించండి—వారు ప్రపంచంలో శుద్ధమైన కాల్షియం తయారీ
చేయడంలో ముందంజ వేసారు.
గర్భస్థ శిశువు యొక్క
కాల్షియం అవసరాలు
గర్భిణీ సమయంలో,
ముఖ్యంగా చివరి 3 నెలలలో
హెచ్చుగా పెరుగుతాయి.
అందువలన తల్లులు
అవసరమైనంత కాల్షియం
శాండోజ్‌ను మొదటి నెల
నుంచీ తీసుకోవటం
అవసరం.
28.6
16.64
10.44
4.88
1.6
0.048
1, 2, 3, 4, 5, 6, 7, 8, 9, నెలలు
SANDOZ
కాల్షియం-శాండోజ్®
ప్రతి రోజు ప్రతివారికి
SCP/CS/04Te

సీరియల్

...రెండు పువ్వులు

రాధారాఘవ

8

(గత సంచిక తరువాయి)

కేవలం తన సు వితనం చూసే, తన దగ్గరంత స్వేచ్ఛగా, కూతుర్ని విడిచి పెట్టలేదనీ, అదంతా సోషల్‌గా ఉండటంలో ఒక భాగమనీ, ఆ స్వేచ్ఛ తన ఒక్కడికే కాక, చాలామందికి కూడా ఉన్నది అనీ, మధు గ్రహించేసరికి చాలా ఆలశ్యమై పోయింది.

"తనయందు వాళ్లకెంత నమ్మకం! వయస్సులో ఉన్న కూతుర్ని తన వెంట పంపిన ఆ ముసలాయన మనస్సెంత విశాలం" అనుకొని ఒకనాడు మురిసిపోయిన ఆనోటితోటే,

"ఛ వాడూ ఒక తండ్రేనా? యౌవ్వనంలో ఉన్న కూతుర్ని ఉపయోగించుకుని, అవసరాలు తీర్చుకుంటున్నాడు. ఛీఛీ నీతి నిజాయితీ లేనివాళ్లు!" అని చీదరించుకున్నాడు.

ఇప్పుడా ముసలాయనంటే, మధుకి పరమ అసహ్యంగా ఉంది. అతన్నసహ్యించుకున్నంత ఎక్కువగా, ఇంతకు ముందు ప్రపంచంలో మరొకరి నెవర్నీ, అసహ్యించుకోలేదేమో కూడ

"సుషమ తనది కాదు, పరాయిది" అని తన మనస్సును ఎంత నమ్మించుకోవాలని చూస్తున్నా, మధుకి అది సాధ్యం కావడం లేదు

చేతికి చిక్కినట్టే చిక్కి, అందీ అందకుండానే, మురిపిస్తూ చెయ్యి జారిపోయిన ఆ అమూల్య వజ్రాన్ని, దక్కించుకోలేక పోయానే అన్న బాధ మధుకి నిద్రపట్ట నివ్వడంలేదు

ఆ అమ్మాయి చలాకీ కబుర్లు, చిలిపి తనం, మనస్సులో ముద్రించుకుపోయిన సుందర స్వరూపం – ఎంత మర్చిపోదామనుకున్నా మర్చిపోలేక పోతున్నాడు

ఆ యింట్లోకి వచ్చిఉన్న యీ రెండేళ్ల కాలంలోనూ, తన జీవితానికి అతి సమీపంగా వచ్చింది సుషమ తనలో ఎన్నో ఆశలు రేపింది మనస్సంతా తానే అయి, ఆక్రమించుక్కూర్చుంది

తన జీవితంతో చలగాటమాడినట్టే ఆడి, ఒక్కసారిగా అన్నీ విదిలించేసుకుని, మరో వ్యక్తిలో వెళ్లిపోతోంది

అది తను భరించలేడు అంత తేలిగ్గా, సుషమా అయితే వదిలేసుకోగల్గింది గాని, అది తనకు సాధ్యంకాదు" – కళ్ల ప్రక్కల నుంచి కన్నీరు కారిపోతూ దిండంతా తడిసి పోతోంది ఒళ్లంతా పొగలు చిమ్ముతోన్నట్టుగా ఉంది.

కొండమీది కోతి కావాలన్నా, తెచ్చిపెట్టి అల్లారు ముద్దుగా పెంచార్లు అతన్ని పొర పాటున ఎప్పుడైనా, ఎవరైనా ఏమైనా అన్నా, వాళ్ల తాతయ్య పేరవడంవల్ల వాళ్ల బామ్మ వెనకేసుకొచ్చి దెబ్బలాడేది కోరడం తరువాయి, కావాలన్నది కంటిముందు ప్రత్యక్ష మయేదేగాని, ఏనాడూ, దేనికోసం ఆవేదన చెందడం, పుట్టి బుద్దెరిగాక అతనెరగడు. అలాంటి ఉత్తములని ఎదిరించి, వాళ్ళ మాట కాదని ఉసురు పెట్టడంవల్లనే నేమో తనకీ శిక్ష? లేకపోతే ఎవరికి ఏం కీడు చేశాడని, తనకీ నరకం??" అనుకుని ఆవేదన చెందాడు

— ఒక్కసారిగా యీ సంఘటన, అధః పాతాళానికి గెంటేయడంతో అతను దీనిని తట్టుకోలేకపోతున్నాడు ఊపిరాడనట్టుగా. ఉక్కిరి బిక్కిరై పోతూ, ఆ మంచంమీద దొర్లుతూ నానా అవస్థ పడుతున్నాడు

"లాభంలేదు సుషమను మర్చిపోవాలి పూర్తిగా మర్చిపోవాలి జరిగిందేదో జరిగి పోయింది పరాయి సొత్తుకోసం ఆశించ కూడదు" అని ఎన్నోసార్లనుకున్నాడు. కాని, అనుకున్నంత తేలికా ఆచరించడం?

అవే తలపులు అదే రూపం – మనుష్లుల్ని వెర్రెత్తించే అందచందాలు ఎదుటి వారిని సమ్మోహపరిచే, చిరునవ్వు, ఆజన్మ బ్రహ్మచారినైనా మత్తెక్కించే వాలుచూపులు, ఒద్దనుకున్నా, కంటి ముందుకొచ్చి కవ్వించే కొంటెదనం – మరవలేడు. అది తనకి సాధ్యంకాదు.

ఎన్ని కలలు కన్నాడు!

సుషమతో జీవితం పంచుకోవాలని, ఎంత ఉవ్విళ్లూరాడు ఆ అమ్మాయిలోని ఎన్ని అందాలు, హృదయంలో పదిలపరుచుకున్నాడు!

సుషమ యింక తన స్వంతమనే అనుకున్నాడు తమిద్దర్నీ మరొకరెవరూ విడదీయలేరనే తలచాడు.

తల్లిదండ్రుల్ని ఎదిరించైనాసరే, అవసరమైతే వాళ్లతో తెగ తెంపులు చేసుకునైనా, తన దాన్ని చేసుకోవాలనుకున్నాడు

జరిగినకదు: మధు ఢిల్లీలో ఒక పెద్ద ఉద్యోగి దక్షిణాది వారన్నా వారి పిండివంటలన్నా ఇష్టమున్న సుషమ అతనితో చనువుగా ఉంటుంది. మధుకి ప్రక్కింటి మిసెస్. సింగ్ కుటుంబంతో పరిచయం వృద్ధి చెందుతుంది. తండ్రి దశరథ రామయ్య నుంచి ఉత్తరం రావటంతో ఇంటికి వెళుతున్న మధును కంజీవరం చీరె, ఆవకాయ తెమ్మంటుంది సుషమ. కృత్రిమ నాగరికతకు అలవాటుపడ్డ మధుకి స్వగ్రామంలోని ప్రశాంత వాతావరణం నచ్చదు ఎవరిని వివాహ మాడుదామా అని సుషమ – సీతలను బేరీజు వేసుకున్న మధు, సీతను వివాహం చేసుకోనని ఢిల్లీ తిరిగి వచ్చేస్తాడు. సుషమకీ, మిసెస్ సింగ్‌కీ వారు కోరిన వస్తువులు తెచ్చిచ్చి మన్నన లు పొందుతాడు మధు మిసెస్ సింగ్ ఆహ్వానాన్ని తిరస్కరిస్తాడు మధు సుషమని వివాహం చేసుకోవాలన్న మధుకి, ఆమె వివాహం ప్రియతమ్ సింగ్‌తో నిశ్చయమైందని తెలిసి బాధపడ్తాడు.

తను పొరపడ్డాడా ?

ఆ అమ్మాయి తీసుకున్న చనవుని మరోలా ఊహించి, ఆశలు కల్పించుకున్నాడా?

పవిత్రమైన ఫ్రెండ్‌షిప్‌ని ప్రేమతో ముడిపెట్టాడా?

ఇందులో తప్పెవరిది?

ఎంగేజ్‌మెంట్ జరిగాక కూడ, ఆ విషయం చెప్పక, తనలో ఆశలురేపిన సుషమదా?

లేక ఆ ఉంగరాన్నయినా గుర్తించని తనదా ?

వయస్సులోఉన్న యువతీ యువకులని, స్వేచ్ఛగా వదిలేసి, అవకాశం కల్పించిన సుషమ ఫాదర్‌దా ?

లేకపోతే వాళ్ల స్వేచ్ఛను, మరోలా అర్థం చేసుకుని, మమతలు పెంచుకున్న తనదా ?

—దీనికి తనెంత వరకూ బాధ్యుడు??

'రష్టే' ఆలోచించిచూస్తే,

తనే పొరబడ్డాడు

ఆ అమ్మాయి చనువుకి, రకరకాల అర్థాలు కల్పించుకున్నాడు

— అది ఆ అమ్మాయి సహజ తీరనీ, టకటకా మాట్లాడ్డం, ఆప్యాయంగా పలకరించడం, నిర్భయంగా తిరగడం, ఆ సోషల్ బిహేవియర్ చూసే, ముచ్చటపడి, ఆ అమ్మాయిచే ఆకర్షింపబడి, తన హృదయంలో స్థానం యిచ్చాననే విషయం పూర్తిగా మర్చిపోయాడు

ఆ అమ్మాయి అందానికి మతిపోయి, ఆ సౌందర్య మైకంలో, యింతకాలం, మరేం గుర్తించలేకపోయాడు

అవన్నీ తన ఒక్కడికే పరిమితం కాదనీ, సుషమ అందరితోటి అలాగే ఉంటుందనీ, ఆ విధమైన స్వేచ్ఛ తండ్రే యిచ్చాడనీ, తెలుసుకోలేకపోయాడు

ఆవేళ, బజారులో కనిపించిన ఆ యువకుడితోటే అంతే చనువుగా మాట్లాడిందనీ, ప్రక్కప్రక్కల నడుస్తోన్నా, కారులో తన ప్రక్కని కూర్చున్నా, శరీరాలు టచ్ అయినా, ఆమెలో ఏ మార్పూ లేదనీ, మైలురుముందు నిలబడి, కొలతలిస్తోన్నప్పుడు ఎంత నిర్వికారంగా ఉందో, తనదగ్గరున్నప్పుడూ అలాగే ఉండేదనీ, గ్రహించలేనంత మూర్ఖుడిలా తయారయాడు

స్నేహభావంతో దగ్గరగా వచ్చిన ఆ అమ్మాయిని, మరోలా ఊహించుకుని, తన హృదయ కాన్వాస్‌లో రంగులతో చిత్రించుకున్నాడు అందుకు ఆమెదెలా తప్పవుతుంది?

ఆఁ ఇప్పుడు జ్ఞాపకం వస్తోంది కంటి ముందున్న మైకపుపొర కరిగిపోయేసరికి, అన్నీ కనిపిస్తున్నాయి

తనకంత చేరువగా వచ్చినా, తనతో మాట్లాడుతోన్నప్పుడు గాని, తన ప్రక్కన కూర్చున్నప్పుడు గాని, సరదాగానూ, చిలిపిగానూ కబుర్లు చెప్పుకున్నప్పుడుగాని, సుషమలో ఎత్తిచూపించేటంత ప్రత్యేకతేమీ ఎప్పుడూ కనిపించలేదు

కాని, యింత కాలంలోనూ, ఏనాడూ చూడని ఆ అమ్మాయి ముఖంలో, సిగ్గు, సంకోచం, మాటిమాటికి ముఖం ఎర్రబడడం, ఆరాధనా పూర్వకంగా చూడడం, మాటల్లో తడబడడం మొదలైన ప్రత్యేక లక్షణాలన్నీ ఇవ్వేళ - ఆ యువకుడ్ని చూసిన తర్వాత, కనిపించాయి

ఖచ్చితంగా తనే పొరబడ్డాడు.

ముమ్మాటికీ తనదే తప్పు.

ఒకవేళ, సుషమతో వివాహం జరిగినా, ఆ రకం స్వేచ్ఛను తను యివ్వలేడు తన భార్య పరాయి పురుషుల స్కూటర్ల వెనుక కూర్చుని తిరగడం, స్విమ్మింగ్ డ్రెస్ వేసుకుని అవయవ ప్రదర్శన చేయడం, క్లబ్బుల్లో పరాయి మగాళ్ల చేతుల్లో నలిగిపోతూ డేన్సు చేయడం లాంటివి తను సహించలేడు.

ఇన్ని సుగుణాలూ చూసి, ఆ అమ్మాయిని ఒకనాడు మెచ్చి ఉండవచ్చు. మనస్సుకు



మొహంజొదారో మొండి గోడలమీదా—
మెహందీబజార్ మేడలమీదా
బాలయోగుల పర్ణశాలల్లో—బాల్‌రూమ్ డాన్స్ క్లబ్‌లో
అరేబియాదేశంలో "బురఖా"లలోపలా,
బ్యూటీ కంటెస్ట్‌లో "బికినీ"ల వెనకా,
బంగాళాఖాతం అడుగునా, వియత్నాం శవాల గుట్ట మధ్యా
విస్కీ గ్లాసులో, కన్నీళ్లలో
నీ కోసం నేను నిరంతరాన్వేషణ చేశాను
ముళ్లపొదల్లో—మల్లె తీగల్లో నీ కోసం గాలించాను
నువ్వు కనబడ్డంలేదని నిరాహారదీక్ష పట్టాను
ఎల్లోరా శిల్ప సుందరుల మధ్యా, సినిమాపోస్టర్ల మీదా
రష్యన్ వోడ్కాలో—చెదలు పట్టిన చరిత్ర పుస్తకాల్లో
మెటర్నిటీవార్డులో—స్మశానంలో
మైక్రోస్కోపు క్రిందా—టెలిస్కోపులోంచీ
కళ్లల్లో దివిటీలు పెట్టుకుని మళ్లీ మళ్లీ చూశాను

—గేయం—

అద్వైతం

—వై దివాకరరావు

షెహనాయ్ శబ్దంలో, సితార్ తీగెలమీదా
నేను గీసిన రంగుల బొమ్మల్లో—
వ్రాసుకునే అర్థంకాని కవితల్లో—
పద్యంలో, గద్యంలో
వచనంలో, వాచకంలో
అంతంలో, అనంతంలో
అన్నిట్లోనూ, అందర్లోనూ
వేయేల ? రెండు వేలేల ?
నిన్ను వెదకని చోటు ఈ విశ్వంలో లేదు
విసిగిపోయి, అలసిపోయి యింటికొచ్చిపడ్డాను
యెదురుగుండా, సరిగ్గా యెదురుగుండా
నిలువుటద్దంలో నువ్వున్నావు ! ! !
ఇన్ని చోట్లు గాలిస్తే ఇక్కడా నువ్వున్నావు ! ?
విశ్వమంతా వెదికి పారేశాననుకుంటే—
అద్దంలోనా ఉన్నావు ? !
నేను నిలబడితే నువ్వూ నిలబడుతున్నావు
నేను నవ్వితే నువ్వూ అంతే నవ్వుతున్నావు
సలసల కాగిపోయే ఒక వేడి కౌగిలి కోసం
చేతులు చాస్తే—
అద్దంలోంచి నువ్వూ నా వైపుకు ఒకేసారి
చేతులు చాపావు !
ఒక్క ఎర్రని ముద్దు కోసం నా తపన
నీలోనూ ప్రతిబింబిస్తుంది !
—ఇప్పుడు నా మనో నేత్రం దానికదే తెరచుకుంది
జ్ఞానదంతం కూడా రకీమని మొలుచుకొచ్చింది
మొదడంతా నువ్వే అయితే
నువ్వెక్కడాని ఆలోచిస్తున్నాను !
ఈ మూర్ఖత్వపు ముసుగులోంచి బైటికి వచ్చి చూస్తే
ఈ కళ్లమీద పొరలన్నీ ఒకటొకటే రాలిపోతే—
నాకు కనిపిస్తున్నది ఒకే ఒక్క నిజం
నాకు తోస్తున్నది ఒకేఒక్క ఫిలాసఫీ
"అద్వైతం"

చేరువయ్యీ ఉండవచ్చు కాని, తన భార్యగా మాత్రం, యిలాంటివి చేస్తే, తను చచ్చినా భరించలేడు

— నర నరాల్లోనూ జీర్ణించుకు పోయిన పురాతన సంస్కృతి అందు కంగీకరించదు తరతరాలుగా ప్రవహిస్తోన్న సాంప్రదాయ రక్తం ఎదురు తిరుగుతుంది

తనభార్య, కేవలం నూరు నయాపైసల పతివ్రతలానే ఉండనక్కర్లేదు అల్ట్రా మోడరన్ కాకుండా ఉంటేమటుకు చాలు

మిసెస్ సింగ్‌లా, భర్తలేని టైములో, నచ్చిన ప్రియుడ్ని యింటికి రప్పించి ఎంజాయ్ చేసే సోషల్ వైఫ్ మాత్రం తనకు ఒద్దు ఆ రకం లైఫూ ఒద్దు

ఎండమావుల వెంట, భ్రమసి, పరువులెత్తినట్టే అయింది తనపని ఎందుకొచ్చిన అవస్థ ? తల్లిదండ్రులు కుదిర్చిన పిల్లను చేసుకుంటే ఏ గొడవా ఉండదు మంచి చెడ్డల నిర్ణయం వాళ్లకే బాగా తెలుస్తుంది" అనుకుని, ఆవేళే యింటికి ఉత్తరం వ్రాశాడు

—సీతగానీ, మరే ఆడపిల్ల అవనీ, తనకి మరే అభ్యంతరం లేదనీ, తనువచ్చి చూడాల్సిన అవసరం కూడ ఏమీలేదనీ, అందరికీ నచ్చితే స్థిరపరిచేసి ముహూర్తం నిశ్చయించి తెలియపరుస్తే వస్తాననీ, ఇంతకాలం, అందరి మనస్సులూ నొప్పించిన అపరాధానికి క్షమించమనీ వ్రాసి పడేసి, పెద్దభారం వదిలించుకున్నట్టు ఫీలయ్యాడు.

రెండు పువ్వులు

మర్నాడు, కొంచెం పెందళాడే తయారై వెళ్లి, ఆఫీసుకి చుట్టుప్రక్కల ఉండే ఏరియాలోని ఇళ్లు కుదిర్చే బ్రోకర్ని మీటయాడు

అప్పటికప్పుడు, అతను చూపించిన వాటిల్లో ఐదు ఫ్లాట్లు చూసి, నచ్చినదానికి ఎడ్వాన్సిచ్చేసి, బ్రోకరు కివ్వాల్సిన డబ్బుకూడ చెల్లించి, అప్పుడు గాలి పీల్చుకున్నాడు ఫ్రీగా

ఆ సాయంత్రం ఆఫీసునుంచొచ్చాక, ఇల్లు ఖాళీ చేస్తోన్నట్టు, యింటి గలాయనకు తెలియపర్చాడు

"అదేం? ఏమయింది?—మావల్ల ఏమైనా పొరపాటు జరిగిందా? అంటూ" ఆందోళనగా అడిగాడాయన

"ఏంలేదు నిన్న యింటిదగ్గర్నుంచి ఉత్తరం వచ్చింది మీకు చెప్దామనుకునే, హడావుడిలో ఉన్నారుగదాని చెప్పలేకపోయా

నాకు వివాహం స్థిరపడింది పెళ్లయ్యాక, మా పేరెంట్సు కూడ వచ్చి, నాతోనే ఉంటామన్నారు మరో పెద్దయింటి కోసం ట్రై చేద్దామనుకునేంతలో, మాకు తెలిసిన వారొకరు ట్రాన్సఫరై యిల్లు ఖాళీచేసి వెళ్లిపోతున్నట్టు తెలిసింది అందుకని, వెంటనే వెళ్లి, ఆ యింటిని చూసి, నచ్చడంతో వెంటనే ఎడ్వాన్సిచ్చేశా మరి అప్పటికప్పుడు కావాలంటే, నచ్చినయిల్లు దొరకదుగా"

ఇంటిగలాయన ముఖం తెల్లగా పాలిపోయింది రంచన్‌గా ఎప్పటిడబ్బు అప్పుడు పేచీలు లేకుండా చెల్లించేసే వ్యక్తి మధు

"ఇంకా, అది చెయ్యలేదు, ఇది చెయ్యలేదు" అని గొడవ పెట్టకుండా, ఇల్లు, యిష్టారాజ్యంగా వాడుకుని, పాడుచెయ్యని మనిషి మధు

అందులోనూ, బిలబిల్లాడుతూ, ఇల్లంతా జనంలేని ఒంటరిగాడు మధు

మళ్లీ అలాంటివాళ్లు దొరకడం ఎంత కష్టం !!

వివర్ణమైపోయిన అతని ముఖంచూసి, మధు లోలోపలే కసిగా నవ్వుకున్నాడు

"సరే, మీ యిష్టం ఎలావీలయితే అలా చేయండి" అన్నాడాయన, ముఖం చిన్నబుచ్చుకుని

* * *

"ఏయ్, మిస్టర్! ఎక్కడ పార్టీ ఇవ్వాల్సొస్తుందోనని, చెప్పకుండా దాచారా సీక్రెట్ ? అమ్మ దొంగా! డాడీ చెప్పార్లెండి మీకూ పెళ్లి కుదిరిందటగా — హార్టీ కంగ్రాచ్యులేషన్స్ !"


వాష్ బేసిన్ దగ్గర ముఖం కడుక్కుంటోన్న మధు, వెనక్కు తిరిగి చూశాడు


బాత్రూం గుమ్మంలో, బొమ్మలా సుషమ నిలబడింది — ద్వారబంధానికి అటోచెయ్యి, యిటో చెయ్యి వేసి

"అసలు, నిన్ననే వచ్చి అభినందనలు తెలపాలనుకున్నా కాని ప్రియతమ్ రాత్రి

చూడండి
మామూలు పంపు నీటినుండి కల్మషములను ఫిల్టరుచేసి ప్యూరిటాన్ దానిని త్రాగుటకు ఎలా 100% సురక్షితము చేస్తుందో.

కలరా, టైఫాయిడ్, రక్తవిరేచనములు,
గాస్ట్రో-ఎంటెరైటిస్ మొదలైన నీటి ద్వారా సంక్రమించే
జబ్బులు రాకుండా ఇంతకంటె మరో మంచి హామీ లేదు.





ప్యూరిటాన్ తేలికై, పగులదు. ఒక చోట నుండి మరొక చోటికి తీసుకు పోవటానికి అనుకూలమై, శుభ్రపరచుటకు వీలైనది.



నేడే ఒక ప్యూరిటాన్ తీసుకోండి మీకు ఆప్తులైన వారి కోసం వాడదగినది

ఉచిత చిన్న పుస్తకానికి ఈ క్రింది అడ్రసుకు వ్రాయండి:

బల్సారా
—సౌఖ్యమైన జీవనానికి ఆధునాతన సాధనాలు
BALSARA బల్సారా అండ్ కంపెని (ప్రై) లి.
49, వగీన్‌దాస్ మాస్టర్ రోడ్, బొంబాయి-400 001.

CHAITRA-BLS-19 TEL


పిక్చర్‌కి టిక్కట్లు బుక్ చేయడంవల్ల, రావడానికి తీరలేదు తెల్లారగానే యిలా పరుగెత్తుకొచ్చా "

—గుక్క తిప్పుకోకుండా మాట్లాడుతోన్న, ఆ మాటల్లో ఎప్పటి చిలిపితనమే కనిపిస్తోంది

రెండు పువ్వులు

ముఖంలో కొంటెదనం దోబూచులాడుతోంది అల్లరిగా నవ్వుతున్న కళ్లు, మరింత అందంగా మెరుస్తున్నాయి

ప్రశాంతమైన నీటిలో, బెడ్డ విసిరితే అలలు రేగినట్టుగా, మళ్లీ ఆ లమ్మాయిని చూసేసరికీ, ఆ మాటలు వినేసరికీ మర్చిపోదామనుకున్న ఆవేదన మళ్లీ రగులుకోవడం మొదలు పెట్టింది, మధు హృదయంలో



"అరే! ఒక్కరోజు జ్వరానికే యింతిలా అయిపోయారేమిటీ ?—కాబోయే పెళ్లికొడుకు గారు కూడ! త్వరగా కోలుకోవాలి. లేకపోతే రేపు పెళ్లిలో మిమ్మల్ని చూసిన వెంటనే శ్రీమతిగారు 'మా వారింత ఉస్సూరుమని కనిపిస్తున్నారేమిటీ ? — భగ్నప్రేమికుడిలా' అనుకోగలదు" అంది హాస్యంగా.

హృదయాన్నెవరో మెలిపెడుతోన్నట్టని పించింది మధుకి. బాధగా ఒకసారి, ఆ అమ్మాయి కళ్లలోకి చూసి, టవలుతో ముఖం తుడుచుకుంటూ యివతల కొచ్చేడు.

సుషమ అతన్ననుసరించింది.

టవల్ స్టాండుమీద వేస్తూ "ఒక్క మాటడుగుతాను; సమాధానం చెప్తావా ? సుషమా !" అనడిగాడు.

"ష్యూర్. ఒక్కటేం కర్మ వందడిగినా చెప్పేస్తాను. అడగండేమిటో" అంటూ దగ్గరగా వచ్చింది.

జవాబు చెప్పడానికి సిద్ధం అన్నట్టుగా, రెండు చేతులూ కట్టుకు నిలబడి, "రెడీ నెంబర్ వన్ ?" అంది కొంచెం ముందుకు వంగి.

ఆ అమ్మాయి చిలిపిదనాన్ని గమనించని మధు, ఎలా అడగాలా అన్న ఆలోచనలో సతమతమవుతూ, ఆఖరికి నెమ్మదిగా అన్నాడు— "సుషమా! నామీద నీ అభిప్రాయం ఏమిటి ?"

సుషమ ఫక్కున నవ్వింది. "అదేం ప్రశ్న? తమాషాగా ఉందే !

ఏం ? కొంపదీసి భార్యామణిగార్కి చూపించడానికి, ఏదైనా సర్టిఫికేట్ కావాల్సొచ్చిందా ఏమిటి ? లేక...రేపు వెళ్లబోయే యింటి ఓనర్ కాండక్ట్ సర్టిఫికేట్ తెమ్మన్నాడా ?

ఇప్పుడే చెప్పేస్తున్నా. అదే నిజమైనట్టయితే మాత్రం, సర్టిఫికెట్టిచ్చినందుకు గాను, చాలా ఫీజు చెల్లించాల్సొస్తుంది సుమా ?"

సుషమ, చిలిపిగా అంటుంటే, మధు బాధగా గిలగిల్లాడాడు.

"అదికాదు నేనంటే, నీకెలాంటి అభిప్రాయం ?— అంటే ?...అదే...అదే నీ మనస్సులో నాస్థానం ఎటువంటిదీ అని"

మధు తొట్రుపాటుకి సుషమ గలగలా నవ్వింది.

ఆ నవ్వు చూస్తుంటే, వడివడిగా ప్రవహిస్తూ, కొండల మీంచి దుమికే సెలయేరు జ్ఞాపకం వచ్చింది మధుకి. —మనస్సుని, ఎంత చిక్కబెట్టుకోడాన్కి ప్రయత్నంచేసినా, అది, సుషమను చూడగానే, అదుపుతప్పి పరుగులెత్తుతూనే ఉంది.

"ఎలాంటి ధర్మ సందేహం బాబూ ! ఇన్నాళ్లు కలసి మెలసి తిరిగాం. ఇప్పుడొచ్చిందేమిటి—యిలాటి సందేహం ?

"నా దృష్టిలో చెప్పాలీ అంటే, మీరెంతో, ఎంతో మంచివారు; చాలా సంస్కారవంతులు; అంతకు మించి ఉన్నత హృదయులు. ఇంకా..."

మధు, రెండు చేతులలో తల పట్టుకుని, "చాలింక. ఆపేయ్" అంటూ బాధగా వారించాడు.

"అదేం? అడిగారు గదామరి. చెప్తుంటే ఒద్దంటారేం?" అంది సుషమ.

"అంతకుమించి, నేనంటే మరే అభిప్రాయం లేదా సుషమా ?" —ఆ అమ్మాయి కళ్లలో, దేనికోసమో వెతుక్కుంటూ ఆవేదనగా అడిగాడు.

కాని, మధు ఆశించింది, ఆ అమ్మాయి కళ్లలో కనిపించలేదు. ఆ కళ్లు యింకా చిలిపిదనంతో, అల్లరిగా నవ్వుతూనే ఉన్నాయి.

"సుషమా! కొంచెంసేపు నీ అల్లరి ప్రక్కకు పెట్టి, నేనడిగిందానికి సూటిగా జవాబు చెప్పు. నేను సీరియస్‌గా అడుగుతున్నా" బాధగా విలవిల్లాడుతూ, వెనక్కు తిరిగిపోతూ అన్నాడు.

అతనన్న మాటలకి, సుషమా కూడ ఒక్కసారిగా గంభీరంగా అయిపోయింది.

"సరే. నేనూ అంతకంటే సీరియస్‌గానే చెప్తున్నాను మధుబాబూ !

"నేనంటే, మరే అభిప్రాయంలేదా ?"— అనికదా అడుగుతున్నారు. ఎందుకు లేదు మీ రంటే మా యింట్లో అందరికీ ఒక రకమైన ప్రత్యేకాభిమానం ఉంది. అంతకు మించిన ఆత్మీయత ఉంది. నిజం చెప్పాలీ అంటే, ఆర్మీలో ఉన్న మా అన్నయ్య దగ్గర కంటే కూడ మీ దగ్గర నాకు ఎక్కువ చనువుంది. ఇష్టముంది. మా కుటుంబానికి మీ రెంత సన్నిహితులైపోయారూ అంటే, మనమధ్య విడదీయరాని అనుబంధం ఏర్పడిపోయింది.

మిమ్మల్ని చూస్తుంటే, మా యింట్లోని ఒక మనిషిలానే అనిపిస్తారు గాని, పరాయివారిలా ఏనాడూ కనిపించలేదు. మీ లాంటి వ్యక్తి, మా యింట్లోకి రావడం మా అదృష్టం. కేవలం ఇదంతా జన్మానుబంధమేమో అనిపిస్తూంటుంది నాకు. లేకపోతే ఎక్కడి నార్తు ?—ఎక్కడి సౌత్ ?—మనమధ్య ఏమిటీ బంధం ?


మీరు ఇల్లు ఖాళీచేస్తోన్న విషయం తెలీగానే నేనే కాదు, అమ్మా, నాన్నా కూడ ఢీలా పడిపోయారు."

మధు కళ్లలో, నీళ్లు చివ్వున జిమ్మాయి. హృదయాన్ని గట్టిపరుచుకుని, కిటికీ ఊచలు పట్టుకు అవతలికి చూస్తూ అన్నాడు.

—"నాకు పెళ్లి కుదిరిందని తెలీగానే, నీకెలా అనిపించింది సుషమా ? —నీకేమీ బాధనిపించలేదా ?"

"బాధా ? —బాధెందుకు ? —ఎంతో సంతోషమనిపించింది. అత్యంత ఆత్మీయుడైన సన్నిహితుడికి పెళ్లి అంటే, ఆనందించని మిత్రులుంటారా ? ఎక్కడైనా రావూ సౌత్ ? —మీరీవేళ చిత్రంగా మాట్లాడుతున్నారేమిటి ?"

(ముగింపు పైవారం)



యువతరం

ఇరవై సంవత్సరాల బొప్పా వెంకటేశ్వరరావు కాలేజీ ఏక్టివిటీస్‌లో ముందుండాలను



కుంటూనే, గేయాలు అవీ నిర్విరామంగా రాస్తూంటాడు. పత్రికలో సినిమా వార్తలు ముందు చదువుతాడు. కాని సినిమా తారలను చూడాలన్న సరదా లేదన్నాడు. కానీ వారిని, అలాగే మంత్రుల్నీ కూడా కొన్ని సందర్భాల్లో కలుసుకున్నాడు. ఆంధ్రోద్యమంలో పాల్గొన్నప్పుడు చూడ్డమే మంత్రుల్ని. ఆ తర్వాత కలుసుకోలేదు. సమస్యాత్మక చిత్రాలు తప్పక చూసే, యీ యువకునికి లైబ్రరీకి వెళ్లే అలవాటు లేదు. ఆటల విషయం అడిగితే వాళ్ల కాలేజీ (విజయవాడలో ఒకటి) కి ప్లేగ్రౌండే లేదన్న సంగతి చెప్పాడు. కవి సమ్మేళ్లనం, నాటకం, లాంటి వాటిలో పాల్గొనటం చాలా చాలా సర్దా — నటుడిగా రాణించాలని కూడా ఆశ వుంది. భవిష్యత్‌లో పరిశ్రమలు స్థాపించాలన్న పెద్ద కోరిక కూడా వుంది. "తాగావా?" అన్న ప్రశ్నకు "తాగుడు అలవాటు లేదు" అని జవాబు యిచ్చాడు. దేశంలో ధరలు పెరిగి పోటానికి అతని ఉద్దేశంలో కారణాలు, ఉత్పత్తి చాలినంత లేదు. — జనాభా పెరుగుదల ఎక్కువైంది. ఉత్సాహం, బోలెడు ఆశలు వున్న యీ యువకుడు బి. కాం. ఫైనలియర్ చదువుతున్నాడు. ఆశలను జాగ్రత్తగా ఏరుకొని ఆశయాలుగా మల్చుకుంటే తప్ప ముందుకు పోలేని తొలి మలుపులో నిలబడి వున్న యితనికి, యితని లాంటి యువకులకి రాజకీయాల ప్రవేశం మంచిదా? అన్నది ప్రశ్న. ఎందుకంటే వెంకటేశ్వరరావు "రాజకీయాలలో ప్రవేశం వున్నది" అని యిప్పుడే అన్నాడు గనుక.

— కృష్ణానంద్

జీవితం రుచి

(14వ పేజీ తరువాయి)

"ఏం మారుతుందోయ్? నా తలకాయ! . . . హటాత్తుగా దాని నలుపు పోదుగా? అలాగే దాని పెంకితనం కూడా తరిగిపోదుగా? ఇవన్నీ ఇలా ఉంచు. చదువు సంధ్యా లేని దాని పల్లెటూరు వాలకం ఎక్కడికిపోతుంది? నువ్వెన్ని చెప్పు సుబ్బిగా! నేను మాత్రం దాన్ని చేసుకోను. తర్వాత మరో సంగతి! ఈ ఉగాదిలోపుగ పద్మ విషయం తేల్చేస్తాను. ఫైనలియర్ అవుతుండగానే మూడు ముళ్లూ వేసేస్తాను. అంతే!"

సుబ్బారావు మరి మాట్లాడలేదు.

సూర్యం అంతిమ విజయం తనదే అయినట్లు మరోసారి నవ్వాడు చిన్నగా. వూర్మిళ వ్రాసిన ఉత్తరం అందుకుని దానికేసి ఓమాటు నిర్లక్ష్యంగా చూసి ముక్కలుగా చింపి కిటికీ బయటకు గిరాటేశాడు.

సుబ్బారావుకి చాలా బాధ కలిగింది.

"ఓరేయ్ సూర్యం! . . ఒక్క మాత్రా . . . పోనీ వూర్మిళని చేసుకోకపోతే పోనీ. కాని ఒక్కమాటు ఇందుపల్లి వెళ్లి ఆ అమ్మాయి కోరిక తీర్చకూడదూ?" అడిగాడు.

"ఎందుకూ?—" అన్నాడు సూర్యం.

"ఎందుకేమిటీ? ఆ అమ్మాయి మనసు కష్టపడకుండ ఉండేటందుకు. అదీ కాకుండా నువ్వెళ్తే ఆ అమ్మాయికి సూటిగా ఏ సంగతీ చెప్పేయ్యొచ్చు. లేకపోతే చివరిదాక ఆశలు పెంచుకుంటూనే ఉంటుంది".

సూర్యానికి ఈ మాట నచ్చింది. "బాగానే ఉంటుందికూడా . . . అదీకాక చిన్నప్పుడంతా తన నేడిపించిన ఫలితానికి ఈ తిరస్కారంతో వూర్మిళని బాగా ఏడిపించవచ్చు. అది కళ్లారా చూడొచ్చు. అయితే అయ్యిందికాని ఈ వెధవ సుబ్బిగాడు మంచి ఐడియా ఇచ్చాడన్మే."

సుబ్బారావు సూర్యం ఏం చెప్తాడోనని ఆత్రతగా చూడసాగాడు. రెండు మూడు నిముషాలు మవునంగా ఉన్న తర్వాత— "అయితే వెళ్లమంటావా?" అనడిగాడు సూర్యం.

చివరిసారిగా చిన్న బెట్టు చూపిస్తున్నాడని గ్రహించాడు సుబ్బారావు . . .

"అప్పన్నా పాపం! . . . ఒక మాటు వెళ్లొస్తే ఏం పోయింది?" జాలిగా అన్నాడు సుబ్బారావు.

"సరే! . . ." అన్నాడు సూర్యం.

"రైటో!" అనుకున్నాడు మనసులోనే సుబ్బారావు. కొంతవరకూ ఇది అతనికి ఆనందం కలిగించింది.

* * *

రైలుమీద, బస్సు మీద, పడవమీద ప్రయాణం చేసి సూర్యం ఊర్మిళ వాళ్ల వూరు ఇందుపల్లి చేరుకున్నాడు. సూర్యం చిన్నప్పుడు ఆ వూళ్లో రిక్షాలు ఉండేవికావు. ఇప్పుడు ఒకటో అరో సైకిలు రిక్షాలు తిరుగుతూ కనిపించాయి. కాలువ గట్టున రిక్షాలో వస్తూంటే చిన్నప్పటి సంఘటనలు ఎన్నో జ్ఞాపకం వచ్చాయి.

అప్పట్లో తనతో తిరిగిన ఇద్దరు ముగ్గురు స్నేహితులు కూడా కనిపించారు. సూర్యం మనసు ఒక రకమయిన అనుభూతికి గురైయ్యింది.

రిక్షా వూళ్లోకి ప్రవేశిస్తూండగా చెరువుగట్టున నలుగురైదుగురు అమ్మాయిలు నీళ్ల బిందెలు చంకన పెట్టుకుని వస్తూ కనపడ్డారు. "వీళ్లలోగాని లేదుకదా ఊర్మిళ?" అనుకున్నాడు సూర్యం.

ఆ నలుగురైదుగురమ్మాయిలు చాలా ఆరోగ్యంగా— అందంగా కనపడ్డారు సూర్యానికి.

"ఈ మాత్రం అందం కూడానా వూర్మిళకి?" మరోమాటు ఈసడించుకున్నాడు సూర్యం.

రిక్షా మేనమామ ఇంటి ముందు ఆగగానే సూటుకేసు అందుకుని దిగాడు. రిక్షాకు డబ్బిచ్చి గుమ్మంలోనుంచుని "అత్తయ్యా!" అన్నాడు మెల్లగా. ఎవరూ పలకలేదు. అలాగే కాసేపు నిలబడిపోయాడు సూర్యం.

"ఎవరు కావాలండీ?" అని సన్నని కంఠం వినపడి వెనక్కి తిరిగి చూశాడు సూర్యం.

సూర్యం కళ్లు జిగేలుమన్నాయ్! . . . అందమైన బొమ్మని నిలబెట్టినట్లు వయ్యారంగా చంకని బిందె పట్టుకుని నిలబడుందో అమ్మాయి.

సూర్యాన్ని చూస్తూండగానే ఆ అమ్మాయి సిగ్గుపడి— "ఓ! బావా? . . ." అంటూ లోపలకి వెళ్లిపోయింది కంగారుగా.

"ఊర్మిళా!" అనుకున్నాడు ఆశ్చర్యంగా సూర్యం.

అతనికేదో కలలో చూస్తున్నట్లుగా ఉంది. ఊర్మిళకి ఇంత అందం ఎక్కణ్ణుంచి వచ్చిందబ్బా? చిన్నప్పటి నలుపు నలుపుగానే ఉంది . . . కాని . . . ఆ నలుపులో వింత కాంతివచ్చి చేరిందే కొత్తగా. ఊర్మిళ ఇంత అందంగా సిగ్గు పడటం తనెప్పుడూ చూడలేదే? . . . ఎక్కణ్ణుంచి వచ్చి చేరాయి ఈ కొత్తదనాలూ? సూర్యం ఆలోచనలు కెరటాలై ముంచెత్తుతున్నాయి.

"రావోయ్ అల్లుడూ! . . . ఎన్నాళ్లకి జ్ఞాపకం వచ్చాం! . . . దారి తప్పలేదు కదా?" అత్తయ్య ఆహ్వానం సూర్యాన్ని ఆలోచన్లనుంచి ఇవతలకి తెచ్చింది. అంటే వూర్మిళ ఉత్తరం సంగతి వీళ్లెవరికీ తెలీదన్నమాట!

"వూఁ! . . . అబ్బే . . . దారి తప్పటం ఏమిటి?" సూర్యానికి మాటలు తడబడ్డాయి. సూటుకేసుతో సావిట్లోకి అడుగుపెట్టాడు సూర్యం.

"ఊర్మిళా! . . బావకు కాళ్లు కడుక్కోటానికి నీళ్లు తెచ్చియ్యి" అంటూ కేకేసింది సూర్యం మేనత్త.

సూర్యం, ఏవైపు నుంచి వస్తుందా అన్నట్లు చూడసాగాడు. అది కూడా పరాగ్గానే.

"కాళ్లు కడుక్కో బావా!" సరిగమలు పలికింది.

జీవితం రుచి

ఊర్మిళ కంఠం. సూర్యం ఆమెటువైపు నుంచి వచ్చిందీ గమనించలేదు.

ఊర్మిళని పలకరించాలని అతని ప్రయత్నం. అదేలాగో చేతకావటంలేదు. అతని తీరు అతనికే ఆశ్చర్యంగా ఉంది. కాలేజీ అమ్మాయిలు కనిపిస్తే చాలు ఏదో ఒక వంకని నిర్భయంగా పలకరించే తను ఏమిటి ఇలా అయిపోతున్నాడు ? ఊర్మిళలో ఈ కొత్త రకం శక్తి . . . అదే మాటలు రాకుండా మూగవాళ్ళను చేసేది ఎక్కణ్ణుంచి వచ్చింది ? ఈ ఆకర్షణ ? ఈ అందం ? ఈ కొత్తదనం ఎక్కణ్ణుంచి వచ్చాయి. ఊర్మిళకి ఏ దేవతలు ఇవన్నీ కానుకగా ఇచ్చారు ?

"బావా ! . . ." ఊర్మిళ మళ్ళీ పిలిచింది.

ఉలిక్కిపడి పూర్ణిమ చేతిలో నీళ్ల చెంబు అందుకున్నాడు. పూర్ణిమ వేలి కొసలు తగిలాయి. విద్యుత్ ప్రవహించింది రాకెడికి. ఏమిటీ అనుభవం సూర్యానికి ఏం అర్థం కాలేదు.

రెండు మూడ్రోజులు గడిచేసరికి పూర్ణిమ మాటల్లోనూ— చేతల్లోనూ చాలా అందమైన మార్పులు గమనించాడు సూర్యం. అంతకుముందు ఆమెలో చూడని కుదురుతనం చూశాడు సూర్యం. అతనికి ఆమెవలన ఎన్నడూ అనుభవంలేని మృదువైన — మధురమైన మర్యాద చవిచూశాడు. మాటలు పొందికగా మాట్లాడటంలో ఆమెలో కొత్త సౌందర్యాలు చూశాడు. పూర్వపు పెంకితనం— మంకుతనం ఏవీ ఆమెలో కనపడలేదు సూర్యానికి.

సూర్యం ఎంత కాదనుకున్నా ఇదేలా సంభవం అనిపించే ఆలోచనలు చుట్టుముట్టేవి ఉన్నాయి. ఒక క్షణములో అయితే పూర్ణిమనే అడిగితే. అనిపించింది.

ఆది జరిగిపోయింది.

ఉగాది రోజు ఉదయాన్నే సూర్యానికి ఉగాది పచ్చడి తెచ్చింది పూర్ణిమ. ఆ సమయంలో ధైర్యం తెచ్చుకొని— "అపురూపని పూర్ణిమా ! . . . ఇప్పటి నీ కుదురుతనం— మర్యాదా మన్ననా చిన్నప్పుడుండేవికావే ? . . . అంత రణపెంకెలా ఉండి నన్ను ఆట పట్టించేదానివే . . . హట

త్తుగా ఈ మార్పు . . . నిజంగా నాకు చాలా ఆశ్చర్యంగా ఉందన్నో" అనేశాడు.

సూర్యం మాటలు వింటూ ఫక్కుమని నవ్వింది పూర్ణిమ.

"చేయి పట్టు బావా ! . . . ఉగాది పచ్చడి తిందువుగాని" అంది సూర్యం అడిగినదానికి సమాధానం చెప్పకుండా.

సూర్యం చేయి పట్టాడు. పూర్ణిమ స్పూన్‌తో సూర్యానికి ఉగాది పచ్చడి వేసింది.

"ఎలా ఉంది బావా పచ్చడి ?" అడిగింది పూర్ణిమ సూర్యం తినగానే.

"బావుంది. రకరకాల రుచులు ! పుల్లగా, తీయగా, వగరుగా, చేదుగా . . ." సూర్యం చెప్తోంటే కిలకిలమని నవ్వింది పూర్ణిమ.

పూర్ణిమెందుకునవ్విందీసూర్యానికి అర్థంకాలేదు.

"అవునుకాని . . . నేనడిగినదానికి సమాధానం చెప్పనేలేదు" అన్నాడు. పూర్ణిమ మరోసారి నవ్వింది. అందంగా ! అదేమిటి బావా ! . . . నీచేతే చెప్పించాగా సమాధానం !" అంటూ అక్కణ్నుంచి పరుగున వెళ్లిపోయింది.

పూర్ణిమ అన్న మాటలు సూర్యానికిమాటు అర్థంకాలేదు. తనంతకు ముందు అన్న మాటలు మళ్లీ నెమరేసుకోసాగాడు. "పుల్లగా, తీయగా, వగరుగా" సూర్యానికి పూర్ణిమ సమాధానం తెలిసిపోయింది.

"అవునన్నో ! . . . పొగరూ . . . పెంకితనం . . . మంకుతనం . . . మర్యాదా . . . మన్ననా, అన్నీ ఉగాది పచ్చడిలాగే కలిసి ఉంటే బావుంటాయి. అదో రకమైన అందం కూడానూ." సూర్యం సుబ్బారావుకి ఉత్తరం రాసేందుకు కాగితం కలం తీసుకున్నాడు.

వొరేయ్ సుబ్బీ !

నీ సలహాకు చాలా థాంక్స్ !

ఊర్మిళ ఈ రోజు ఉగాది పచ్చడి పెట్టింది. తీయగా, పుల్లగా, వగరుగా, చేదుగా చాలా బావుంది. బహుశా అన్ని రుచులు కలిసి ఉండటం వల్లనే కాబోలు ఉగాది పచ్చడి అంత బావుంటుంది.

నా జీవితం కొత్త చిగుళ్లు వేస్తోంది.

పాత జీవితంలో ఆకులు రాల్చేసింది.

అర్థం అయ్యిందా ? రాళ్లనుకునేవి రత్నాలవు తాయనీ— మాణిక్యాలనుకున్నవి మసిబొగ్గులవు తాయనీ ఊర్మిళ చెప్పింది. అందుకే అందిన ఊర్మిళని కట్టుకుని అందని మ్రానిపళ్లకు గుడ్‌బై కొడ్తున్నాను. నీ

సూర్యం

అనబడే — సూరిగాడు.



అమెరికాలో 'కలకత్తా'

గత శతాబ్దంనుంచీ అమెరికాలో హత్యలకి రాజధాని అనిపించుకుని, 'అమెరికా కలకత్తా'గా పేరు పొందిన డెట్రాయిట్ నగరంలో ఈ సంవత్సరం

క్రిస్మస్ చావులు 850

ఏప్రిల్‌కి 233 హత్యలు జరిగాయి. క్రిస్‌మస్‌కి ఆ సంఖ్య 850 దాటవచ్చుని పోలీసు వారి అంచనా.

నేరాలు జరిగిన దానికన్నా ప్రజలలో భయోత్పాతం పదింతలు ఎక్కువగా ఉందీ నగరంలో. 12 సంవత్సరాల వయస్సుకి పైన ఉన్న ప్రతి వెయ్యి మందిలో 68 మంది దారుణమైన హింసకి గురైన వారున్నారని పోలీసు రికార్డులు సాక్ష్యం యిస్తున్నాయి. గత సంవత్సరం లెక్కలని బట్టి కత్తి పోట్లకి, మానభంగానికి గురైన వారు 90 వేల మంది ఉన్నారు.

డెట్రాయిట్‌లోని భీభత్సాన్ని, భయోత్పాతాన్ని నివారించడానికి ఫోర్డ్ లాంటి వ్యక్తులు కోట్లడాలర్లు ఖర్చు చేశారు.

ఈ నగరంలో పోలీసు వారి రూపురేఖలు, ఆయుధాలు భారీగా మహా యోధుల ఫక్కీలో ఉంటాయి. సంచార శాఖలో ఉండే వారికి చిన్న సైజు టాంకు వంటి ఏర్పాట్లు ఉంటాయి. ఎన్నో రకాల తుపాకులు ఇతర సాధనాలు ఉంటాయి. దుండగులు జరిపే సాయుధ దాడులని ఎదుర్కొనడానికి వీలుగా ఎన్నో అధునికమైన విధానాలని అవలంబిస్తారు. అప్పటికీ కొందరు అధికారులు ప్రాణాలని బలి పెట్టాల్సి వస్తూ ఉంటుంది.

ఈ దారుణాలని అరికట్టేటందుకు 'స్ట్రైస్' అనే ప్రత్యేక విభాగం కూడా యిటీవలి దాకా ఉండేది. గత సంవత్సరం చివరి భాగంలో కోల్‌మన్ యంగ్ అనే ఒక నల్లజాతి వ్యక్తి మేయర్‌గా పదవిని అలంకరించాడు. ఆయన పోలీసు శాఖలో మార్పులు తీసుకురావాలని అనుకున్నాడు. పోలీసు శాఖ పునర్వ్యవస్థీకరణలో మొదటి చర్యగా ఈ 'స్ట్రైస్' ని రద్దు చేయడం జరిగింది.

స్ట్రైస్ విభాగం కమాండర్ జేమ్స్ బానన్ అంచనాలని బట్టి గుర్తు తెలియని వ్యక్తుల హత్యలు 20 శాతం జరిగితే, గుర్తు పట్టగలిగే వ్యక్తుల హత్యలు 50 శాతం ఉంటాయట. గంజాయి, నల్లమందు మొదలైన నిషేధించిన మత్తు పదార్థాల వ్యాపారం ఈ గుర్తు తెలియని వ్యక్తులు హత్య చేయబడటానికి కారణం అయి ఉండవచ్చని బానన్ అభిప్రాయం.

ఈ హత్యలలో 70 శాతం తుపాకులు ఉపయోగించి చేసినవే. 80 శాతం నల్లజాతి వారికి సంబంధించినవే.

దారుణ హత్యలు 233

కుటుంబంలోని చికాకులు, కలతలు హత్యలకి దారి తీస్తాయని, వాటివల్ల హత్యల సంఖ్య పెరుగుతుందని, నిషేధింపబడిన మత్తు పదార్థాల వ్యాపారం హత్యలు జరగటానికి మరింత దోహదకారి అవుతున్నదని బానన్ అభిప్రాయం. 'డొమెస్టిక్ టాక్స్ ఫోర్స్' అనే ఒక కొత్త విభాగాన్ని పెట్టి ఇలాంటి దారుణాలు జరగకుండా నివారించవచ్చని ఆయన నమ్మకం.

ఈ సంవత్సరం 850 అనుకుంటే పై ఏడు ఐర్లెండ్ హత్యోదంతంలా 1000 హత్యలు జరగవచ్చు. ఐర్లెండ్ సైన్యం ఆధిపత్యం కింద ఉన్న దేశం. ప్రతి వీధిలో ఒక సైనికుని కాపలా పెట్టి హత్యలని తగ్గించుకొన గలిగింది ఐర్లెండ్.

డెట్రాయిట్ నగరంలో కూడా పరిస్థితి ఇదే విధంగా కొనసాగితే మేయర్ పోలీసుని కాదని సైన్యాన్ని రప్పించాల్సిన అవసరం ఎంతైనా ఉంటుంది.

నవ్వు

—దమ్ము శ్రీనివాసబాబు

నవ్వుతూ గడపాలి జీవితం— ప్రతి
పువ్వులో చూడాలి జీవిత సత్యం.
ప్రతికేది క్షణమైనా
గడియ అయినా, రోజైనా
నవ్వుతూ గడపాలి జీవితం— ప్రతి
పూవులో చూడాలి జీవిత సత్యం.

నవ్వుతూ పరిమళాలు
పువ్వులా వెదజల్లు
రాలినా, గాలిలో కలిసినా
నీ నవ్వే ప్రతిధ్వనిగా
మారు మ్రోగుతుండాలి
నవ్వుతూ గడపాలి జీవితం— అందరినీ
నవ్విస్తూ గడపాలి జీవితం
అప్పుడే విరిసిన మల్లియలా ఉండాలి
కల్మషం లేనట్టి పసివాళ్ల నవ్వులా
నిండుగా నవ్వేటి బోసి నోటి తాతలా
నవ్వాలి— నవ్వాలి— బ్రతుకంతా నిండుగా
నవ్వుతూ గడపాలి జీవితం— ప్రతి
పూవులో చూడాలి జీవిత సత్యం

ఏదైనా, ఎన్నైనా అడ్డువచ్చినా సరే
లెక్కచేయకుండ సాగు సెలయేటి పరుగులా
కిలకిలా— గలగలా
నవ్వుతూ గడపాలి జీవితం— ప్రతి
పూవులో చూడాలి జీవిత సత్యం.

ఆల్ఫ్రెడ్ మీద నాకున్న గౌరవం కొద్దీ, కొద్ది ఆల్కహాల్ ఒకపూట తీసుకున్నామని నిత్యం తాగుతూవుండాలా? ఎప్పుడైన సభ్యత కోసం సంస్కారం కోసం మిత్రులతో కలిసి తాగడం వేరు—కాక్‌టైల్ పార్టీలలో పాల్గొన డంవేరు— ఇలా నిత్యం దేవదాసుగా మారి దొర్లడంవేరు — మనమీద మనకే అంత స్వాధీనం లేనప్పుడు ఇతరులమీద ఏలా వుంటుంది?'

ఆ తర్వాత ఎప్పుడైనా మాధవికి తెలియ కుండానే తాగుతూ వుండేవాడిని—

ఒకనాడు గురూజీ నన్ను పిలిచి గట్టిగా చెప్పారు 'కిరణ్ — నీవిక మాధవి ఇంటికి వెళ్ళనక్కరలేదు' అని—

'మరి నేత్రచికిత్స—'

ఆయన నన్నొక వింత జంతువును చూచి నట్లు చూచారు — కొంచెం ఆగి అన్నారు 'నీవేమి కళ్లవైద్యుడివా రోజూ వెళ్లడానికి? చంద్రమ్మ మీ బంధువులమనిషా? ఏమిటి అంత ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడానికి—'

'బాంధవ్యానిదేముంది గురూజీ — లోక మంతా మనకు బంధువులే'— అంతా ఆత్మ ంధువులే.

'అలాగయితే మరికొన్ని జాలరి కుటుంబా లను చూపిస్తాను— వాళ్లు నీవంటి సేవా పరుల సహాయాన్ని అపేక్షిస్తున్నారు — అనాథలు — కుంటివాళ్లు — గుడ్డివాళ్లు — కుష్టువ్యాధి పీడితులు— వెళ్ళవుగాని రోజూ సేవ చేయడానికి—'

నేనేమీ జవాబు చెప్పలేకపోయాను—

దానితో భయం పట్టుకుంది మాధవి ంటికి వెళ్తే స్వామీజీకి ఎక్కడ కోపం స్తుందే మోనని—

రెండు రోజులు వూళ్ళోకి వెళ్లలేదు

చిదంబర రహస్యం

(11 వ పేజీ తరువాయి)

హాస్టల్ విడిచి. మూడోరోజు వెళ్లకుండా వుండలేకపోయాను — బాగా చీకటి పడ్డాక మహారాణిపేట బయలుదేరాను— వెళ్లి తలుపు తట్టాను— ఇల్లంతా చీకటి.

రెండు మూడు కొవ్వొత్తులు వెలుగు తున్నాయి—

'మాధవీ' పిలిచాను—

వంట గదిలో నుండీ మాధవి వచ్చింది.

నన్నుచూచింది—

ఒక్క క్షణం అలాగే నిలబడి పోయింది.

'రండి' అన్నది మెల్లగా

లోపలకి నడిచాను.

'ఉండండి టిఫిన్ తెచ్చి ఇస్తాను'—

'ఇప్పుడు టిఫిన్ ఏమిటి?— వచ్చేటప్పుడు కాంటీన్‌లో తిని వచ్చాను—'

ఆమె మాట్లాడకుండా వంటగదిలోకి వెళ్లింది—నేను ఓ పదినిమిషాలు చూశాను— పదిహేను నిమిషాలు చూశాను— లేచి కిచెన్‌లోకి వెళ్లాను—

కొవ్వొత్తుల వెలుగులో స్టౌ మీద మాధవి వంట చేస్తున్నది—

కొవ్వొత్తినుండిజారే వెచ్చటి బిందువుల్లా మాధవి కళ్లవెంట నీటిబొట్లు—

'మాధవీ'

ఆమె వెనుదిరిగిచూచి మళ్లీ తల వంచు కున్నది—

వెక్కివెక్కి ఏడుస్తున్నది

'మాధవీ—ఎందుకు ఏడుస్తున్నావు?'

'ఎందుకు మీరీ రెండు రోజుల నుండి రాలేదు' జరిగినది చెప్పాను—

'ఔను— స్వామీజీ నిన్న ప్రార్థనా మంది రంలో నాతోనూ అన్నాడు—కిరణ్‌తో కలి! తిరగకూడదు- చదువు సంధ్యా లేకుండ అతడు చెడిపోతున్నాడు—అని'

ఈ మాటలు చెపుతున్నప్పుడు ఆమెగొంతు గాద్గదికమైంది—

'మాధవీ! మనకింక భయమెందుకు? స్వామీజీతో నేమిటి? అందరితోనూ చెప్పి వేస్తాను మనం భార్యాభర్తలం కాబోతున్నా మని. నీతికీ—నిజాయితీకీ, భయ మెందుకు??'

'కిరణ్‌జీ—కిరణ్—కిరణ్'

ఆమె ఆవేశంతో నా మెడచుట్టూ రెండు చేతులూ వేసి నన్ను గుండెలకు హత్తు కుంటూ అన్నది—

'అదంత సులభంకాదు—స్వామీజీదయలేనిదే నా తల్లి కళ్ళు బాగుపడవు— ఆయనకు కోపం వచ్చిందా మనకు ఉన్న కళ్లుకూడా పోతాయి— నేనేం చేయను కిరణ్?— అసహాయురాలిని— అబలను—'

మాధవి వెక్కి వెక్కి ఏడుస్తున్నది—

భయం వేసింది. 'మాట మార్చడంకోసం అన్నాను 'ఇల్లంతా చీకటిగా వుందేమిటి? ఫ్యూజ్ పోయిందా?'

'లేదు—బిల్లు కట్టలేదని కరంటువాళ్లు డిస్—కనెక్టు చేసి పోయారు—'

మాధవి ఆర్థికదుస్థితి చీకటిలా ఇల్లంతా వ్యాపించిందని నా కిప్పుడు అర్థమైంది—

'ఎవరూ వచ్చింది?' నిద్రలేచి కళ్లు నులుముకొంటున్నది చంద్రమ్మ

'నేనమ్మా—కిరణ్‌ను—'

'రాలేదేం నాయనా—రెండు రోజులుగా'

'ఏదో పనివుండి—'

'ఆ పాపిష్టివాళ్ళు కరంటు బిల్లు ఫస్టుకు కడతామన్నా వినకుండా తీగ తెంపి వెళ్ళారు నాయనా—

గుడ్డిదాన్ని. చీకటీ వెలుగూ నాకు రెండూ సమానమే కాని అమ్మాయి నిన్నటి నుండి ఒకటేగోల—ఏ పని చేసుకోవడానికీ కొవ్వొత్తు లతో కన్నుపొడుచు కున్నట్లుగా వున్నదంటు న్నది'

'ఫరవాలేదమ్మా — రేపు నేను కట్టి వస్తాలే' కొవ్వొత్తితో షెల్ఫు వెతికాను.

టైంపీస్ పక్కనే కరంటు బిల్లు వుంది. తీసుకున్నాను.

కాసేపు ఏవో అవీ ఇవీ మాట్లాడింది చంద్రమ్మ.

'వస్తానమ్మా' లేచాను.



'మంచిది నాయనా — మమ్మల్ని నువ్వు కూడా మరచిపోతే మా గతేంకాను'

జోళ్లు వేసుకున్నాను.

మాధవి వచ్చింది.

ఆమె కళ్లల్లోకి చూచాను.

నా కాలర్ సరిచేస్తూ అన్నది 'దయచేసి స్వామీజీకి కోపం తెప్పించకండి—నన్ను మరచిపోండి—కనీసం కొంతకాలమయినా'

'మాధవీ'

'కిరణ్—ఆవేశపడకు - నాకు మన జీవితమెంత ముఖ్యమో తల్లి కళ్లు బాగుపడటమూ అంతే ముఖ్యం' మాధవి బాధగా అన్నది.

నేను ఖిన్నుణ్ణి అయినాను—ఆమెనలా చూస్తూ మెల్లగా నడుస్తూ రోడ్డుమీదికి వచ్చేశాను.

గుమ్మంగ్గి దగ్గర నిలబడి నన్నలా చూస్తూ వున్నది. నేను తన మాటకు వ్యతిరేకంగా ఇక్కడికి వచ్చాననీ స్వామీజీకి తెలియదా ? తెలిస్తే కోపగిస్తాడేమో— అసలే మంత్రవేత్త - చివరకు నా బ్రతుకిలా మాయల మరాఠీగాళ్ల చేతిలో పడిందేమిటూ?అనిపించింది—

బస్సెక్కాను—

మెస్‌కు వెళ్లబుద్ధి పుట్టలేదు—

రూం చేరేసరికి వెంకటరెడ్డి శ్రద్ధగా చదువుకుంటూ వున్నాడు—

నన్నుచూసి మళ్లీ తలదించుకొని తన చదువులో పడిపోయాడు—

నేనేదో తప్పుచేసిన వానిలా మాట్లాడకుండా నాదోమ తెర లోకి దూరాను—

గట్టిగా కళ్లుమూసుకున్నాను—

నిద్దరాలేదు—

లేచి బయట వరండాలో కాసేపు పచారు చేశాను మళ్లీ—

లోపలికివెళ్లి మంచంమీద కూర్చొని అన్నాను 'రెడ్డీ – లైటు తీసేద్దూ నిద్ర రావడంలేదు—'

వెంకటరెడ్డి లైట్ ఆఫ్‌చేసి తన టేబిల్ లైట్ వెలిగించుకున్నాడు.

ఆలైట్‌కాంతినికూడా భరించలేక పోతున్నాను. కొంచెం ఆగి వెంకటరెడ్డి అన్నాడు—

'కిరణూ— ఇదేం బాగుండలేదు—'

నేను కళ్లు మూసుకొని నిశ్శబ్దంగా వింటున్నాను—

'నీవసలు బొత్తిగా చదవడంలేదు - నిన్న ప్రొఫెసర్‌కూడా కామెంట్ చేశాడు నీవేదో రికార్డు బ్రేక్ చేస్తావని ఆయన మొదట



కుమారి అరుణ అవధ్య గుంటూరులో భారతీయ విద్యాభవన్‌లో కూచిపూడి నృత్య ప్రదర్శన ఇచ్చింది. ఈమె చింతా కృష్ణమూర్తిగారి శిష్యురాలు.

నీ ప్రోగ్రెస్‌చూచి ఆశపెట్టుకున్నాడట— 'ఇదేమిటీ ఇట్లా అయిపోయినాడు ఈ పిల్లగాడు అంటున్నాడాయన— ప్రొఫెసర్స్ మొదట్లోనే ఇంప్రెషన్ ఫార్మ్‌చేసుకొంటారు. అప్పుడే జాగ్రత్తగా వుండాలి. ఆ తర్వాత ఎంత చదివినా లాభంలేదు—"

నా గుండెలు దడదడలాడాయి—

'ఆయన అనేదేందిలే— నాకు మాత్రం తెలియడంలా, ఈ తిరుగుళ్లేమిటి ? సినిమాలేమిటి? తెల్లవార్లూ పూళ్లో పడుకోడమేమిటి ? నువ్వసలు చదువుకునేందుకేనా ఇక్కడికి వచ్చింది—'

'రెడ్డీ'

'కిరణూ—నామాటలు నీకు బాగుండవు—నిజం నిష్ఠూరంగానే వుంటుంది ఏం చేయను ? మనమేం లక్షాధికారులం కాదు జల్సాలుచేయడానికి – ఈ చదువుమీద మన భవిష్యత్తు ఆధారపడి వుంది— నీవు దాన్ని ఈ సంవత్సరమే ఇట్లా నెగ్లెక్ట్ చేస్తున్నావంటే ఇదేదో గ్రహచారమనిపిస్తున్నది. నేనేం చెప్పనబ్బా నీకు ఇంతకంటే.'

'నాకేం చెప్పనక్కరలేదు'

వెంకటరెడ్డి నామాటకు షాక్‌తిన్నట్లు టేబిల్‌లైటు వెలుగులో ఆముఖాన్ని నేను గుర్తించాను—

(ఇంకా వుంది)

డాక్టరు సలహాలు

డాక్టర్ కె. వెంకటేశ్వరరావు

కె. ఎస్. హైదరాబాదు.

నా వయస్సు 20 సం. లు. బయట వాతావరణంతో సంబంధం లేకుండానే నాకు ఎక్కువ చెమటపోస్తుంది. ఏమాత్రం అలసట కలిగినా ఈ చెమట పచ్చి అది ఎండిన తర్వాత తెల్లగా మరకలు ఏర్పడతాయి.

శరీరంలోని స్వేదగ్రంథులు ఎక్కువగా పని చేయటం వల్ల ఇలా జరుగుతుంది. సింపతెటిక్ నర్వస్ సిస్టమ్ ఎక్కువగా ఉద్రేకం చెందటం వల్ల, థైరాయిడ్ గ్రంథి ఎక్కువగా పనిచేసినప్పుడు శరీరంలో థైరాక్సిన్' హార్మోను ఎక్కువవటం వల్ల ఇలా జరుగుతుంది

బి. ఎం. ఆర్., బ్లడ్ కొలెస్టరాల్ మొదలగు పరీక్షలు చేయించుకుంటే రోగ నిర్ణయం జరుగుతుంది.

అంతవరకూ ఎలక్ట్రాల్ పౌడర్‌ను నీళ్లలో కలిపి రోజుకి 3 సార్లు తీసుకోవటం, ఒల్మాయి రసం వాడటం వల్ల చాలావరకు ఉపశమనం కలుగుతుంది.

కె. ఎస్ — విశాఖపట్నం.

నాకు గత 1 సం.గా బుతుక్రమం 3 నెలలకొకసారి వస్తున్నది. ఇలా ఎందువల్ల జరుగుతున్నది మాకు 4 సం.ల వయస్సు గల పాప ఉన్నది. మరలా సంతానం కలగలేదు.

* ఈ లక్షణాలను లేడీ డాక్టర్లకు తెలిపితే వారు పరీక్షచేసి అవసరమైతే చిన్న శస్త్రచికిత్స 'డి' అండ్ 'సి') ద్వారానో లేక మాత్రల ద్వారానో మీ బాధను నివారించగలరు. మీ రోగ నిర్ణయం ఉత్తరం ద్వారా చెయ్యటం కష్టం.

గర్భసంచి శుభ్రపరచటంవల్ల మీకు తప్పక గుణమవుతుంది.

సి. హెచ్. ఎస్ — కందుకూరు.

నేను శ్వాస తీసుకునేటప్పుడు వూపిరి తిత్తులకు కుడిప్రక్క భాగాన నెప్పిగా ఉండి, పట్టి వేసినట్లుండును. ఇలా తరచూ వస్తుంది. ఎక్స్‌రే నెత్తురు పరీక్షలలో దోషం లేదన్నారు. ఇంజక్షన్లు, మందులు వాడాను. ఫలితంలేదు.

* ఇలా కుడివైపున ఛాతీలో పట్టివేసినట్లు ఉండటం లివరుకు సంబంధించిన రోగాన్ని తెలుపుతున్నది లివరుకీ వూపిరితిత్తులకీ మధ్య ఒక పొర(డయాఫ్రం) మాత్రమే అడ్డు ఉంటుంది.

లివరులో "అమీబిక్ హెపటైటిస్" లేక 'యాబ్సెస్'ఉన్నప్పుడు, లివరు వ్యాకోచించి నరములు లాగటం వల్ల ఇలా నొప్పి ఏర్పడే అవకాశం ఉన్నది. మలపరీక్ష 2, 3 సార్లు వెంటవెంటనే చేయించుకోవటం ద్వారా రోగ నిర్ధారణ అవుతుంది. రోగ నిర్ధారణ జరిగిన తర్వాత వైద్యం చెయ్యటంజరుగుతుంది.

వె. కె — పాలవంచ.

మా నలుగురు పాపలకీ నెలరోజులుగా కోరింత దగ్గులు వస్తున్నాయి. వైద్యుల సలహాపై రకరకాల మందులు వాడాము. ఇంతవరకు తగ్గలేదు. దగ్గు వచ్చినప్పుడు వూపిరి పీల్చటం చాలా కష్టమవుతున్నది. దీని నివారణకు ఏ మందులు వాడాలి ?

* 'పెర్టుసిస్' అనే కోరింత దగ్గువచ్చిన తర్వాత తేలికగా నయమవటం అంత సులభంకాదు. 'స్ట్రెప్టోమైసిన్' 'క్లోరంఫెనికాల్' మాత్రమే ఈ రోగ నివారణకు ఉపయోగపడతాయి. వీటిని సరిఅయిన మోతాదులో వైద్యుల 'పర్యవేక్షణలో' వాడాలి. ఈ కోరింత దగ్గు వచ్చినప్పుడు చిన్న పిల్లలలో నిర్లిప్తంగా, ఉండే '[ప్రైమరీ కాంప్లెక్స్' బహిర్గతమవటంవల్ల జ్వరం, దగ్గు చిక్కిపోవటం ఈ రోగం నయమయిన తర్వాత జరుగవచ్చును. దీనికి 'ఇసోనెక్స్' మాత్రలు వాడాలి. అయినా చిన్న వయస్సులోనే ఈ రోగం రాకుండా 'ట్రిపుల్ ఆంటిజన్' వేయిస్తే ఇన్ని అవస్థలు ఎందుకు ?

పి. డి — గుడివాడ.

నాకు తలలో చిన్న చిన్న కురుపులు లేచి మెడమీద 'గ్లాండ్స్' వాయటం జరిగింది. ఇవి తగ్గాలంటే ఏం చెయ్యమంటారు ?

* స్త్రీలలో తలలో కురుపులు రావటం ఎక్కువగా 'పేలు' ఉండటంవల్ల జరుగుతుంది. ఇలా పేలు ఉన్నంత కాలం కురుపులు తగ్గవు. కురుపులు ఉన్నంత వరకూ మెడమీద 'గ్లాండ్స్' యొక్క వాపు తగ్గే అవకాశంలేదు.

తలలో పేలు ఉన్నప్పుడు 'లోరెక్సేన్ లిక్విడ్' రాత్రిపూట తలకి పట్టించి, ఉదయాన తలంటి పోసుకోవాలి. ఇలా వరుసగా 3 రోజులు చెయ్యాలి తలగడ కవర్లు, దుప్పట్లు మొదలైనవి వేడినీళ్లలో ఉడికించి వాడాలి. ఈ మందు పై పూత మాత్రమే. లోపలికి 'ఎలోక్సిన్' లేక 'మాగ్రిబాన్' మాత్రలు రోజుకి 2 వంతున ఒకవారం వాడాలి. కురుపులు మానిన వెంటనే 'గ్లాండ్స్' వాటంతట అవే తగ్గిపోతాయి.

బి. డి — చెన్నేకొత్తపల్లి.

నా వయస్సు 28 సం లు ఈ వయస్సులోనే గుండెనెప్పి వస్తున్నది. కుడివైపు ఛాతీ నెప్పిగా ఉంటున్నది. ఇంజక్షన్లు చేయించుకొన్నప్పుడు 4గం.లు మాత్రమే ఉపశమనంగా ఉంటుంది. దీని నివారణోపాయం చెప్పండి.

* సరిగా రోగ నిర్ణయం చెయ్యకుండా ఇంజక్షన్లు వాడితే ఫలితం కనిపించదు.

ఎక్స్‌రే, నెత్తురు పరీక్ష, మలంలో 'అమీబియాసిస్' కొరకు పరీక్ష చేయించుకోవటంముఖ్యంగా అవసరం. ఈ పరీక్షల ఫలితాన్నిబట్టి వైద్యం చెయ్యవలసి ఉంటుంది. జ్వరము, దగ్గు మొదలయినవి ఉన్నప్పుడుకఫం పరీక్షించడంకూడా చాలాముఖ్యం.

గుండెనెప్పి అనేది, ఛాతీలోని కండరములు, వూపిరితిత్తులు, గుండె, వాటిపొరలు మున్నగువాటిలోని రోగాలను, కడుపు, లివరు మొదలగు వాటిలో రోగాలను సూచిస్తుంది.

కొత్త కెరటాలు

కవితా సంకలనం. సంపాదకుడు శ్రీ వోడపల్లి వేంకటప్పారావు. 56 పేజీలు వెల రెండు రూపాయలు. ప్రతులకు సారస్వత మేఖల, మహబూబాబాదు, వరంగల్ జిల్లా.

గుడిసె గుండె

"గుడిసె గుండె" కవిత మా కార్యాలయం చేరింది. రచన: దేవరాజు మహారాజు వెల : రూ. 2/- ప్రచురణ : చింతయ్య అర్గనైజర్స్, 1-10-132, అశోక్ నగర్, హైదరాబాద్, 500020.

తిమిరంతో సమరం


కవితా సంపుటి. రచన : శ్రీ దాశరథి. 100 పేజీలు, వెల 5 రూపాయలు. ప్రతులకు : 1) ఆంధ్ర సారస్వత పరిషత్తు, తిలక్ రోడ్డు, హైదరాబాదు— 1, 2) విశాలాంధ్ర పబ్లిషింగ్ హవుస్ ఏలూరు రోడ్డు, విజయవాడ—2, 3) ఆంధ్ర ప్రదేశ్ బుక్ డిస్ట్రిబ్యూటర్స్, రాష్ట్రపతి రోడ్డు సికింద్రాబాదు—3.

ప్రపంచంలో నలుమూలలా విశృంఖలంగా జరుగుతున్న అన్యాయాలని, అక్రమాలని, సంక్షోభాలను, చూసిన కవి హృదయంలో కలిగిన భావ సంచలనమే 47 కవితలు గల ఈ సంపుటం. అన్యాయాన్ని, అక్రమాన్ని ఎదిరించడంలో కవికి ఉండాల్సిన గుండె బలం, కవిత్వానికి ఉండాల్సిన కండబలం దాశరథి కంచుగంటంలో ఉన్నాయని "తిమిరంతో సమరం" నిరూపిస్తుంది.

యోగవిద్యా పాఠాలు

సహస్ర యోగ్యతా పత్ర విభూషిత, యోగాస్య ప్రవీణ శ్రీ నల్లగొండ రామచంద్రరావు రచించిన యోగవిద్యపాఠాలు, యోగటీచర్, అనుభవశరీర వ్యాయామం అనే మూడు పుస్తకాలు మా కార్యాలయం చేరాయి. యోగాసనాలని గురించి అన్ని వివరాలూ బొమ్మలతో సహా ఈ పుస్తకములలో ఉన్నాయి. ఒక్కొక్క పుస్తకం వెల 5 రూపాయలు.

ప్రతులకు : రచయిత, తాడంకి వారివీధి, సత్యనారాయణపురం, విజయవాడ—11.



అవీ-ఇవీ-అన్నీ

డా. సి. ఆర్. రెడ్డి జీవితకథ ఆంగ్లం

సాహిత్య అకాడమీ న్యూఢిల్లీ వారు భారత సాహిత్యకారులు అనే శీర్షిక క్రింద వెలువర్చే మహనీయుల జీవిత గ్రంథాలలో డా. సి.ఆర్. రెడ్డిగారిని గురించి ఆంగ్లంలో శ్రీ డి. ఆంజనేయులు వ్రాసిన గ్రంథం మా కార్యాలయం చేరింది. వెల : రు. 2.50 లు. ప్రతులకు కేంద్ర సాహిత్య అకాడమీకి వ్రాయవచ్చును.

జనం ఊపిరితో

గీతాలు. 22 పేజీలు, వెల 50 పైసలు, ప్రతులకు : సృజన, హనుమకొండ, వరంగల్.

చారు మజుందార్

సంస్మరణ కవితలు. శ్రీశ్రీ మొదలైన వారి రచనలు 42 పేజీలు. 80 పైసలు. ప్రతులకు : సృజన, హనుమకొండ, వరంగల్.

రచయితలకు మనవి

★ కార్టూన్లు పంపేవారు ప్రతి కార్టూన్ వెనుక తమ చిరునామా వ్రాయడం మంచిది. తగినన్ని తపాలా బిళ్లలు అంటించి, స్వంత చిరునామా గల కవరుంటే తప్ప కార్టూన్లు త్రిప్పి పంపడం సాధ్యంకాదు దానికైనా కనీసం ఆరు వారాలు పట్టవచ్చును.

★ కథలు పంపేవారుకూడా విడిగా తపాలా బిళ్లలు పంపటం, లేదా కథ పంపిన కొంత కాలానికి తపాలా బిళ్లలు పంపటం చేయవద్దని మనవి. కథల పరిశీలనకు ఆరు నుంచి పది వారాలు పట్టవచ్చును. కథ ప్రచురణామోదం పొందిన వెంటనే రచయితకు కార్డు ద్వారా తెలియజేస్తాము. నవలల విషయంలో ఏ విషయం తెలియటానికి నాలుగు మాసాలు పట్టవచ్చును. ఈ విషయంలో ఉత్తర ప్రత్యుత్తరాలకు తావు లేదని మరోసారి మనవిచేస్తూ— మాతో రచయితలంతా పై నిబంధనల విషయంలో సహకరించాలని కోరుతున్నాము.

★ లోగడ ముద్రితమైన, లేక ప్రసారమైన రచనలను, తమ స్వంతమే అయినా మా పరిశీలనకు పంపరాదని రచయితలకు ప్రత్యేకంగా మనవి చేస్తున్నాము.

★ మా కార్యాలయానికి స్వయంగా వచ్చి రచనలందజేసే వారికి కూడా పై నిబంధనలు వర్తిస్తాయి. వారుకూడా స్వంత చిరునామా గల తపాలా బిళ్ల లంటించిన కవరు పెట్టి రచనలను యివ్వాలి.

★ డాక్టర్ సలహాలు, ప్రశ్నావళి, ఉత్తరాల శీర్షికల వంటి కొన్ని శీర్షికలకు మాత్రమే పాఠకులంతా తమ సందేహాలను, సూచనలను, అభిప్రాయాలను పంప వీలున్నది. ఈ విధంగా పంపేటప్పుడు కార్డుపై లేక కవరుపై శీర్షిక పేరు ఉదహరిస్తే పరిశీలన త్వరితంగా జరుగుతుందని మనవి చేస్తున్నాము.

★ రచనలు, కార్టూన్లు, అభిప్రాయాలు, ప్రశ్నలు, సూచనలు, ఉత్తరాలు మొదలైనవన్నీ సంపాదకుడు, ఆంధ్ర సచిత్ర వారపత్రిక, గాంధీనగరం, విజయవాడ-3 అన్న చిరునామాకు వ్రాయాలి. వ్యక్తులపేర పంపవద్దని మనవి.

★ ప్రచురణకు స్వీకరించిన రచనల విషయంలో కూడా వాటిని వీలు వెంబడి ప్రచురించే హక్కు సంపాదకునికున్నది కనుక దయచేసి, ఉత్తరాల ద్వారా తమ రచన ప్రచురణ విషయం జ్ఞాపకం చేయనక్కరలేదని మనవి చేస్తున్నాము.

★ వ్యాసాలు పంపేవారు క్లుప్తంగా వారపత్రికలో రెండు పేజీలకు మించకుండా పంపాలి. వ్యాసాలతో ఫోటోలు పంపేవారు కూడా వాటి వివరం ఫోటోల వెనుక వ్రాయాలి. లెక్కలు, అంచనాలు, వివరాలు వంటివి యిస్తూ వ్రాసే వ్యాసకర్తలు, వేరే కాగితంపై తాము ఆ అంకెలను సేకరించిన గ్రంథం లేదా యితర ఆధారాలను తెలిపితే ఎంతో మేలు చేసినవారవుతారు.

ఇంటర్వ్యూ

(7వ పేజీ తరువాయి)

గబగబా హాల్లోకివచ్చాడు. "మరి నేవెళ్తానండి ఇరవై వేలయితే వారు ఒప్పుకోలేరు. అయినా చెప్పి చూస్తా" అని లేవబోయిన సిద్ధాంతి "సిద్ధాంతిగారూ ఆగండి!" అన్న సుధాకర్ పిలుపుకి మళ్లీ చతికిల బడ్డాడు.

"నాన్నా!" అంటూతండ్రివద్దకు వచ్చాడు సుధాకర్.

అతనితల్లీ, తండ్రీ, సిద్ధాంతీ అతనికేసి ఆశ్చర్యంగా చూస్తున్నారు.

"నాన్నా ఏమిటిది? నన్ను ఇరవై వేలకు అమ్మతారా? నా చదువూ, విజ్ఞానం ఇవన్నీ ఇటువంటి దురాచారానికే ఉపయోగ పడుతున్నాయా? ఒద్దు...నాన్నా ... ఒద్దు ... డబ్బుతో మనుషుల విలువ కట్టకండి ..." ఉద్వేగంతో ఊగిపోతున్నాడు సుధాకర్.

"ఏమిటిరా? నీ కేమీ తెలియదు, పెద్దవాళ్లం మేం చూసుకుంటాం గదా!"

"నాన్నా! మీ ముందు నిలబడి, ఇంత వరకు మాట్లాడి ఎరుగను. కానీ, ఈ అన్యాయం నేను సహించలేను నాన్నా! కేవలం డబ్బుతో ఒక అమ్మాయి నా భార్య అయ్యే హక్కు సంపాదించటం అన్యాయం నాన్నా ...నా వ్యక్తిత్వం, నా సంస్కారం, నా విజ్ఞానం, కించపడటం లేదా నాన్నా?

అమ్మా! నాన్నా! శ్యామల నాకు నచ్చింది. మీకు ఇష్టముంటే కట్నం లేకుండా ఈ పెళ్లి జరిపించండి. లేదా ... నన్నిక జీవితంలో పెళ్లి చేసుకోమని అడగకండి..." అంటూ అక్కడ నుంచి గబగబా వెళ్లి పోయాడు.

సిద్ధాంతి గుడ్లప్పగించి చూస్తున్నాడు.


కుమిలిపోతున్న కొడుకుని చూసి, గంభీరంగా అన్నాడు తండ్రి.


"సిద్ధాంతిగారూ! మీరు వెళ్లిరండి. వారివ్వగల లాంఛనాలేవో వారినే నిర్ణయించి యివ్వమనండి" అన్నాడు.


2-8-'74 సంచికలో
అతకని
అనుబంధాలు
కొత్త సీరియల్
ప్రారంభం!

Printed and Published by S. NageswaraRao at the Andhra Patrika press, MallikarjunaRao Street, Gandhinagar, Vijayawada-3. Editor: S. Radhakrishna

సంతోషమే సగము బలము


అదేవిటో, నీకు చెప్పదల్చుకున్న విషయాలన్నీ, ఇక్కడే గుర్తు కొస్తాయిరా!!
నిశ్శబ్దం


ఆ చిత్రకారుడు ఒట్టి తాగుబోతండీ అతని చేత మీ చిత్రం వేయించుకోవద్దండీ అని చెప్తే విన్నారు కాదు!


ఏదో తేడా కనిపిస్తున్నదే
మతిలేనిదే లోనికి రాకూడదు


P.S.భాస్కరరావు సమర్పించు
శ్రీ లక్ష్మీనరసింహా ప్రొడక్షన్స్ వారి
కథ-మాటలు-స్క్రీన్‌ప్లే-దర్శకత్వం:
దాసరి నారాయణరావు
నిర్మాతలు:
మావుళ్లయ్య, రామతారకం
రాధమ్మ పెళ్లి